

తిరుమల తిరుపతి దేవస్థానములు
సప్తగిరి
సచిత్రమాసపత్రిక
సెప్టెంబరు 2020
వెల రూ.5/-
శ్రీవారి బ్రహ్మోత్సవ
ప్రత్యేక సంచిక
23-09-2020
బుధవారం
రాత్రి: గరుడవాహనం
తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవం
2020 సెప్టెంబరు 19 నుండి 27 వరకు

తిరుమల
శ్రీవేంకటేశ్వరస్వామివారి
బ్రహ్మోత్సవం
2020 సెప్టెంబరు
19 నుండి 27 వరకు



తిరుమల తిరుపతి దేవస్థానములు



## 19-09-2020 శనివారం
పగలు: ధ్వజారోహణం



## 19-09-2020 శనివారం
రాత్రి: పెద్దశేషవాహనం



## 20-09-2020 ఆదివారం
పగలు: చిన్నశేషవాహనం



designpsivaprasad



# గీతాశ్లోకార్థసారం

**శ్లో : తతః శ్వేతైర్హ యైర్యుక్తే మహతి స్యందనే స్థితౌ ।**
**మాధవః పాండవ శ్చైవ దివ్యౌ శంఖౌ ప్రద ధ్మతుః ॥**

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం-14వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** తతః= ఆ తర్వాత; శ్వేతైః= తెల్లనైన; హయైః= గుర్రాలతో; యుక్తే= కూడిన; మహతి= గొప్పదియైన; స్యందనే= రథంలో; స్థితౌ= ఉన్నట్టి; మాధవః= కృష్ణుడునూ; పాండవశ్చైవ= అర్జునుడునూ; దివ్యౌ= దివ్యములైన; శంఖౌ= తమ తమ శంఖాలను, ప్రదధ్మతుః= గట్టిగా పూరించారు.

**భావం:** తర్వాత. తెల్లనిగుర్రాలను పూన్చిన గొప్పరథంలో కూర్చుని ఉన్నట్టి శ్రీకృష్ణార్జునులిద్దరూ తమతమ దివ్యశంఖాలను గట్టిగా పూరించారు.

## నీకంటె మరిలేరు నిఖిలమింతయుఁ గాన


ఆలించు పాలించు ఆదిమపురుష క్షమ
జాలిదీర నీకే శరణుచొచ్చితిమి

గతి నీవే మతి నీవే కర్తవు భర్తవు నీవే
పతియు వీపె (నీవే?) యేపట్టునా మాకు
యితరము లెవ్వరున్నా రెంచిచూడ నిన్నుఁబోల
చతురుఁడ నిన్ననే శరణుజొచ్చితిమి

జననీజనకులు శరణము నీవే
వునికి మనికి నీవే వుపమ నీవే
మనసిచ్చి నీవే నన్ను మన్నించుకొంటేనే
చనవి మనవి నీకే శరణుచొచ్చితిమి

లోకసాక్షివి నీవే లోకబంధుఁడవు నీవే
యీకడ శ్రీవేంకటేశ యిదివో నీవె
నీకంటె మరిలేరు నిఖిలమింతయుఁ గాన
సాకారరూప నీకే శరణుజొచ్చితిమి

(సంపుటం-4, సంకీర్తన-338)





ఓ ప్రభూ! మాకు అన్నివేళల గతివి, మతివి, కర్తవు, భర్తవు, ప్రభుడవు నీవే! ఆలోచించగా నీకు సాటి మరెవ్వ రున్నారు? లేరని భావం. కాపాడే సామర్థ్యం గల నిన్నే శరణుపొందుతున్నాం. మా స్థితి, జీవనం, ఉపాయంకూడా నీవే. మనసిచ్చి మన్నించేవాడ వగుటచేత నిన్నే శరణుజొచ్చాము. లోకాలకు సాక్షివి, లోకబాంధవుడవు అయిన నీవు శ్రీవేంకటేశ్వరుడవై ఉన్నావు. లోకాలన్నింటినీ కాపాడుటకు నీవు తప్ప మరెవ్వరూ లేరు. మాకు నీవే శరణం!!



తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టు

"మానవసేవయే మాధవసేవ"- అన్న లక్ష్యంతో తి.తి.దేవస్థానములు వివిధ సామాజిక సంక్షేమకార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా అనాథ బాలబాలికలకు చేయూతనివ్వాలనే సంకల్పంతో 1943వ సం॥లో శ్రీవేంకటేశ్వర బాలమందిర్(తిరుపతి) ట్రస్టును స్థాపించింది. ఈ శ్రీవేంకటేశ్వర బాలమందిరంట్రస్టు ప్రస్తుతం శ్రీవేంకటేశ్వర జలనిధిపథకం, కల్యాణమస్తుట్రస్టు, శ్రీవేంకటేశ్వర సమాచార సాంకేతికట్రస్టులను కలుపుకుని 'శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టు'గా రూపొందింది.

## శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టు లక్ష్యాలు

**01)** అనాథలైన బాలబాలికలు, వృద్ధులు, నిరాశ్రయులు, అభాగ్యులు, నిరుపేద బలహీనవర్గాలవారి అభివృద్ధి, సంరక్షణ, సంక్షేమాలకోసం ధర్మశాలలు, వసతిగృహాల ఏర్పాటు.

అనాథలకు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థినీవిద్యార్థులకు ఆర్థికంగా చేయూతనివ్వడం;

**02)** దివ్యాంగులకు, మానసికరోగులకు తగు వైద్యసదుపాయాలు కల్పించి వారి జీవితప్రమాణాలను మెరుగుపరచడం. ఈ లక్ష్యంలో కుల, మత, జాతి, వర్గ, వర్ణ భేదాలను పాటించక అందరినీ సమానంగా స్వీకరించడం.

**03)** వరదలు, కరవువంటి ప్రకృతివిపత్తులసమయాల్లో అగ్నిప్రమాదాలవంటి అవాంఛనీయసంఘటనలు జరిగినపుడు సత్వరసహాయచర్యలు గావించడం.

**04)** వినికిడిలోపం, మాటలురాని శిశువులకు, ఈ లోపాలతో ఎదిగిన పిల్లలకు పునరావాసకేంద్రాల్ని ఏర్పాటుచేయడం.

**05)** గ్రామాలలో పై లోపాలతో ఉన్న బాలబాలికలకు అవసరమైన పరికరాలను అందజేయడంతోపాటు వారిని విద్యావంతుల్ని చేయడం.

**06)** సమాజంలో కనీస అవసరమైన త్రాగునీటిని నిత్యం అందుబాటులో ఉంచడం. తిరుమల పంచాయతి, తిరుపతి కార్పోరేషన్‌కు అవసరమైన నీటివనరులఏర్పాటుకై ఆనకట్టలు,




తొట్టెలను ఏర్పాటుచేయడం. నీటిపొదుపుకు అవసరమైన చర్యలు తీసుకోవడం.

**07)** శ్రేయస్కరమైన వివాహకార్యక్రమాలద్వారా వధూవరులు గౌరవాభిమానాలతో, ఉన్నతకుటుంబజీవితంతో గడిపేలా చేయడం.

**08)** పుస్తకాలతోపాటు, ఇంటర్‌నెట్‌వంటి ఆధునిక సాంకేతిక సదుపాయాలతో మనదేశ చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదను భవిష్యత్తరాలకు అందజేయడం.

**09)** సామాజిక క్రమశిక్షణ, నైతికవిలువల్ని పెంపొందిస్తూ యువతరంలో ఆత్మవిశ్వాసం కలిగించటం.

**10)** పైన పేర్కొన్న ఆశయాలసాధనకు కృషిచేస్తున్న వ్యక్తులకు, సంస్థలకు సహకారమందించడం.

## శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టుకు విరాళాలు ఇలా....

**01)** ఈ పథకంకోసం కనీస విరాళం రూ.1000/- గా నిర్ణయించబడింది.

**02)** రూ.1000/- కంటే తక్కువవిరాళం శ్రీవారి హుండీఖాతాలో జమ చేయబడుతుంది. ఈ విరాళాలన్నీ కూడా ఒకే జాతీయబ్యాంకులో డిపాజిట్ చేయబడతాయి, వాటిమీదవచ్చే వడ్డీ ఈ పథకంకోసం వినియోగింపబడుతుంది. దాతలు తమ విరాళాలను 'ది ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్టు, తి.తి.దే.,తిరుపతి' వారి పేరిట ఏదైన షెడ్యూల్‌బ్యాంకుమీద తీసిన చెక్కు/ డిమాండ్‌డ్రాఫ్ట్‌ద్వారా 'చీఫ్ అకౌంట్స్ ఆఫీసరు, తి.తి.దే., తిరుపతి-517501' వారికి పంపవచ్చు.

ఇతర వివరాలకు 0877-2264258ను సంప్రదించగలరు.

50 వసంతాల
1970-2020
తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 51 సెప్టెంబరు, 2020 సంచిక : 04




వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన ।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥

## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| తిరుమల సంపద | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 07 |
| వీథుల వీథుల విష్ణుసంచారం.... | ప్రాచార్య కోసూరి దామోదరనాయుడు | 08 |
| దివ్యక్షేత్రం... తిరుమల | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 11 |
| ముగ్గురు సాక్షులతో.. స్వామికల్యాణం | బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుశర్మ | 12 |
| అదివో అల్లదివో హరివాసము... | డా॥ మేడికుర్తి ఓబులేసు | 14 |
| ఈ ప్రదక్షిణతోనే ఆరంభం... | శ్రీ గోపీకృష్ణ | 16 |
| ఎన్నెన్నో అందాలు.... | డా॥ ఈ.ఎ. శింగరాచార్యులు | 18 |
| మొక్కుబడుల దేవుడు.... | ప్రాచార్య కట్టమంచి మహాలక్ష్మి | 20 |
| తెర తొలగించిన పాట... | శ్రీమతి పి.విజయలక్ష్మి | 23 |
| అరచేతి దైవం.. | శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు | 25 |
| శ్రీవేంకటేశచరణౌ శరణం ప్రపద్యే | డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య | 31 |
| అనంతపద్మనాభ వ్రతకథ | డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య | 35 |
| ఇదొక్కటుంటే చాలు.... | శ్రీమతి కిళాంబి లక్ష్మి | 39 |
| దేవదేవుడి పాదరక్షలు... | శ్రీ బి.వి.రమణ | 40 |
| కనులకు వెలుగువు నీవే కావా.. | శ్రీ కె.టి. శేషాద్రి | 43 |
| ఆధ్యాత్మిక విశిష్టతకు ఆలవాలం | 'సారస్వతకళానిధి' ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి | 44 |
| పితృదేవతలకు ప్రీతికరం | శ్రీ డి.వి.ఆర్. భాస్కర్ | 46 |
| తోమని పళ్యాలవాడు | ప్రాచార్య గార్లపాటి దామోదరనాయుడు | 48 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ టి.వి.కె.పూర్ణప్రసాద సిద్ధాంతి | 51 |
| హరిదాస వాఙ్మయంలో శ్రీవేంకటాచలాధీశుడు | శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు | 52 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : శ్రీవారి గరుడోత్సవం (తిరుమల)
వెనుక చిత్రం : శ్రీవారి చక్రస్నానం (తిరుమల)


గౌరవ సంపాదకుడు
శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-ప్రధాన సంపాదకుడు
ఆచార్య కె.రాజగోపాలన్, పిహెచ్.డి.,

సంపాదకుడు
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉపసంపాదకుడు
డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

ముద్రాపకుడు
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు
సప్తగిరి మాస పత్రిక
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.



24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777
2233333

వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri_helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

సంపాదకీయం

# ఏ తావు నుండైనా నీకొండ చేరేము...

బ్రహ్మ కడిగినపాదము- బ్రహ్మము తానే నీ పాదము... అని ఎన్నడో అన్నమయ్య సన్నుతించిన పాదయుగళిని, 'తెరతీయగరాదా?' అని వాకిట నిలబడి భక్తిపూర్ణహృదయుడై త్యాగయ్య అర్థిస్తే తెర తొలగించిన దివ్యమంగళస్వరూపాన్ని... విజయనగరసామ్రాజ్యాధినేత- అష్టదిగ్గజాలను తనకొలువు కూటమిలో కుదురుగ కూర్చుండబెట్టుకున్న సాహితీసార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలు... ఒకటికి ఏడుసార్లు సందర్శించిన తేజోమయమూర్తిని... త్రిమతాచార్యులు - ఆదిశంకరులు, మధ్వాచార్యులు, రామానుజాచార్యులు, సందర్శించిన పరమాత్మస్వరూపాన్ని సందర్శించడానికై.... వస్తున్నారు! వస్తున్నారు! ప్రతిదినమూ వస్తున్నారు! 'ఏడుకొండలవాడా! వేంకటరమణా! ఆపద మ్రొక్కులవాడా! అనాథరక్షకా! గోవిందా!' అని గొంతెత్తి ప్రార్థిస్తూ వస్తున్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి మాహాత్మ్యంవల్ల తిరుమలక్షేత్రంలో నిత్యకల్యాణాలు పచ్చతోరణాలు! ఇక్కడి గాలిలో వేదమంత్ర నాదాలు! ఇక్కడిమట్టిలో భక్తిభావాలు! రాళ్లలో దేవతారూపాలు! ఈ గాలిని పీల్చి, ఇక్కడితీర్థాన్ని స్వీకరించి, ఇక్కడిమట్టి పై తిరుగాడి... నామాలయ్యను సందర్శిస్తే జన్మతరిస్తుందని భక్తుల విశ్వాసం.

'న మే భక్తః ప్రణశ్యతి!' అని శ్రీకృష్ణభగవానునిఅభయప్రదానం! శ్రీనివాసుణ్ణి అర్థించిన భక్తులకు సకలమనోరథాలు సఫలమౌతాయి. భక్తులు మనసుతోనే అర్థిస్తారు. క్షణకాలం భౌతిక నేత్రాలతో, చిరకాలం, మనోనేత్రంతో స్వామిని దర్శిస్తారు. సర్వవ్యాపకుడైన స్వామివారు వారి మనోరథాలు గుర్తించి, వాళ్లను అనుగ్రహించి, ఆనందపరవశుల్ని చేస్తూ- ఆనందనిలయు డనే పేరు సార్థకం చేసుకుంటున్నాడు. 'ఆనందమే బ్రహ్మం' అని ఉపనిషత్తు. కనుక ఈ బ్రహ్మోత్సవాలు పరమాత్మ సంబంధమైన ఆనందోత్సవాలు. ఆ పరమాత్ముడే శ్రీనివాసుడు! స్వామిని భక్తులు అడిగే విషయాలు, ఆ స్వామి అనుగ్రహించే విధానం, స్వీకరించే మొక్కుబళ్ళు ఇవన్నీ... స్వామికీ, భక్తునికీ మాత్రమే తెలుస్తాయి. కానీ, అడిగినవారికి లేదనకుండా ఇస్తున్నాడన్నమాటమాత్రం సత్యం. సత్యం, పునఃసత్యం! స్వామిలో జనాకర్షణ, భక్తుల్లో ఆనందాకర్షణ నెలకొన్నాయి. కనుకనే కోరినవారికి కొంగు బంగారమని, క్షణసందర్శనభాగ్యంతో క్షణభంగురమైన జీవితాన్నే తరింపజేసే కలియుగప్రత్యక్ష దైవమని పురాణవాక్కు.

అధికమాసంవస్తే స్వామివారికి రెండుబ్రహ్మోత్సవాలు నిర్వహించబడుతాయి. ఈ సంవత్సరం అధికమాసం ఆశ్వయుజం వచ్చింది. బ్రహ్మోత్సవాలు స్వామికీ, భక్తులకూ యావద్విశ్వానికి ఉత్సవాలే! ఈ ఉత్సవాలు సర్వదేతలకూ ఆనందోత్సవాలు! భక్తులు క్రమశిక్షణతో, సద్భక్తితో, సంప్రదాయ పరిరక్షణతో ప్రవర్తిస్తూ, కేంద్రరాష్ట్రప్రభుత్వాలు విధించిన కరోనానిబంధనల్ని దృష్టిలో పెట్టుకుని, వాటిని పాటిస్తూ ఈ మహోత్సవాలను విజయవంతం చేయడంలో స్వామిని ప్రార్థించి అనుగ్రహాన్ని పొందుదురు గాక!

శ్రీవేంకటాచలాధీశం శ్రియాధ్యాసితవక్షసమ్।
శ్రితచేతనమందారం శ్రీనివాస మహం భజే ॥

# తిరుమల సంపద

**- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ**

వేంకటగిరి స్థూలనేత్రాలకు కొండగా కనిపించినా, సూక్ష్మదృష్టికి ఇది విష్ణుచైతన్యవిలసితం.

'వేదములే శిలలై వెలసినదీకొండ. యే దెస పుణ్య రాసులే ఏరులైనదీ కొండ, పదివేలశేషుల పడగలమయమైన' దివ్యపర్వతమిది... అని అన్నమయ్య దర్శించాడు.

ప్రాచీనఆధ్యాత్మికగ్రంథాల్లో ఉన్న ప్రశస్తితోపాటు, భారతీయచారిత్రక, సాంస్కృతికవైభవాలకుకూడా ఈ గిరి ఆధారం.

ఈ కొండను, ఈ దైవాన్ని కొనియాడుతూ అద్భుతమైన సాహిత్య, సంగీత, శిల్పకళాదులు విస్తరిల్లాయి. ముఖ్యంగా ఆంధ్రసాహితీ, సంగీతాల్లో అగ్రస్థానాన్ని అలంకరించిన అన్నమయ్య తన ప్రాణభావకళాసృజనలను ఈ స్వామికే కైంకర్యం చేశాడు.

శ్రీకృష్ణదేవరాయలు తన 'ఆముక్తమాల్యద' ప్రబంధాన్ని ఈ వేంకటభర్తకే అంకితం చేశాడు.

ఆళ్వారుల రచనలు స్వామిని అనేకంగా కీర్తించాయి. పేయాళ్వారు, పొయ్గై ఆళ్వారు, తిరుమంగై ఆళ్వారులు స్వామిని కొనియాడారు.

తిరుమలనంబి(శ్రీశైలపూర్ణులు), భగవద్రామానుజులు, కురువనంబి, అనంతాళువారు మొదలైన భక్తాచార్యులు శ్రీనివాసుని దివ్యతత్త్వాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు.

**"ఒప్పులకుప్పయై ధరమహోన్నతుడై వెలుగొందుచుండు మా అప్పుడు వేంకటేశ్వరు దహర్నిశమున్ కమలా సమేతుడై..."** అని కీర్తించిన తరిగొండ వేంకమాంబ 'శ్రీ వేంకటాచల మాహాత్మ్యం' రచించింది. పలుకీర్తనలతో ఆరాధించింది.

శ్రీనివాసుడు భక్తవాత్సల్యమూర్తి. ఆయన సేవలు భక్తులపై తాను చూపించిన కృపకు సంకేతాలు. స్వామి గర్భగుడి గడప- కులశేఖరాళ్వారుల రూపం.

నిరంతరం శ్రీవేంకటేశదర్శనాన్ని కోరిన కులశేఖరులు గడపగా మారాడు. కురువరతినంబి అలనాడు మట్టిపాత్రలో నివేదన చేసినదానికి గుర్తుగా నేటికీ స్వామివారికి మట్టిపాత్రల్లోనే ఆరగింపు. 'పడి'కి ఆవల స్వామికి నివేదించేది మట్టిపాత్రలోనే.

తరిగొండవారిహారతి, అన్నమయ్యవారిపాట ఇప్పటికీ కొనసాగుతున్నాయి. అనంతాళువారిభక్తికి సంకేతంగా స్వామి గడ్డంపై పచ్చకర్పూరం, తిరుమలనంబివారిసేవకు ప్రతీకగా ఆకాశగంగాజలం స్వామిభక్తవాత్సల్యానికి చిహ్నాలు.

యోగపరంగా చూస్తే- మనలోని మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూర, అనాహత, విశుద్ధ, ఆజ్ఞాచక్రాలను దాటి, సప్తమస్థానమైన పరంధామాన్ని (సహస్రారాన్ని) చేరుకునే యోగసాధన ఈ సప్తగిరియాత్రలో సంకేతం.

ఈ ఏడుచక్రాలప్రయాణంలోని యోగశక్తి కుండలినిని యోగవిద్యలో సర్పంగా సంకేతించారు. ఈ సర్పస్ఫురణే 'శేషాచలం'గా ఈ పర్వతంలో ద్యోతకమౌతోంది.

స్వామిపుష్కరిణిలో సరస్వతీనది అంశగా ప్రవేశించిందని పురాణకథ.

లెక్కలేనన్ని తీర్థాలు, కోనేరులు ఈ పర్వతశ్రేణిలో ఉన్నాయి. దేవతలు, మహర్షులు, ఆచార్యులు, భక్తులు, తపస్వులు అనాదిగా ఆశ్రయించి, ఆరాధిస్తున్న వేంకటాద్రి చరిత్రకీ, సంస్కృతికీ, ఆధ్యాత్మికతకీ, భక్తికీ ఆధారమై విరాట్ హైందవచైతన్యాన్ని విశ్వవ్యాప్తం చేస్తోంది.

ఆపద్బాంధవుడుగా, భక్తవత్సలుడుగా, సర్వదేవతామయుడుగా ప్రకాశిస్తున్న నారాయణబ్రహ్మం- శ్రీ తిరుమలగిరి ప్రభువు.



# వీథుల వీథుల విష్ణు సంచారం...

- ప్రాచార్య కోసూరి దామోదరనాయుడు

తిరుమలలో నిత్య, వార, పక్ష, మాసాది ఉత్సవాలెన్నో జరుగుతున్నా అత్యంతప్రధానమైంది బ్రహ్మోత్సవం. తిరుమల బ్రహ్మోత్సవం 'వైఖానస ఆగమప్రకారం' జరుగుతుంది.

మరీచిమహర్షి విమానార్చనకల్పం బ్రహ్మోత్సవాలు తొమ్మిది రోజులు, ఏడురోజులు, ఐదురోజులు జరుపవచ్చని సూచించింది. పరిస్థితులకు అనుగుణంగా అవసరమైతే మూడు రోజులు జరుపవచ్చని వెసులుబాటు కల్పించింది. అయినా తొమ్మిదిరోజులపాటు జరపడమే ఉత్తమోత్తమం.



దక్షిణభారతదేశంలోని ఆలయాలన్నిట ఉత్సవ మూర్తులు తప్పనిసరిగా ఉంటాయి. ఈ ఉత్సవమూర్తులే ఆలయాలకు రాలేని వృద్ధులకు, స్త్రీలకు, పిల్లలకు మాడ వీథులలో మూలవరులను దర్శించినభాగ్యాన్ని ప్రసాదించడం విశేషం. ఈ ఉత్సవమూర్తులే బ్రహ్మోత్సవాలలో వాహనాలపై ఊరేగడం ఒక విశిష్టత.

బ్రహ్మోత్సవవాహనాదులపట్ల కాలక్రమంలో చాలామార్పులు వచ్చాయి. భృగుసంహిత 21 రోజులలో వాడదగ్గవాహనాలను విపులీకరించింది.

తొలిరోజు ఉదయం శుక, రాత్రి హంస
రెండవరోజు ఉదయం మృగేంద్ర, రాత్రి శరభ
మూడవరోజు ఉదయం కపీంద్ర, రాత్రి ప్రభా
నాల్గవరోజు ఉదయం కల్పవృక్ష, రాత్రి పంచాగమ
ఐదవరోజు ఉదయం గరుడ, రాత్రి అర్ధచంద్రిక
ఆరవరోజు ఉదయం గజవాహనం, రాత్రి పాళి
ఏడవరోజు ఉదయం పుష్పకవిమానం, రాత్రి నేతుల
ఎనిమిదవరోజు ఉదయం డోల, రాత్రి అశ్వ
తొమ్మిదవరోజు ఉదయం విమానం, రాత్రి యాన
పదవరోజు ఉదయం శిబిక, రాత్రి గజలక్ష్మిఅలంకారం
పదకొండవరోజు ఉదయం కచ్ఛప, రాత్రి పున్నాగవృక్ష
పన్నెండవరోజు ఉదయం కృష్ణసారం, రాత్రి మత్స్య
పదమూడవరోజు ఉదయం కూర్మ, రాత్రి తల్ప
పదునాల్గవరోజు ఉదయం కౌతుకరథ, రాత్రి శార్దూల
పదిహేనవరోజు ఉదయం కుండలీ, రాత్రి గండభేరుండ
పదహారవరోజు ఉదయం ప్రభాపీఠ, రాత్రి ఐంద్ర
పదునేడవరోజు ఉదయం గిరివాహనం, రాత్రి పనస
పద్దెనిమిదవరోజు ఉదయం కాళీయ, రాత్రి చక్రవాహన
పందొమ్మిదవరోజు ఉదయం ఆతప, రాత్రి పారిజాత
ఇరవైవరోజు ఉదయం ధ్వజ, రాత్రి శంఖ
ఇరవైఒక్కటవ రోజు రథం.

21 రోజుల వాహనాలు పేర్కొని చివర 14 లేక 9 రోజులు బ్రహ్మోత్సవాలు జరుపవచ్చు.

మరీచి విమానార్చన కల్పం మాత్రం శిబిక- రథ- రంగడోల ముఖమంటప- గజ- తురంగ- సింహ- వ్యాళ- హంస- భ్రమర- గరుడవాహనాల్ని పేర్కొంది.

తరిగొండ వెంగమాంబ వేంకటాచల మాహాత్మ్యంలో మూడుచోట్ల వాహనాల ప్రసక్తి (2-114, 5-311, 6-213) కనిపిస్తుంది.

ఏది ఏమైనా బ్రహ్మోత్సవాలలో గరుడోత్సవం, రథోత్సవాలు ప్రాధాన్యం. ప్రత్యేకించి తిరుమల శ్రీనివాసుని ఐతిహ్యంలో గరుడప్రసక్తి చాలాచోట్ల కనిపిస్తుంది.

'శ్రీవేంకటాచలమాహాత్మ్యం' పరిశీలిస్తే ప్రధానంగా బ్రహ్మోత్సవాలలో రథోత్సవానికే ప్రాధాన్యమని చెప్పక తప్పదు. శ్రీవేంకటాచలమాహాత్మ్యంలో బ్రహ్మ స్వామితో **మీకున్నతమైన రథోత్సవంబు సేయింపవలె (2-104)** అన్నాడట. అలాగే విశ్వకర్మ **ఘనతర మేరుతుల్యముగ గాంచన రత్నంబు (2-105)** తీర్చినాడట. ఆపై స్వామి రథవాహన మెక్కి మాఢవీథులలో ఊరేగుతుంటే కొందరు వాసుదేవ తత్త్వంబును, కొందరు చిత్స్వరూపునిగా, కొందరు వేదశ్రుతి సారంగా, కొందరు పరవశులయినవారుగా కనబడ్డారు.

బ్రహ్మోత్సవాలలో రథోత్సవసమయంలో సాగే గాన నాట్యాదులను తరిగొండవెంగమ్మ వర్ణించినతీరు రమణీయం.

**పరమభాగవతుల సద్భక్తితోఁ బాడుచు**
**నుప్పొంగి యాడుచు నుండఁగాను,**
**గరములు ద్రిప్పి భోగస్త్రీలు ముందఱ**
**జతులుగా నృత్యము ల్సలుపఁగాను,**
**గ్రమముగ వందిమాగధసూతబృందము**
**లుపురుషోత్తమ ఖ్యాతిఁ బొగడఁగాను,**
**శిరములఁ గలశము ల్దేర్చి కొందఱు భక్తు**
**లొక్కెడఁ బ్రేరణల్ ద్రొక్కఁగాను,**

**మొనసి కొందఱు 'గోవింద!' యనుచు భక్తి**
**పరవశత్వముచే మించి పలుకగాను**
**రథముపైఁ దండులములను, రత్నములను**
**సతులు మేడలపై నుండి చల్లఁగాను (2-132)**

ఇతర వాహనాలకంటే రథోత్సవానికి ఇంత ప్రాముఖ్యం ఏర్పడడానికి ప్రధానంగా రెండుకారణాలు. మొదటిది రథం-సంచారదేవాలయం కావడం. ప్రధాన ఆలయానికి ఎన్నిహంగులున్నాయో అన్నిహంగులు రథానికి కూడా ఉన్నాయి. ఇంతేగాక దక్షిణభారతదేశంలో రథాకార మైన దేవాలయాలుకూడా ఉన్నాయి. ఇంతేగాక కఠోపనిషత్తు దేహాన్ని రథంగా నిరూపించింది.

ఇదేగాక ఇతరవాహనాలలో సామాన్యప్రజలు మోయడానికి అవకాశం తక్కువ. కాని రథవాహనం కదలడానికి అందరూ అర్హులు కావడం ఒక్క విశేషం.



## అంకురార్పణ

**బ్రహ్మోత్సవాలు అంకురార్పణ కార్యక్రమంతో ప్రారంభమౌతాయి. ప్రారంభానికి ముందురోజు రాత్రి ఆలయానికి నైరృతిదిశలో ఉన్న వసంతమండపానికి మేళతాళాలతో చేరుకుంటారు. నిర్ణీత పవిత్రప్రదేశంలో భూదేవి ఆకారంలో లలాట, బాహు, స్తన ప్రదేశాలనుంచి మట్టిని తీసుకుని, ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంటారు. యాగశాల్లో ఈ మట్టితో నింపిన తొమ్మిది పాళికలలో (కుండలు) నవధాన్యాలను పోసి, ఆ మట్టితో మొలకెత్తించే పని ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికంతా సోముడు (చంద్రుడు) అధిపతి. శుక్లపక్ష చంద్రునిలా పాళికలలో నవధాన్యాలు దినదినాభివృద్ధి చెందేలా ప్రార్థిస్తారు. నిత్యం నీరుపోసి, అవి మొలకెత్తేలా జాగ్రత్తపడతారు. అంకురాలను ఆరోపింపచేసే కార్యక్రమం కాబట్టి దీన్ని అంకురార్పణం అంటారు.**




తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# బాలవాక్కు!

**పిల్లలూ.... మీరూ రాయండి !**

**పెద్దలూ...... మీరు ప్రోత్సహించండి !!**

బాలబాలికల్లో మన సంస్కృతిపట్ల, ధర్మంపట్ల, పురాణాలపట్ల, భగవంతుని పట్ల, పెద్దలపట్ల చక్కని అవగాహన కలిగించటానికి, ఆధ్యాత్మిక ఆలోచనల్ని పెంపొందించ టానికి సప్తగిరి మాసపత్రిక ఈ వినూత్నశీర్షిక 'బాలవాక్కు'ను ప్రవేశపెట్టింది.

## ఎవరు రాయవచ్చు...

ఆరవతరగతినుండి పదవతరగతివరకు చదువుతున్న బాలబాలికలందరూ రాయవచ్చు.

## ఏం రాయాలి?

మీరు చదివిన లేక మీరు విన్న ధార్మికకథలు, హరికథలు, పురాణాలు, ఇతిహాసాలు, నీతిశతకాలు మొదలైనవాటిల్లోని ఆధ్యాత్మికసారాంశాన్ని ఆధారంగా చేసుకొని, మీరు కథగానో, కవితగానో, వ్యాసంగానో లేక భగవంతుడిపట్ల మీ ఆలోచననో రాయొచ్చు. మీరు పంపే రచనలకు తగ్గట్టు వర్ణచిత్రాలుకూడా వేసి పంపవచ్చు.

## పెద్దలు చేయవలసింది...

పిల్లల్లో మన పురాణ, ఇతిహాసాలపట్ల జ్ఞానాన్ని పెంపొందించడానికి వారికి తగిన సలహాలను ఇచ్చి, చిన్న చిన్న ఆధ్యాత్మికగ్రంథాలు చదివించి, వారిని ప్రోత్సహించి, రాయించండి!

## నిబంధనలు...

1) రచన రెండు అరటావులకు మించరాదు. కాగితానికి ఒకవైపు మాత్రమే రాయాలి. రచన స్పష్టంగా, అర్థమయ్యేలా ఉండాలి.

2) పూర్తిచిరునామా, పాస్‌పోర్టుసైజుఫోటోతోపాటు, **రచన మీ సొంతమేనన్న ధ్రువీకరణపత్రాన్ని, మీరు చదువుతున్న పాఠశాల హెడ్‌మాస్టర్ సంతకంతో జతచేయాలి.**

3) **మీ రచనలు పోస్టుద్వారా పంపాల్సిన చిరునామా:** ప్రధానసంపాదకుడు, సప్తగిరికార్యాలయం, తి.తి.దే. ప్రెస్‌కాంపౌండు, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507.


4) **తెలుగులో డిటిపి చేసి, మెయిల్‌ద్వారా పంపాలనుకుంటే** పేజిమేకర్‌లో అనుఫాంట్స్‌లో (లేదా) ఎం.ఎస్.వర్డులో యూనికోడ్ ఫాంట్‌లోగాని టైపు చేసిన ఫైల్ మరియు **PDF** ఫైల్ కూడా తప్పని సరిగా **telugusubeditor@gmail.com** మెయిల్ ఐడికి పంపగలరు.

5) ప్రచురించిన రచనలకు శ్రీవారిఅక్షరప్రసాదంగా ఐదుప్రతులు మీ చిరునామాకు పంపుతాము.

6) మీరు రచన పంపినతరువాత తుదినిర్ణయం ప్రధానసంపాదకునిదే!

7) రచనలపై ఎలాంటి ఉత్తరప్రత్యుత్తరాలకుగాని, ఫోన్ చేయడంలాంటివాటికిగాని చోటు లేదు.

**బాలల్లారా రాయండి..! శ్రీవారి ఆశీస్సులు పొందండి...!!**



*గత సంచిక తరువాయి భాగం...*

అక్కడ ఆలయంలో ఏదో కలకలం! ఆందోళన, అర్చకులు బిగ్గరగా అరుస్తున్నారు. స్వామివారి గడ్డంనుంచి రక్తం కారుతోంది. ఎవరు కొట్టారో, ఎంత గట్టిగా కొట్టారో చూడండి. అంటూ ఆ గాయానికి పచ్చకూర్పురపు పొడిని పెడుతూ వుండినారు.

అప్పుడే లోనికి వచ్చిన అనంతయ్యకు ఆ సాయంత్రం తాను గాయం చేసిన కుర్రవాడు శ్రీవేంకటేశ్వరస్వామివారి విగ్రహంలో కనపడ్డాడు. అయ్యో! స్వామివారినా నేను కొట్టింది? అని బాధపడుతూ, క్షమించుమని వేడుకొన్నాడు. ఈ కథను విన్న అర్చకులు, భక్తులు ఆశ్చర్యంతో ఆనందపడుతూ 'అనంతాళ్వార్' ఎంత భక్తుడో కదా? అని పొగిడారు.

ఆ పూలతోటను చూచినవాళ్లందరూ మెచ్చుకొంటూ ఉండినారు. ఆ తోట అందాల్ని చూద్దామని అలమేలుమంగ, శ్రీవేంకటేశ్వరస్వామివారు ఇద్దరూ ఒక రాత్రి వెళ్లారు. వెళ్లినవాళ్లు ఆ తోటలోని పూలన్నీ కోశారు. చెట్లన్నీ తుంచారు. ఇలా తోటంతా చిందర వందర చేశారు.

మరునాడు పొద్దున చూచిన అనంతాళ్వారుకు ఆ దొంగలపై చాలకోపం వచ్చింది, ఆ దొంగల్ని పట్టుకోవడానికి కావలి కాశాడు. చివరికి ఒక రోజురాత్రి నక్కి నక్కి ఇద్దర్ని భార్యాభర్తల్ని పట్టుకొన్నాడు. కాని వాళ్లలో మగవాడు తప్పించుకొని పారిపోయాడు. ఆ దొంగవానిభార్య దొరికింది. ఇంతే చాలని అనంతాళ్వారు కోపంతో ఆమెను చెట్టుకు కట్టాడు.



మరునాడు ఆలయం తెరువగా అర్చకులకు స్వామివారివక్షఃస్థలంలోని లక్ష్మీదేవి కనపించక ఆందోళనపడ్డారు. ఇంతలో వారితో వేంకటేశ్వరస్వామి ఇలా అన్నాడు. "అలమేలు మంగను అనంతాళ్వారు తనతోటలో కట్టివేశాడు. గౌరవంగా ఆమెను పిలుచుకొని రండి" అని ఆజ్ఞాపించాడు.

అంతే! అర్చకులు అందరూ వెళ్లి అనంతాళ్వారు కట్టివేసిన అలమేలుమంగతో కూడ ఆలయానికి బాజా భజంత్రీలతో పిలుచుకొని వచ్చారు. వెంటనే అమ్మవారు శ్రీస్వామివారివక్షఃస్థలాన్ని, చేరుకొంది. శ్రీస్వామివారు ఇలా అన్నాడు. 'మామా! అనంతాళ్వారూ! నీవు నాకు కన్య నిచ్చావయ్యా!' అంటూ పొగిడాడు.

నేటికీ పుష్పకైంకర్యంలో ఆయనవంశీయులు తరిస్తున్నారు. బ్రహ్మోత్సవాల అనంతరం శ్రీవేంకటేశ్వరస్వామివారు ఈ మధురఘట్టాన్ని స్మరింపచేస్తూ, "అనంతాళ్వారు తోట"కు ఊరేగింపుగా వెళ్తున్నారు. ఇదీ ఈ పరమభక్తుని దివ్యగాథ!

*(సమాప్తం)*



13

# దివ్యక్షేత్రం... తిరుమల

శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం

# ముగ్గురు సాక్షులతో... స్వామి కల్యాణం

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుశర్మ

**వివాహాలెలా ఉంటాయో వేంకటాచలంలో శ్రీవేంకటేశ్వర కల్యాణంలో మొదట చూపించారు. కలియుగంలో వివాహమంటే ఎంత ధనవంతుడైనా ఒకరూపాయి అయినా అప్పు చెయ్యవలసిందే. ఇదే సమస్య శ్రీవేంకటేశ్వరునికీ వచ్చింది.**

అప్పుచెయ్యమని అంటే వేంకటేశ్వరస్వామి నాకెవరిస్తారు అప్పు? అన్నారు. అప్పుచేసేటప్పుడు పెళ్ళికొడుకు పదిమంది ముందు అప్పు చేస్తే పిల్లనిచ్చేవాళ్లకు అనుమానం వస్తుందని, కొంచెం చెట్టుచాటుకు వెళ్లి మాట్లాడుకున్నారు. ఆదివరాహ స్వామిక్షేత్రంలో అశ్వత్థవృక్షంకింద మాట్లాడుకున్నారు. పరమ శివుడు మనదగ్గర డబ్బులేకపోయినా ఫరవాలేదు కానీ, నాకు బాగా డబ్బుకల స్నేహితుడు ఉన్నాడు.


"నా పక్కన ఎప్పుడూ కుబేరుడు ఉంటాడు. ఆయనను పిలిచి నీకు అప్పు ఇవ్వమని చెబుతానన్నాడు. కుబేరుని పిలిచి శ్రీనివాసునికి అప్పు కావాలి ఇవ్వమని అడిగారు. ఆయన మీకు అప్పు ఇవ్వడానికి లోటేముంది? ఇది కలియుగం కాబట్టి వడ్డీ పుచ్చుకుంటాం. అది తప్పేమీ కాదు. అందువల్ల వడ్డీ ఇస్తే అప్పు ఇస్తానని అన్నారు.

శ్రీవేంకటేశ్వరస్వామి ఆశ్చర్యపోయి "యుగధర్మానికి ఎవరైనా కట్టుపడవలసిందే! అలాగే వడ్డీ ఇస్తాను" అంటే, ఎంత అప్పుకావాలని అడిగారు.

'ఋణగ్రాహీ శ్రీనివాసః, ఋణదాతా ధనేశ్వరః' అని ప్రామిసరీ నోటు వ్రాశారు. ఇప్పటికీ ఆదివరాహస్వామి క్షేత్రానికి వెళితే ఎడమ పక్కన గోడమీద అద్దం కట్టి ఉంటుంది. మనం కావాలంటే చదువవచ్చు. హేవిలంబీ నామ సంవత్సరే చైత్రశుద్ధ దశమి ఫలానావారంనాడు అశ్వత్థవృక్షం కింద నిలబడి పదు నాలుగులక్షల రామచంద్రమూర్తిముద్రలు కలిగిన బంగారుకాసులను ప్రతినూరు కాసులకి ఒకకాసు వడ్డీ ఇచ్చేటట్లు, యుగాంతమయ్యేసరికి అసలు తీర్చేటట్లు నోటు వ్రాసి ఇచ్చి, "అయ్యా! డబ్బు ఇమ్మని" అడిగారు. నోటు వ్రాసి ఇచ్చినందుకు సంతోషమే కాని యుగధర్మం కనక సాక్షి ఉంటే డబ్బు ఇస్తాను అన్నాడు- చతుర్ముఖబ్రహ్మ వంక చూస్తూ. ఆయన నేను సాక్షి సంతకం చేస్తానన్నాడు. ఒక సాక్షి, ఒక కొడుకు ఉన్నా, ఉండక పోయినా ఒకటే! ఏమి అనుకోకుండా ఇంకొక సాక్షి సంతకం కావాలి అన్నాడు. వేంకటేశ్వరస్వామికి నమ్మకమైన స్నేహితుడైన పరమశివునివంక చూస్తే తాను చేస్తాను- అన్నారు. మీరు పెడితే మాకేం, తప్పకుండా ఇచ్చేస్తానన్నాడు- కుబేరుడు. పరమ శివుడు సాక్షిసంతకం పెట్టాడు.

కుబేరుడు ముగ్గురుసంతకం పెడితే ఎంత బాగుండునో, చాలా బలంగా అన్నాడు. అప్పిచ్చేవాడు ఎంత అందంగా మాట్లాడతాడో శ్రీవేంకటేశ్వరకల్యాణంలో చూపించారు. ఇచ్చేటప్పుడు ప్రకటనలు ఒకలా ఉంటాయి. నిజంగా డబ్బు ఇచ్చేటప్పుడు చాలా తర్కపూరితంగా ఉంటుంది.

మూడోవారు ఎవరా! అని తల పైకి ఎత్తి చూస్తే అశ్వత్థ వృక్షం కనపడింది. దానికన్నా ధర్మమూర్తి వేరొకరు ఉండరు. "నేను చేస్తాను మహాప్రభో!" అని ఆ వృక్షంకూడా సంతకం చేసింది. ముగ్గురుసాక్షులు సంతకాలు చేశాక అప్పిచ్చాడు. అప్పుడు సరుకులు తెప్పించారు. ఇదంతా నిజంగానే జరిగింది. స్వామి వింటున్నారు - అబద్ధం చెప్పకూడదు. స్వామికల్యాణం చదివితే కలియుగంలో కల్యాణం చెయ్యడమెంత కష్టమో తెలుస్తుంది. అన్నీ తెచ్చాక ఇవన్నీ తెచ్చుకోవడం ఒక ఎత్తు, వచ్చేవాడు మనఇంటికి భోజనానికి లేక వస్తాడా? ఇప్పటికిప్పుడు ముహూర్తం పెట్టుకుంటే వంటబ్రాహ్మణుడు ఎక్కడ దొరుకుతాడు? అనుకున్నారు. స్వామి అగ్నిహోత్రునివంక చూస్తే "నేను చేస్తాను స్వామి!" అన్నాడు. పాత్ర సామానులేవి? పెళ్లికి



వెళ్ళేటప్పటికి లేనివి అడిగే బంధువులు, మనశ్శాంతి లేకుండా చేసేవాళ్ళు, దిక్కుమాలిన సలహాలు ఇచ్చేవాళ్లు బోలెడంతమంది ఉంటారు.

అగ్నిహోత్రుడు పాపనాశనంలో పైన చింతపండు పిసికి పోసేయండి. కింద నేను పులుసు చేసేస్తాను అన్నాడు. తీర్థాలన్నిటిలోనూ పప్పులు, పులుసులు, చక్కెరపొంగళ్లు, కట్టుపొంగళ్లు, జీలకర్ర పొంగళ్లు, ఎన్నో రకాల పొంగళ్ళు, పులిహోరపొంగళ్ళు, చేసారు. వడ్డన చేయాలి కూర్చోమని అన్నారు. విస్తరిలో బూరె వేస్తే బాగా వంగి అందుకునేంత పెద్ద విస్తళ్లు. పత్రవిస్తీర్ణభోజనం అన్నారు. భోజనాలబంతులు వేంకటాచలం నుండి శ్రీశైలంవరకు వేశారు.

వచ్చినవాళ్ళందరూ కూర్చుంటే, "అయ్యా! ఆలస్యమై పోయింది. అందరూ సుష్టుగా ఆనందంగా ఆరగించండి. మా వల్ల అపరాధమేమన్నా ఉంటే క్షమించండి" అని వేంకటేశ్వర స్వామి, వకుళమాత అన్నారు. ఇంటికి పెళ్లి భోజనానికి వచ్చిన వారు సంతోషపడిపోరు. ఎన్ని పెట్టినా గుమ్మడివడియం ఉందా? అని అడుగుతారు. అందుకని కన్యాదాత ముందే చెపుతాడు. "అయ్యా! మీకు భోజనం పెట్టగలిగినవాడినా? ఉన్నదాంట్లో తీసుకుని వచ్చి పెట్టగలిగాను. మీరు దీంతో తృప్తిపొందండి. చంద్రునికి నూలు పోగులా" అంటే ఎంత గొప్పభోజనం పెట్టినా ఏదో సర్దుకుందా మని అంటారు. అందరూ భోజనాలు చేసి, బ్రేవుమని త్రేన్చి కూర్చున్నారు. అందరినీ భోజనమైందా అని పేరు పేరునా అడిగిన తరువాత స్వామి, వకుళమాత, మన్మథుడు భోజనం చేశారు.

ఇంటికి వచ్చిన అతిథులు భోజనం చెయ్యకుండా ఇంట్లో వారు భోజనం చెయ్యకూడదు. వచ్చిన అతిథులను శాస్త్రప్రకారం ఎలా తినాలో నేర్పారు – 'శ్రీనివాస కల్యాణం'లో. అలా భోజనాలు పెట్టిన తరువాత అందరూ ఆకాశరాజువిడిదికి బయలుదేరారు. మధ్యలో శుకబ్రహ్మ ఆశ్రమం కనపడింది. ఆయన మా ఇంట్లో ఆతిథ్యం స్వీకరించమని పిలిచారు. కొద్దిగా పులుసు అన్నం పెట్టారు. ఋషులకు కోపం వచ్చింది. శ్రీవేంకటేశ్వరస్వామిభోజనానికి వస్తే పులుసు అన్నం పెడతావా? శపిస్తామని కమండలంలోని నీరు చేతిలోకి తీసుకున్నారు. అలా ఉంటాయి రోజులు.

మనకి చాలా దగ్గరైన వ్యక్తి చాలా ఆప్యాయంగా ఉండేవాడు పెళ్ళికని బస్సుల్లో బయలుదేరితే మార్గమధ్యంలో మా ఇంట్లో కొద్దిగా టీ తీసుకుని వెళ్ళమని అంటారు. ఆ విషయం వెళ్ళే ముందరే చెపుతారు. అనుకోకుండా పాలు విరిగి పోయి గ్లాసు నిండా ఇవ్వలేక కొద్ది కొద్దిగానే టీ ఇస్తే వెనక బస్సులో దిగినవారు మెటికలు విరిచేస్తారు. చాలాగొప్ప స్నేహితుడని చెప్పాడు–ఎంత గొప్పగా పెట్టాడో చూడమని అంటారు. మహర్షులందరూ వేంకటేశ్వరస్వామివద్ద తమ గొప్ప చూపించడానికి చేతిలో నీళ్ళు పోసుకున్నారు. వేంకటేశ్వరస్వామి చూచి, ఒక్కసారి హుత్కారం చేస్తే వారందరికీ కడుపు నిండిపోయినట్లు బరువెక్కిపోయి త్రేనుపులు వచ్చి, ఈ భోజనమెలా పెట్టావు? యోగ మార్గంలో పెట్టావా? అని కింద పడిపోయారు. శుకబ్రహ్మ ఆశ్చర్యపోయి స్వామి నన్ను గట్టెక్కించారని స్వామికాళ్ళమీద పడ్డారు. ఆయనను నమ్ముకున్న భక్తులను ఆదరించడం తెలుసు. స్వామిని నమ్ముకుంటే జీవితాన్ని గట్టెక్కిస్తారు.

అందరూ ఆకాశరాజుగారి ఇంటికి వెళ్ళారు. అద్భుతంగా పద్మావతీశ్రీనివాసుల కల్యాణం జరిగింది. ఆరునెలల పాటు వివాహమైన దంపతులు కొండ ఎక్కకూడదు కనక, అగస్త్య మహర్షి ఆశ్రమంలో ఉండమని అన్నారు. ఆ క్షేత్రంలోని మూర్తిని కల్యాణవేంకటేశ్వరుడు అని పిలుస్తాము. ఆయన ఆరునెలలు ఆశ్రమంలో గడిపారు. తొండమాన్ చక్రవర్తికి ఇచ్చిన ఆదేశం మేరకు ఆనందనిలయం కట్టారు. పరమపావనమూర్తి అయి, ఏకబేరదేవాలయంలోని మహానుభావుడు స్వామి మనని కటాక్షిస్తున్నారు.



# అదివో అల్లదివో.. హరివాసము...

- డా॥ మేడికుర్తి ఓబులేసు

కృతయుగంతో సమానమైనయుగం, వేదంతో సమానమైనశాస్త్రం, గంగతో సమానమైనతీర్థం, జలదానంతో సమానమైనదానం, నిజదారసుఖంతో సమానమైన సుఖం, కృషితో సమానమైన ధనం, జీవితంకంటే శ్రేష్ఠమైన లాభం, ఉపవాసాన్ని మించినతపస్సు, ధర్మంతో సమానమైన మిత్రుడు, సత్యంతో సమానమైన యశస్సు లేనట్లే- సాక్షాత్తూ, భగవంతుని నివాస భూమియైన శ్రీవేంకటాద్రితో సమానమైనస్థానం ఈ సృష్టిలో మరొకటిలేదు. ఇంత గొప్పక్షేత్రాన్ని పదకవితాపితామహుడైన అన్నమయ్య అతిరమ్యంగా సంకీర్తించాడు. అన్నమయ్య తిరుమల కొండను కేవలం ఒక సామాన్యపర్వతంవలెగాక, పరమపవిత్ర ప్రదేశంగా భావించాడు.

కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ
తెట్టెలాయ మహిమలే తిరుమలకొండ

వేదములే శిలలై వెలసినది కొండ
యేదెసఁ బుణ్యరాసులే యేరులైనది కొండ
గాదిలి బ్రహ్మాదిలోకముల కొనలకొండ
శ్రీదేవుఁ డుండేటి శేషాద్రి యీకొండ

సర్వదేవతలు మృగజాతులై చరించేకొండ
నిర్వహించి జలధులే నిట్టచరులైన కొండ,
వుర్విఁ దపసులే తరువులై నిలిచిన కొండ
పూర్వపుటంజనాద్రి యీపొడవాటికొండ

వరములు కొటారుగా వక్కాణించి పెంచే కొండ
పరగు లక్ష్మీకాంతు సోబనపుఁ గొండ
కురిసి సంపదలెల్ల గుహల నిండిన కొండ
విరివైన దివివో శ్రీ వేంకటపుఁ గొండ. (3-471)

వేంకటాచలంతో సమానమైనప్రదేశం ఈ బ్రహ్మాండంలో ఎక్కడా కానరాదు! తిరుమలశిఖరాలు అత్యంతమహిమాన్విత మైనవి! ఇక్కడున్న చెట్లూ, పుట్టా అన్నీ మునులరూపాలే! ఈ కొండపైని శిలలన్నీ వేదాలే! మృగజాతులన్నీ దేవతాస్వరూపాలే! పుణ్యరాసులన్నీ ఏరులైనకొండ ఇది! శ్రీదేవుడు కొలువైన కొండ ఇదే! వరాలు కురిపించే ఈలక్ష్మీకాంతుని సోబనపుకొండ, మనముందు నిలిచిన వైకుంఠమే తిరుమల అని అన్నమయ్య పై సంకీర్తనలో తిరుమలను కీర్తించాడు.

అంతేగాదు ఈ శేషాద్రి (తిరుమల) అతిశయంబైన శిఖరాలతో కూడి ఉన్నదట! ఆ కొండ సరిలేని గోపురప్రభలతో ప్రకాశిస్తున్నదట! అంతేగాక శతకోటిసూర్యులతేజస్సుతోనూ వెలుగొందుచున్నదట.

ఇప్ప డిటు కలగంటి నెల్లలోకములకు -
నప్పడగు తిరువేంకటాద్రీశు గంటి ॥
అతిశయంబైన శేషాద్రి శిఖరము గంటి
ప్రతిలేని గోపురప్రభలు గంటి
శతకోటిసూర్యతేజములు వెలుఁగగఁ గంటి
చతురాస్యు పొడగంటి చయ్యన మేలుకొంటి !! (1-38)

అన్నమయ్యతలపుతరంగాలలో, కనులలో, కలలలో కొలువైయున్నది ఆకొండలరాయుడే! లోకజనకుడైన తిరు వేంకటప్పను, ఆ స్వామిదివ్యమంగళవిగ్రహాన్ని, తిరుగులేని ఆ దివ్యసౌందర్యాన్ని, శేషాచలశిఖరాల మణిమయకాంతులను స్వప్నంలో సాక్షాత్కరింపజేసుకున్నధన్యుడు - అన్నమయ్య. తిరుమలకొండను కలలో చూచిన అన్నమయ్య ఆ దివ్యధామాన్ని దర్శించడానికే మొదటగా తిరుమలకు బయల్దేరాడు.

తిరుమలక్షేత్రం చేరగానే అన్నమయ్యలో భక్త్యావేశం పెల్లుబికింది. ఆనందనిలయాన్ని చేరిన అన్నమయ్యలో ఆనందం ఉప్పొంగింది. ఆ ఆనందంలో చిందులు వేస్తూ ఆ భక్తశిఖామణి ఇలా గానం చేశాడు -

అదివో అల్లదివో హరివాసము
పదివేలు శేషుల పడగలమయము

అదె వేంకటాచల మఖిలోన్నతము
అదివో బ్రహ్మదుల కపురూపము
అదివో నిత్యనివాస మఖిలమునులకు
అదె చూడు డదె మొక్కు డానందమయము
.............................. (1-23)

అన్నమయ్య ఎనిమిదేండ్లవయస్సులో తొలిసారిగా తిరుమలకొండను దర్శించినపుడు, ఆ బంగారుశిఖరాల సౌందర్యానికి, పులకితుడై, పరవశుడై ఆనందతాండవం చేస్తూ పాడినపాటే పై సంకీర్తన. కైవల్యానికి సాధనమైన కొండ, సకల సంపదలకు రూపమైన కొండవైభవాన్ని అన్నమయ్య ప్రస్తుతించాడు.

ఇలా తన ఆనందాన్ని ప్రకటించిన అన్నమయ్య ఆనంద నిలయవాసుణ్ణి దర్శించడంకోసం బంగారువాకిలిదగ్గరకు వెళ్ళాడు. ఇతడు వెళ్లేసరికి ఆనందనిలయవాసుడైన శ్రీనివాసుడు


తనరూపసందర్శనతో భక్తులకు జ్ఞానాన్ని, ఆనందాన్ని ప్రసాదిస్తూ ఉన్నాడట! అతణ్ణి దర్శించగానే అన్నమయ్య పునీతు డయ్యాడట. అఖిలాండకర్తను దర్శించుకున్న అన్నమయ్య ఆపుణ్యప్రదేశ సందర్శనతో పునీతుడే కాదు, పులకితుడూ అయ్యాడు.

కంటి నఖిలాండకర్త నధికుని గంటి
కంటి నఘములు వీడుకొంటి నిజమూర్తిఁ గంటి ॥

మహనీయ ఘనఫణామణుల శైలము గంటి
బహువిభవముల మంటపములు గంటి
సహజనవరత్నకాంచనవేదికలు గంటి
రహి వహించిన గోపురంబు లవె కంటి ॥

పావనంబైన పాపవినాశనము గంటి
కైవశంబగు గగనగంగ గంటి
దైవికపు పుణ్యతీర్థములెల్ల పొడగంటి
కోవిదులు కొనియాడు కోనేరుఁ గంటి ॥

పరమయోగీంద్రులకు భావగోచరమైన
సరిలేని పాదాంబుజములు గంటి
తిరమైనగిరి చూపు దివ్యహస్తము గంటి
తిరువేంకటాచలాధిపు చూడఁ గంటి ॥ (4-58)




అఖిలాండకర్తయైన శ్రీవేంకటేశ్వరుని దర్శిస్తే చాలు! మన పాపా లన్నీ పటాపంచలైపోతాయి! అలాంటి మహనీయ కమనీయమూర్తిని, తిరుమలగిరులసౌందర్యాన్ని అన్నమాచార్యులవారు దర్శించి, భావావేశంలో ఆ అద్భుతసౌందర్యాన్ని సంకీర్తనం చేశాడు.

పరమపవిత్రమైన ఈకొండను కాలితో నడిచి వచ్చి, దీనిపవిత్రతకు భంగం కల్గించరా దని రామానుజుడు తిరుమలకు మోకాళ్ళపై వచ్చేవారట! అంతటిగొప్పది ఈ కొండ మాహాత్మ్యం! అలాంటి తిరుమలకొండను తననెలవుగా చేసుకున్నట్టి, ఎల్లలోకాలకు నాథుడైనట్టి, కనకాంబరధారియైనట్టి తిరువేంకటాచలాధిపుని దర్శించడానికి నానాదిక్కుల నరులెల్లరూ, శతసహస్రయోజనదూరవాసులంతా "కుండపోతవానలవంటి ఎంతటి క్లిష్టపరిస్థితులనైనా లెక్కచేయక తిరుమలకు చేరుకుంటారట!

నానాదిక్కుల నరులెల్లా
వానలలోననె వత్తురు గదలి ॥

సతులు సుతులు పరిసరులు బాంధవులు
హితులు కొలువఁగా ఇందరును
శతసహస్రయోజనవాసులు సు-
వ్రతములతోడనె వత్తురు కదలి ॥ (4-58)

నానాదిక్కులనుండి మానవులంతా బంధుమిత్రులతో మంచినియమాలతో వానలనుకూడా లెక్కచేయకుండా పరమాత్మునిదర్శనార్థం కొండకు వస్తారట! వారు ముడుపులు చెల్లించడానికి ఏకాలమైన లెక్కచేయకుండా తిరుమల కొండను చేరుకుంటారట! సామాన్యమానవులే గాక, చక్రవర్తులూ, రాజులూ శ్రీస్వామిని దర్శించటానికి తిరుమలకు తరలివస్తారట! అవును, జగత్తుకంతా చక్రవర్తి ఈ శ్రీనివాసుడు. ఇతని ముందర అందరూ సామాన్యులే!

తిరుమలకొండ పావనమైనది. బ్రహ్మమయమైనది. సచ్చిదానందస్వరూపమైనది. పరమాత్ముడైన వేంకటాపతి పాదస్పర్శతో పునీతమైన ఈ తిరుమలకొండ సాలగ్రామమయమై దివ్యధామంగా వెలుగొందుతూంది. ఈకొండయొక్క అణువణువూ భగవత్స్వరూపం. కలియుగ వైకుంఠం అయిన తిరుమల క్షేత్రాన్ని ప్రతిభక్తుడూ దర్శించి, శ్రీవారి కృపకు పాత్రుడు కావాలి!

# ఈ ప్రదక్షిణతోనే ఆరంభం...

- శ్రీ గోపీకృష్ణ

సచ్చిదానందస్వరూపుడు, ఆనందమయుడు, అర్చావ తారమూర్తి అయిన శ్రీవేంకటేశ్వరుని ఆవాసమే ఆనందనిలయం. దానిభౌతికస్వరూపమే విమానం. అందువల్ల **తిరుమలలోని శ్రీవేంకటేశ్వరుని గర్భగుడి మీద ఉన్న సువర్ణమయనిర్మాణాన్ని 'ఆనంద నిలయవిమానం' అంటారు.**

భవిష్యోత్తరపురాణాన్ని ఉదహరిస్తూ శ్రీవేంకటాచల మాహాత్మ్యం గ్రంథంలో ఒక కథ ఉంది-ఒక రోజు వాయుదేవుడు ఆదిశేషునితో వాదిస్తూ పందానికి దిగాడు. పందెం ప్రకారం ఆదిశేషుడు మేరుపర్వతపుత్రు డైన ఆనందపర్వతాన్ని చుట్టు కున్నాడు. అతణ్ణి కదలించడానికి వాయుదేవుడు తన సామర్థ్యం అంతా వినియోగించినా వీలుకాలేదు. చివరకు శేషునితో ముడి పడిన ఆనందాద్రిని భూలోకంలో సువర్ణముఖరీనది ఉత్తర తటానికి తోశాడు. శేషుడు పశ్చాత్తాపంతో శేషాచలపర్వతంగా రూపొందాడు. ఆతనిశిరస్సుమీద ఆనందపర్వతం ఆనంద నిలయవిమానంగా మారిపోయింది. (1-85 నుంచి 132)

ఆదిత్యపురాణంలో (1-42) ఇలా ఉంది.

**ఆనందజ్ఞానదం విష్ణుం ఆనందమయనామకమ్,**
**ఆనందేన దదర్శాథ ఆనందనిలయాలయే.**


ఆనందనామకం, అదే ఆనందనిలయం, అదే విష్ణువు. ఆ విష్ణువిచ్చే జ్ఞానం కూడ అదే. ఆయనదర్శనంలో లభ్య మయ్యేది, ఆయన సన్నిధిలో మనం అనుభవించేది అంతా ఆనందమే.

ఆనందాద్రి పరమానందం బ్రహ్మానందం కలిగించేది. ఆ కొండపై ఋషులు తపమాచరించి ఆనందమే పరబ్రహ్మ స్వరూపంగా తెలుసుకుంటున్నారు. అందుకే ఈ పుణ్యాద్రిని వైకుంఠంకంటే మిన్నగా భావించాడు- ఆ దేవదేవుడు.

వరాహపురాణంలోని ఈ క్రిందిశ్లోకం ఆనందనిలయ విమానాన్ని ఇలా వర్ణించింది.

**విమానే విమలే దివ్యే కోటిసూర్యసమప్రభే,**
**రత్నస్తంభ సమోపేత శ్రీమహామణి మండపే.**
**మధ్యే విమానం పద్మాక్షః శ్రీనివాసః పరాత్పరః**
**అతిష్ఠత్ దేవదేవోఽపి శంఖచక్రగదాధరః. (25, 26)**

- స్వచ్ఛము, దివ్యమైన ఆనందనిలయ విమానం, కోటి సూర్యకాంతిసమమైన రత్నస్తంభాలచే నిర్మింపబడిన మహా మణిమండపము గలిగియున్నది. అందు పరాత్పరుడు, పద్మా క్షుడు, శంఖచక్రధరుడైన శ్రీనివాసుడు దేవదేవుడై నిలచి యున్నాడు. ఈ 'మహామణిమండపం' అను పేరును ఈపురాణంనుండి గ్రహించియే చంద్రగిరి మాధవదాసర్(మల్లన మంత్రి) బంగారువాకిలిముందు మండపం నిర్మించినపుడు



(క్రీ.శ.25-8-1417) దానికి వాడుకున్నాడు. అందువల్ల అది మహామణిమండపమైంది. విఖనసమహర్షి శిష్యుడైన మరీచి విమానసహితదేవాలయంలోని మూర్తిని పూజించడం అత్యుత్తమమైందని చెప్పాడు.

తిరుమలలో శ్రీనివాసమూర్తి కోరినప్రకారం తొలి ఆనందనిలయవిమానాన్ని 'మరీచిసంహిత' ననుసరించి, తొండమానుచక్రవర్తి నిర్మించాడు. అదే తొలి ఆలయం. చారిత్రకాంశాలకు వస్తే వేరువేరు కాలాలలో రాజులు, చక్రవర్తులు, సామంతులు, శ్రీమంతులు ఆలయాన్ని అభివృద్ధిపరచి జీర్ణోద్ధరణ చేసిన వైనం తెలుస్తుంది.

ఈ జీర్ణోద్ధరణ కార్యక్రమాలన్నిటిలోకి క్రీ.శ.1250-55 సం॥లలో జరిగిన మరమ్మతుకార్యక్రమం ముఖ్యమైనది. తిరుప్పుల్లానిదాసర్ అనే అతడు వీరనరసింగయాదవరాయల అనుమతితో జీర్ణోద్ధరణకు పూనుకున్నాడు. పాతశాసనాలన్నిటినీ కాపీచేసిపెట్టుకుని, జీర్ణోద్ధరణ తరువాత కొత్తనిర్మాణాలమీద యథాతథంగా వాటిని పూర్వస్థానాలమీద తిరిగి చెక్కించే షరతు విధించి, యాదవరాయలు అనుమతి ఇచ్చాడు. ఆ విధంగా జీర్ణోద్ధరణ జరిగింది. పాతశాసనాలు కాపాడబడ్డాయి.

దీనిని తు.చ. తప్పకుండా నిర్వహించిన తిరుప్పుల్లానిదాసర్‌ను అభినందించి, ఆతణ్ణే ఆదర్శంగా తీసుకొని తానుకూడా తులాభారంలో తనను తూచుమని తనయెత్తు బంగారం ఆలయానికి ఇచ్చి ఆనందనిలయవిమానానికి బంగారు మలామా చేయించమన్నాడు-వీరనరసింగదేవయాదవరాయలు. ఆ విధంగా ఆలయంలో తులాభారం వేయడం తొలుత ప్రవేశపెట్టబడింది. తొలిసారి బంగారుమలామా ఆనందనిలయ విమానానికి దక్కింది. అంతేకాదు అప్పుడే దర్శనానికి వచ్చిన పాండ్యచక్రవర్తి మొదటి జటాదర్మన్ సుందరపాండ్యుడు తన ఉభయంగా ఆ విమానం మీద బంగారుకలశం పెట్టడం కూడా జరిగింది. ఇన్ని విశేషాలతో కూడిన ఆ శిలాశాసనాలు (పాత) మొదటి శా.సం.లో 49, 91 శాసనాలుగా ఉన్నాయి.

చంద్రగిరికోటలో ఉన్న రంగనాథయాదవరాయల తరువాత సాళువమంగిదేవుడు తాను రాజై విజయనగర సంగమ వంశరాజులకు సామంతుడుగా మారినప్పుడు తిరుమల ఆలయాన్ని దర్శించాడు. ఆనందనిలయ విమానం కళావిహీనమై కనబడింది. వెంటనే దానికి బంగారుపూత పూయమని ఆదేశించాడు. క్రీ.శ.1361 సం॥ నాటి ఈ సంఘటన తెలుగులో శాసనబద్ధమైయున్నది. (తిరుమల తిరుపతి దేవస్థాన శాసన సంపుటి 1, నం.179,180) తిరుమల ఆలయంలో మొట్టమొదటి తెలుగుశాసనం ఇదే. దాదాపు 50సం॥ తర్వాత రెండవ దేవరాయల మంత్రి- అమాత్యశేఖర మల్లన లేదా చంద్రగిరి మాధవదాసర్ క్రీ.శ. 25-8-1417లో తిరిగి బంగారుపూత పూయించాడు. ఈ తారీఖున ఆయన బంగారువాకిలి ముందు మహామణి మండపాన్ని నిర్మించాడు కావున అప్పుడే విమాన జీర్ణోద్ధరణ చేసి ఉంటాడని ఊహ. అసలు శాసనం కొంత శిథిలమైంది. కానీ అందులో మొట్టమొదటిసారిగా **'ఆనంద విమానం'** అను పేరు కనబడింది. (తిరుమల తిరుపతి దేవస్థాన శాసనసంపుటి 1, నం.196, 198) 100 సం॥ల తర్వాత క్రీ.శ.9-9-1518 సం॥లో శ్రీకృష్ణదేవరాయలు 30 వేలవరహాలు చెల్లించి బంగారుమలామా చేయించాడు. (తిరుమల తిరుపతి దేవస్థానశాసన సంపుటి.3 నం.81)

ఐదవసారి కాంచీపురానికి చెందిన కోటి కన్యాదానము లక్ష్మీకుమారతాతాచార్యులు క్రీ.శ.1630 సంవత్సరం రెండవ వెంకటపతిరాయలకాలంలో బంగారుపూత పూయించగా, ఆరవసారి మహంత్ ప్రయోగదాస్‌జీకాలంలో ఆయన సోదర శిష్యుడు అధికార రామలక్మన్‌దాస్ క్రీ.శ.1909లో బంగారు మలామా చేయించాడు. తిరుమలతిరుపతిదేవస్థానశాసనాలలో ఇదే చిట్టచివరి శిలాశాసనం.

1958లోను, 2006 సం॥లోను తిరుమల తిరుపతి దేవస్థానంవారు స్వయంగా ఆనందనిలయ దివ్యవిమానానికి స్వర్ణ సొబగులు దిద్ది సంప్రోక్షణలు చేశారు. ఈ విధంగా ఇప్పటికి ఎనిమిదిపర్యాయాలు ఆ దివ్యవిమానం మరమ్మతులు పొంది పవిత్రీకరింపబడింది.

ఆనందనిలయం శ్రీవారికి ఆవాసంమాత్రమే కాదు-ఆపన్నులపాలిటి కొంగుబంగారం. ఆపదమ్రొక్కులవారంతా ఆ విమానం చుట్టూ అంగప్రదక్షిణ చేసి ఇష్టసిద్ధిని పొందుతుంటారు. అన్ని ఉత్సవాలు, అభిషేకాలు విమానప్రదక్షిణతోనే ఆరంభమౌతాయి. ఏ కారణం చేతనైనా ఆలయంలో అసలు స్వామిని దర్శించలేనప్పుడు అసలు స్వామికి దీటైన విమాన వేంకటేశ్వరుణ్ణి దర్శించి, ఆత్మతృప్తి పొందడం అనాదిగా వస్తున్న ఆచారమైంది.



# ఎన్నెన్నో అందాలు...

- డా॥ ఈ.ఏ. శింగరాచార్యులు

కలియుగవైకుంఠంగా ప్రసిద్ధిగాంచిన తిరుమల పేరు వినగానే ఎత్తైన శిఖరాలు, మనోహరంగా కన్పించే పూలతోటలు, అందంగా పారే సెలయేళ్లు, అక్కడి కొండలపై, చెట్లపై మేఘాల సంచారాలువంటి మైమరపించే సన్నివేశాలు ఎన్నో గుర్తుకు వస్తాయి. అందాలకు, అద్భుతాలకు, ఆధ్యాత్మికతకు నెలవైన తిరుమలగిరుల సందర్శనం ఏనాటికీ మరచిపోలేని అనుభూతిని కల్గిస్తుంది. ఈ కొండపై కన్పించే పలు అందమైన సన్నివేశాలను ఆళ్వార్లు తమ ప్రబంధాలలోని పాశురాలలో చాలా రమణీయంగా వర్ణించారు. ప్రత్యేకించి అక్కడితోటల అందాన్ని వారు కీర్తించినతీరు చాలా హృద్యమైంది. తిరుమలలోని ఉద్యానవన సౌందర్యసంప్రదాయాన్ని గుర్తించిన తిరుమల తిరుపతి దేవస్థానాల యాజమాన్యం దాని పరిరక్షణకోసం ఒక ప్రత్యేకమైన విభాగాన్ని(ఉద్యానవనశాఖను) నిర్వహించడం ప్రశంసనీయం. ఆళ్వార్లపాశురాలలో గోచరించే తిరుమలగిరులలోని తోటల అందాలను, వాటిలోని కొన్ని విశేషాలను గమనిద్దాం!

- తోటల అందమే తిరుమలకు నిరూపకవిశేషణంగా ఆళ్వార్లు తమ పాశురాలలో పలుచోట్ల చెప్పారు. తిరుమళిశై ఆళ్వార్లు **"పొలిల్ వేఙ్గడమలై"** (నాన్ముకన్ తిరువందాది-44) **(తోటలను కల వేంకటాచలం)** అని, **"పునవేఙ్గడమ్"** (తిరువిరుత్తమ్-15) **(తోటలను కల్గిన వేంకటాద్రి)** అని నమ్మాళ్వార్లు, **"తేనార్ పూమ్ శోలై తిరువేఙ్గడమ్" (తేనెనిండుగా కల్గిన పూలను కల తోటలతో కూడిన తిరుమల)** అని కులశేఖరాళ్వార్లు, **"విరై యార్పొలిల్ వేఙ్గడవన్" (అమలనాదిపిరాన్-1) (సుగంధభరితమైన తోటలను కల వేంకటాచలంలో ఉండేవాడు)** అని తిరుప్పాణ్ ఆళ్వార్లు-ఈ విధంగా ఆళ్వార్లు అందమైన, సుగంధం నిండిన పూలతోటలను తిరుమలకు ప్రధానవిశేషంగా భావించి వర్ణించారు. ఈ ప్రయోగాలన్నీ తిరుమలలోని తోటల అందాన్ని, వాటిప్రత్యేకతను సూచిస్తాయి.

- తిరుమలలోని తోటలలో పూచేపూలలోని విలక్షణతను నమ్మాళ్వార్లు ఒక పాశురంలో చాలా అద్భుతంగా వర్ణించారు. ఏ చెట్టులో అయినా పూవు పూచిన తరువాత క్రమంగా దాని వికాసం తరిగిపోతుంది. కొంతసేపటికి అది తొడిమనుండి పట్టువీడి రాలిపోతుంది. ఆ సమయానికి పూవు ఇంచుమించుగా తనశోభను కోల్పోతుంది. కాని తిరుమలలోని పూల ప్రత్యేకత చాలా విలక్షణమైంది అని, తిరువాయ్‌మొళి ప్రబంధంలో ఒకచోట **"శిన్దుపూ మకిణుమ్ తిరువేఙ్గడమ్" (పూవు రాలిన తరువాత మిక్కిలి ప్రకాశించే వేంకటాద్రి)** (3-3-1) అని అంటారు నమ్మాళ్వార్లు. తిరుమలలోని చెట్లపై పూచిన పూలలోని శోభకంటే, ఆ కొండపై కిందకురాలిన తరువాత అవి పొందే వికాసం చాలా విశేషమైందట! ఈ విధంగా తిరుమలకొండపై రాలిన పూలు గొప్పగా శోభించడానికి కారణం- ఆ క్షేత్రంలోని గొప్పతనమే!

- తిరుమలలో అనేకరకాల పూలచెట్లకు, వాటిలో అందమైనపూలకు కొదువలేనట్లే! ఆ పూలలోని మకరందానికి కూడా లోటులేదు. తుమ్మెదలు వచ్చి, ఆ పూలలోని తేనెను ఆస్వాదించడం సహజం. తేనెను నిండుగా తాగిన తుమ్మెదలు మధురంగా ధ్వనించడంకూడా సహజమే! తిరుమలలోని ఈ సన్నివేశాన్ని ఆళ్వార్లు అందంగా వర్ణించారు. నమ్మాళ్వార్లు తిరువాయ్‌మొళిలో **"తెన్నాతెనా వెన్డువణ్డుమురల్ తిరువేఙ్గడమ్"**(3-9-1) **("తెనాతెనా" అని తుమ్మెదలు మధురంగా ధ్వనించే వేంకటాచలం)** అని తిరుమలలోని తుమ్మెదలగానాన్ని ప్రస్తావించగా, కులశేఖర ఆళ్వార్లు ఈ విషయాన్నే **"తెన్నవెన వణ్డినఙ్గళ్ పణ్‌పాడుమ్"**(4-6) అని కీర్తించారు. తిరుమంగై ఆళ్వార్లు అయితే మరింత విశేషంగా **"కుఱవర్ మాదర్క తోడు వణ్డు కుఱిఞ్జి మరుళ్ ఇశైపాడుమ్ వేఙ్గడమ్"** (పెరియతిరుమొళి 2-1-2) అనే పాశురంలో తిరుమలలోని కోయవనితలతోపాటు తుమ్మెదలు "కుఱిఞ్జి, మరుళ్" అనేపేర్లు కల రాగాలను ఆలపిస్తున్నాయని అన్నారు. ఇవన్నీ వేంకటాచలోద్యానాలవైభవాన్ని తెలుపుతాయి.







- తిరుమలగిరులు సహజంగానే ఎత్తైనవి. వాటిపై పెరిగే చెట్లుకూడా ఆ క్షేత్రమహిమవల్ల చాలా ఉన్నతంగా మేఘమండలపర్యంతం పెరిగాయి. ఆ చెట్లపై మేఘాల సంచారాలు చూపరులకు కనువిందుచేస్తాయి. ఈ దృశ్యాన్నే తిరుమంగై ఆళ్వార్లు **"మాముకిల్ తోయ్దర శేరువార్పొళిల్ శూళ్ఎళిల్ తిరువేఙ్గడమ్"** (1-8-7) **(ఆకాశంలోని కాలమేఘాలు వచ్చి వాలేటట్లుగా ఉన్నతంగా ఉండే తోటలను చుట్టు కల వేంకటాద్రి)** అనే పాశురంలో మన కంటిముందు సాక్షాత్కరింప జేస్తారు.
- శ్రీవేంకటేశ్వరుని శ్రీచరణాలను నమ్మాళ్వార్లు **"పూవార్ కళల్కళ్" (పూలతోనిండిన పాదాలు)** అని కీర్తించారు. ఈనాటికీ నిత్యం రెండువేళల శ్రీనివాసుని దివ్యరూపం అందమైన పలు పూలతో కూర్చిన మాలికలతో అలంకరింపబడి, నయనమనోహరంగా సాక్షాత్కరించడం తెలిసిన విషయమే! ఈ పూలన్నీ తిరుమలలోని ఉద్యానవనాలలో పూచినపూలే! చాలా తక్కువైన జ్ఞానం కల వానరాలుకూడా తిరుమల ఉద్యానవనాలలో పూచిన పూలనుకోసి, వాటితో శ్రీవేంకటేశ్వరుణ్ణి అర్చించే అందమైనదృశ్యాన్ని పూదత్తాళ్వార్లు తమ ప్రబంధంలోని 72వ పాశురంలో **"పోదఱిన్దు వానరఙ్గళ్ పూమ్శునైపుక్కు అఙ్గలర్న్ద పోదఱిన్దు కొణ్డేత్తుమ్" (బ్రాహ్మ ముహూర్తాన్ని గమనించి తిరుమలలోని వానరాలు పూలతో నిండిన వాగులలోనికి పోయి, అక్కడ విరిసిన పూలనుకోసి తీసికొనివచ్చి స్వామిని పూజిస్తున్నవి)** అని అన్నారు. తిరుమల ఈవిధంగా సర్వత్ర పూలతో నిండి ఉన్నందువల్లనే "పుష్పమండప"మనే పేరుతో ప్రసిద్ధిచెందింది.
- తిరుమలలోని తోటలు అందమైన పూలవృక్షాలకే కాక, ఏపుగా పెరిగే వెదుళ్లకుకూడా ప్రసిద్ధి. ఈ విషయాన్ని పేయాళ్వార్లు **"తడిన్దు ఎళున్ద వేయ్కళైపోయ్ విణ్ తిఱక్కుమ్"** (72) **(పెరిగినవెదుళ్లు, భూసారం గొప్పది కనుక, ఆకాశం అంత ఎత్తుకు ఎదుగుతున్నవి)** అని కీర్తించారు. వెదుళ్లలో ముత్యాలు పుడతాయని ప్రసిద్ధి. తిరుమలలో ఎత్తుగా పెరిగిన వెదుళ్లు పగిలినపుడు వాటిలోని అందమైన ముత్యాలు కొండపై చిందే అందమైన దృశ్యాన్ని తిరుమఙ్గై ఆళ్వార్లు **"వెణ్ తరళఙ్గళ్ వేయ్విణ్డు ఉదిర్ తిరువేఙ్గడమ్"** (1-10-8) అని పెరియతిరుమొళి ప్రబంధంలో వర్ణించారు. తిరుమలతోటలలోని వెదుళ్లకు సంబంధించిన అందమైన సన్నివేశాన్ని పూదత్తాళ్వార్లుకూడా ఒక పాశురం(75)లో చాలా సహజంగా వర్ణించారు.

తిరుమల తోటలలోని ఇటువంటి ఇంకా ఎన్నో అందమైనదృశ్యాలను ఆళ్వార్లు తమ ప్రబంధాలలో ప్రస్తావించి, ఆ క్షేత్రంలోని ఉద్యానవనాల ప్రత్యేకతను చాటారు.

*శ్రీవేంకటాచలోద్యానవైభవం భక్తరంజనమ్ ।*
*దివ్యసూరిప్రబంధేషు ప్రోక్తమిత్థం నివేదితమ్ ॥*









# మొక్కుబడుల దేవుడు...

- ప్రాచార్య కట్టమంచి మహాలక్ష్మి



శ్రీవేంకటేశ్వరస్వామి ఆపదమొక్కులవాడనేది లోకప్రసిద్ధం. అనాదిగా రాజులు, రాణులెందరో స్వామికి మొక్కులు చెల్లించారు. పల్లవరాణి స్వామివారి వెండివిగ్రహాన్ని ఆలయానికి బహూకరించింది. ఆయనే పవళింపు సేవలందుకొనే భోగశ్రీనివాసమూర్తి.

భగవంతుడికి మనకి కలిగినంతలో తృణమో పణమో సమర్పిస్తామని మొక్కుకోవడం ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయం. మొక్కు అంటే ప్రార్థన, మొక్కుబడి అంటే ప్రార్థించబడింది అని అర్థాలు. *"నా మొక్కు నెరవేరితే నేను కృతజ్ఞతగా చెల్లించబోయేది"* అని భక్తుడు స్వామితో ఒక ఒడంబడిక చేసుకోవడం. భగవంతుడికి భక్తుడికి సాన్నిహిత్యం కల్పిస్తున్నది- ఈ మొక్కు. ఇది నమ్మకానికి సంబంధించింది.

స్వామికి చిన్న మొక్కు మొక్కినా అందుకు వేయిరెట్లు మిన్నగా మనకు సహాయం చేస్తాడు. భగవంతునిదయ అపారం. పవిట పేలిక చించి కట్టు కట్టినందుకు ద్రౌపదికి అక్షయవస్త్రాన్ని ప్రసాదించాడు. కుచేలుని పిడికెడు అటుకులు ఆరగించి అష్టైశ్వర్యాలిచ్చాడు. విద్య నేర్చుకున్నందుకు చనిపోయిన కొడుకునే బ్రతికించి గురువుగారికి ఇచ్చాడు. అంతటి స్వామికి మొక్కే మొక్కులు రెండు రకాలు. ధనప్రమేయం లేకుండా చేసేవి. సంపదలను, ధనధాన్యాలను ఇస్తామనేవి. అంగప్రదక్షిణం, జోలితో తిరుమలకు రావడం, శనివార వ్రతం ధనంతో ప్రమేయం లేనివి. తలనీలాలు ఇవ్వడం, స్వామిని దర్శిస్తాననడం, హుండీకి కానుకలర్పిస్తాననడం, తులాభారం, నిలువుదోపిడి ధనప్రమేయంతో కూడినవి.



## అంగప్రదక్షిణం

సాష్టాంగం అంటే ఎనిమిదిఅంగాలతో స్వామిని నమస్కరించడం. అంగప్రదక్షిణకు శరీరంలోని సర్వాంగాలు భూమిని తాకి స్వామికి నమస్కరిస్తాయి. శ్రీవేంకటేశ్వరుడికి సర్వాంగాలతో పొర్లిపొర్లి తృప్తిగా నమస్కరించడంవల్ల శరీరం, మనస్సు మమేకం చెంది, భక్తి పరాకాష్ఠకు చేరుతుంది. వేకువజామున రెండు గంటలలోపే స్వామిపుష్కరిణిలో స్నానంచేసి, తడిబట్టలతో దండాలు పెట్టాలి. దీన్ని శుద్ధాంగప్రదక్షిణం అంటారు. స్నానంవల్ల శరీరం పవిత్రమౌతుంది. స్వామిపుష్కరిణిలో చేసే స్నానం బహుపుణ్యవంతం. ఈ పుష్కరిణిని గరుత్మంతుడు వైకుంఠం నుంచి తెచ్చి ఈ క్షేత్రంలో నిలిపాడు. పుష్కరిణిని దర్శించినా, తీర్థసేవనం చేసినా, స్మరించినా పుణ్యం. కుమారస్వామి బ్రహ్మహత్యాపాతకం ఈ పుష్కరిణిలో స్నానం చేయడంవల్లే పోయిందని, ఆత్మారాముడు ఈ తీర్థానికి మొక్కే సంపన్నుడయ్యాడని, దశరథమహారాజు పుత్రసంతానాన్ని పొందాడని పుష్కరిణీస్నానంవల్ల లబ్ధి పొందినవారికథలు అనేకం.

తీర్థాలలోకెల్ల పరమపావనమైన పుష్కరిణిలో స్నానం చేసి, ప్రదక్షిణం మొదలుపెడతారు. శాస్త్రబద్ధంగా పరిశీలిస్తే ప్రదక్షిణం అంటే ఎక్కడ ఆరంభిస్తామో అక్కడే ముగించాలి. "ప్రదక్షిణ ప్రణామానాం యుగ్మాన్యేవ సమాచరేత్" అంటే ప్రదక్షిణాలు గాని, ప్రణామాలు గానీ రెండేసిమార్లు చేయాలి.



పూర్వంఅంగప్రదక్షిణమార్గంలో పైన రంగనాథుడు వరుసగా దక్షిణంవైపు శ్రీవరదరాజస్వామిఆలయం పోటు (వంటశాల) బంగారుబావి, అంకురార్పణ మండపం, యాగ శాల, నాణేలపరకామణి, నోట్లపరకామణి మండపాలు చంద నపుఅర, విమానవేంకటేశ్వరస్వామి, వేదపారాయణం, తాళ్లపాక అర, సన్నిధిభాష్యకారులు, శ్రీరామానుజాచార్యుల సన్నిధి, శ్రీయోగనరసింహస్వామిని దర్శించుకుంటూ శ్రీరంగనాథుని వద్దకు వచ్చి, ఆగితే అది ప్రదక్షిణం అవుతుంది.

ఈనాడు అంగప్రదక్షిణం చేసే భక్తులు వేలసంఖ్యలో ఉండడంవల్ల బంగారుబావినుండి హుండీవరకే పొర్లు దండాలు ఆగిపోతున్నాయి. పొర్లినప్పుడంతా భక్తులు గోవింద నామస్మరణ చేస్తారు. శరణాగతి, భక్తిరీతులకు, ఈ మొక్కు ప్రతీతి.

## నిలువుదోపిడి

నిలువుదోపిడి మొక్కినవారు మొక్కుకున్న సమయంలో ధరించి ఉన్న ఆభరణాలన్నీ స్వామిహుండీలో నూతనవస్త్రంలో మూటగట్టి వేసి, పసుపుకొమ్ము గట్టిన పసుపు తాడును మాంగ ల్యానికి బదులుగా ధరించి, వెనుదిరిగి రావాలి. నిలువుదోపిడి ఇచ్చేవారు ముందుగా కేశఖండనం చేయించు కోవాలి. పూర్వం స్త్రీపురుషులిద్దరు కేశాల్ని పెంచుకొనేవారు. స్త్రీలు పుష్పాలతో ఎంతో ఇంపుగా అలంకరించుకుని, కేశపోషణలో అత్యంత శ్రద్ధ వహిస్తారు. తలవెంట్రుకలు తీయించు కోకుండా నిలువు దోపిడి ఇవ్వడం, శాస్త్రసమ్మతం గాదు. భగవంతుడి సమక్షంలో సొమ్మునూ, అందం తెచ్చే అహాన్ని వదలుకోవడమే నిలువు దోపిడి. ధనగర్వం, సౌందర్యగర్వం మటుమాయమయ్యే మొక్కిది.

## తులాభారం

త్రాసులో తులాభారం తూగేవారు ఒకవైపు; మరోవైపు ధనం, ధాన్యం, బంగారు, వెండి, కర్పూరం, బెల్లం, కలకండ వంటి వస్తువుతో సరితూగి స్వామికి అర్పించవచ్చు. స్వామి కరుణాకటాక్షాలవల్ల పుట్టినసంతానాన్ని ఇలా తూచడం ఆన వాయితీగా వస్తున్న మొక్కు. తులాభారం తూగేవరకు ఆ బిడ్డ స్వామిబిడ్డ. తూచిన తర్వాతే ఆ బిడ్డ కన్నవారిబిడ్డ. కొండపై తులాదండం మహాద్వారం దగ్గర రంగనాథమండపం ముందుం టుంది. మొదట్లో ఇది హుండీ దగ్గర ఉండేది.



## ధ్వజారోహణం

**బ్రహ్మోత్సవాలకు సకలదేవతామూర్తులనూ ఆహ్వా నిస్తారు. స్వామివాహనం గరుడుడు కాబట్టి, కొత్త వస్త్రంమీద గరుడుని బొమ్మ చిత్రీకరిస్తారు. దీన్ని 'గరుడ ధ్వజపటం' అంటారు. దీన్ని ధ్వజస్తంభం మీద కట్టేం దుకు నూలుతో చేసిన కొడితాడును సిద్ధం చేస్తారు.**

**ఉత్సవమూర్తులైన భోగశ్రీనివాసుడు, శ్రీదేవి, భూదేవుల సమక్షంలో కొడితాడుకు కట్టి, పైకి ఎగుర వేస్తారు.**


**ధ్వజస్తంభం మీద ఎగిరే గరుడపతాకమే సకల దేవతలు, అష్టదిక్పాలకులు, భూత, ప్రేత, యక్ష, రాక్షస, గంధర్వ గణాలకు ఆహ్వాన పత్రం. ఈ ఆహ్వానంతో ముక్కోటిదేవతలూ బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిది రోజులూ కొండమీదే ఉండి, ఉత్సవాలను తిలకించి ఆనందిస్తారు.**



## శ్రావణ శనివార వ్రతం

వీటినే తిరుశనివారాలు అని పిలుస్తారు. తిరు అనేది తమిళపదం. తిరు అంటే 'శ్రీ' అని గౌరవసూచన. తమిళ మాసం ప్రకారం పురట్టాసి వచ్చే శనివారం శ్రావణమాసంలో వస్తుంది. నాలుగు లేదా ఐదుశనివారాలు పూజలు, వ్రతాలు చేస్తారు. 'కన్యాశ్రవణ సంభూతం' అని స్వామి అవతరించిన మాసం శ్రావణం, రాశి కన్యారాశి అని చెబుతారు.

ఆ శనివారాలే ఎందుకు పూజచేయాలనేది ఉదయించే ప్రశ్న. ప్రతి శనివారం పూజ, ఉపవాసం నెరపవచ్చు. శని గ్రహానికి పూజ ఉపవాసం నెరపవచ్చు. శనిగ్రహానికి ఇష్ట మైన ఆహారం నువ్వులు, బెల్లం. చిమ్మిలి నైవేద్యాలారగించి శ్రీనివాసుడు, శనిదేవతను ప్రసన్నుడిగా చేసుకుంటాడు. అందువల్లే ఆ స్వామిసన్నిధి నిత్యకల్యాణం పచ్చతోరణంగా ఉంటుంది. అలాంటి స్వామిని ఆయన కిష్టమైన శనివార వ్రతాలతో కొలిస్తే శనిగ్రహం మనజోలికి రాడనే నమ్మకం. ఎంతటి పేదవారైనా ఈ వ్రతం ఆచరించవచ్చు.



## తిరుశనివారవ్రతం

జోలెతో తిరుమలకు వచ్చే మొక్కు ఇది. పుణ్యక్షేత్ర దర్శనానికి పునాది వేస్తున్న మొక్కు. శ్రీ వేంకటేశ్వరనామాలు ధరించి, రెండు చెరుగులా ఒడిసిపట్టి ముడివేసి, జోలె చేతికి



తగిలించుకుంటారు. ఇంటింటికిపోయి భిక్షాటన చేస్తూ, ఆ వచ్చిన కానుకలు బియ్యం దారిపొడుగునా ఖర్చుపెట్టుకుంటారు. మిగిలింది స్వామికి సమర్పిస్తారు. ఊర్లో అందరూ స్వామిదర్శ నానికి రాలేరు గదా! అందుకనివారికానుకలు అర్పించి, జోలి కట్టినవాళ్ళు అందరికీ పుణ్యం పంచిపెడుతుంటారు.

మొక్కుల్లో లౌకిక ప్రయోజనం, ఆధ్యాత్మికప్రయోజనం అనే రెండుఅంశాలున్నాయి. నడకవల్ల శరీరంలోని కొవ్వు కరిగి శరీరం ఆరోగ్యవంతమౌతుంది. దారిలోని దేవాలయాల దర్శనం వల్ల దైవభక్తి వెల్లివిరుస్తుంది. తీర్థస్నానాదులు శారీరక స్వస్థత లను కల్గిస్తాయి.


స్థలాభివృద్ధి, ఆర్థికసమానత్వం, విద్య, వైద్యం, కళాభి వృద్ధి, లక్షలాదిప్రజలకు జీవనోపాధివంటి అనేక సామాజిక ప్రయోజనాలు మొక్కుబడులు చెల్లించడంవల్లే కలుగుతున్నాయి. కాబట్టి ఆపదసమయాల్లో మొక్కులు మొక్కి అందరం శ్రీవారి కృపకు పాత్రులమౌదాం.



వైద్యమూ, వైద్యుడూ, వేద్యుడూ - అన్నీ భగవంతుడే!

# తెర తొలగించిన పాట..

- శ్రీమతి పి. విజయలక్ష్మి



ఎందరో వాగ్గేయకారులు తమభక్తి సంగీతంలో శ్రీవేంకటేశ్వరస్వామివారిని వేనోళ్ల కీర్తించి, తాము తరించడమే కాక, ఆ కీర్తనల్ని భక్తితో గానం చేసినవారిని కూడా తరింపజేస్తూన్నారు. కలియుగ ప్రత్యక్షదైవమై, భక్తులపాలిటి కల్పవృక్షంగా, ఆపదమ్రొక్కులవాడుగా కీర్తింపబడే శ్రీవేంకటేశ్వరుణ్ణి సేవించని భక్తులుండరు.

కర్ణాటకసంగీతచరిత్రలో త్యాగరాజు చిరస్థాయి అయిన కీర్తిప్రతిష్ఠల్ని గడించారు. "కర్మ భక్తి జ్ఞానమార్గాలను సంగీతంలో మేళవించి, నిజము నెరిగిన బ్రహ్మవేత్త - త్యాగయ్య".

త్యాగరాజు దేవతాంతరభేదాన్ని పాటించక, అన్నిపుణ్యక్షేత్రాలనూ దర్శించి, ఆయా క్షేత్రాధిదైవతాల్ని నోరార కీర్తించి, సేవించి, వారికృపకు పాత్రుడైన అభేద దర్శనసిద్ధుడు.

అయ్యగారు తిరుమల శ్రీవారిని సేవించడానికి ఆలయానికి వచ్చిన సమయానికి తిరువారాధనకోసమో, ఆరగింపుసేవకోసమో తెరవేసి ఉంచారు. ఆ తెర స్వామికి గాక తనకే వేసినట్లు లోలోపల భావించి, తన దుష్కృత ఫలమే ఈ తెర రూపంలో అడ్డగించి, స్వామివారిదర్శన భాగ్యాన్ని దూరం చేసిందని నిర్ణయించి, ఆ పరాత్పరుని దివ్యదర్శనంకై ఆర్తిపరుడై, తన మత్సరాన్ని తొలగించుమంటూ భక్తిప్రపూర్ణహృదయంతో ఇలా ప్రార్థించాడు.

గౌళిపంతు - ఆది

**తెర తీయగరాదా లోని**
**తిరుపతి వెంకటరమణ! మచ్చరమను ॥ తె॥**

**పరమపురుష! ధర్మాదిమోక్షముల**
**పారఁదోలుచున్నది నాలోని ॥ తె॥**

**ఇరవొందగ భుజియించు సమయమున**
**ఈఁగ తగులురీతి యున్నది**
**హరిధ్యానము సేయువేళ చిత్తము**
**అంత్యజువాడకుఁ బోయిన ట్లున్నది ॥ తె॥**


**మత్స్యము ఆకలిఁగొని గాలముచే**
**మగ్నమైనరీతి యున్నది**
**అచ్చమైన దీపసన్నిధి మరు**
**గిడఁ బడి చెఱచిన ట్లున్నది ॥ తె॥**

**వాగుర యని తెలియక మృగగణములు**
**వచ్చి తగులురీతి యున్నది**
**వేగమె నీ మతము ననుసరించిన**
**త్యాగరాజనుత మదమత్సర మను ॥ తె॥**

అయ్యగారు పరమార్తుడై ఈ విధంగా కీర్తించగానే ఆర్తిహరుడైన శ్రీవారికీ, ఆర్త భక్తుడైన త్యాగయ్యకూ మధ్యనున్న తెర తనంత తానే తొలగిపోయింది. అనంతరం శ్రీవారిని కనులారా దర్శించి, మనసారా కీర్తించి, ఆడిపాడి బ్రహ్మానందపరవశుడయ్యాడు.

శ్రీవారిని దర్శించడానికి తెర అడ్డంగా ఉన్నప్పుడు- భౌతికమైన వస్త్రపుతెరను తొలగించుమంటూ స్వామినీ, అర్చక స్వామినీ అర్థించడంకంటే- తన జన్మాంతర దుష్కృతమో, అరిషడ్వర్గమో ఇందుకు కారణమై ఉంటుందని నిర్ణయించి, ఆ దోషాలను తనమనస్సుకు తెచ్చుకొని, తాను అపరాధాలకు పుట్టినిల్లనీ, గతిలేనివాణ్ణనీ, సంసారుల దోషాలను కూడా తనయందే ఆరోపించుకొని, వాటిల్నికూడా తనదోషాలుగానే భావించడం అయ్యగారివిశాలదృష్టికీ, అందరి ఆర్తినీ తొలగించాలనే ప్రపన్నత్వవిశిష్టతకూ ఈ సన్నివేశం నిదర్శనం. కష్టసుఖాలు రెండూ భగవంతుని కృపాప్రాప్తాలే!

అనుకొన్నసమయానికి దైవదర్శనం కాలేదంటే- చాలామంది "నాపై స్వామికి దయలేదు. అందుకే నాకు దర్శనభాగ్యం లభించలేదు"- అంటూ నేరం భగవంతునిపై మోపుతారు. కాని త్యాగయ్య వంటి జ్ఞానసంపన్నులు అలా భావించరు. భగవంతుడెప్పుడూ కృపామూర్తియే! వారి కృపకు నోచుకునే అర్హత మనలోనే ఎక్కడో లోపించి ఉంటుంది. ఆ లోపం తొలగితే స్వామికృప మనపై తప్పక ప్రసరిస్తుంది. జీవునిహృదయాన్ని కామక్రోధ లోభమోహమదమాత్సర్యాలనే శత్రువర్గం



ఆవరించి, అతణ్ణి సత్ కార్యాలకూ, సద్భావాలకూ దూరం చేస్తుంది. అహంభావానికి మదమాత్సర్యాలే ప్రబలకారణం. 'అహం' తొలగితే అన్ని ఆటంకాలూ తమంత తామే తొలగిపోతాయి. కర్మానుగుణంగా ప్రాప్తించిన ఈ మదమాత్సర్యాలను, కర్మాతీతుడైన వేంకటేశ్వరుడే తొలగించాలి. దైవదర్శనానికి ప్రతిబంధకాలేర్పడితే, ఇతరులు ఎవ్వరూ వాటిల్ని తొలగించలేరు.

పరమభాగవతులు నిరంతరం భగవద్భావనాచిత్తం కలవారు; తమకు కలిగే అన్నిఅనుభవాలనూ భగవంతునియందే సమన్వయించుకొంటారు. అంతేగాని తమ ప్రారబ్ధాన్ని మరొకరిపై రుద్దరు. త్యాగయ్య పరమభాగవతశిరోమణి! ఈ కీర్తనలో– కామక్రోధాదులైన అరిషడ్వర్గప్రభావం ఎంత బలవత్తరమైనదో అయ్యగారు ఎంతో ఆర్తితో ఉపమానరూపదృష్టాంతాలతో వ్యక్తం చేశారు. అహంకారమమకారాలే సర్వఅనర్థాలకూ మూలం. మమ (నాది), నిర్మమ (నాది కాదు); అనే ఈ రెండే బంధ మోక్షాలకు కారణాలని వేదాంతుల నిర్ణయం. 'అంతా నాదే' అనుకొంటే బంధం. 'ఏదీ నాది కాదు – అంతా ఆ భగవంతునిదే' అని భావించి, శరణాగతుడై ప్రవర్తిస్తే అదే మోక్షకారణం! "ఇంతటి గొప్పవాణ్ణి నేను వచ్చాను. నాకు దర్శనావకాశం లేకుండా ఈ తెర అడ్డం పెట్టారు" అని తమకు తోచిన వారినం దరినీ, తోచినరీతిలో నిందించకుండా– త్యాగయ్య తనలో ఏ మూలనో దాగి ఉన్న అహంకారం ఈ తెరరూపంలో అడ్డగించింది. దాన్ని తొలగించుకోవడానికి నేను అశక్తుణ్ణి. పాపపరిహారకుడూ, సర్వశక్తి సమర్థుడూ అయిన శ్రీవేంకటేశ్వరుడే ఈ అహంరూపమైన తెరను తొలగిస్తాడు' అని ఆ స్వామినే నిందుభక్తితో, ఆర్తితో ప్రార్థించాడు. ప్రపన్నార్తి హరుడు కదా శ్రీవేంకటేశ్వరుడు! త్యాగయ్య ఆర్తినీ, ప్రపన్నతాగుణాన్నీ గమనించి, తత్క్షణమే ఆ తెరను తొలగించాడు.

కనుక తీర్థయాత్రలకూ, దైవదర్శనాలకూ చిత్తంలో ఏర్పడే ప్రతిబంధకాలు ఇతరులవల్ల వచ్చేవి కావు. అవి స్వయంకృతాలు. కనుక పశ్చాత్తాపంతో, ఆ ప్రతిబంధాలను తొలగించుకోవడానికి సర్వశరణ్యుడైన శ్రీవేంకటేశ్వరుణ్ణి శరణు పొందాలి. ఆర్తితో, భక్తితో స్వామిని ప్రార్థించాలి. ఇక్కడ అయ్యగారు "నీ మతము ననుసరించిన" అనే గొప్పమాట అన్నారు. శ్రీవారిమతం–'తన పాదపద్మాలను ఆశ్రయించి, భవబంధాలనుండి తరించండి' అనేది.



పెద్దశేషవాహనం

**ధ్వజారోహణం అయిన రోజు రాత్రి స్వామి... శ్రీదేవీ, భూదేవీ సమేతంగా సర్వాలంకారభూషితుడై తిరుమల ఆలయ నాలుగుమాడవీథుల్లో ఊరేగుతారు. స్వామివారు కొలువు దీరింది శేషాద్రి. ధరించేది శేషవస్త్రం. ఆయన పానుపు శేషుడు. అందుకే ఉత్సవాల్లో శేషుడికి అత్యంతప్రాధాన్యతనిస్తూ తొలి రోజు ఆ వాహనం మీదే ఊరేగుతారు.**



చిన్నశేషవాహనం

**రెండోరోజు ఉదయం స్వామి తన దేవేరులతో కలసి ఐదుశిరస్సుల చిన్నశేషవాహనంపై దర్శనభాగ్యం కల్పిస్తారు. పెద్దశేషవాహనం 'ఆదిశేషుడి'గానూ, చిన్నశేషవాహనం 'వాసుకి' గానూ భావించవచ్చు.**


# అరచేతి దైవం...

– శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు

అన్నమయ్యజీవితం, సారస్వతజీవితం వేంకటేశ్వరునిచుట్టూ పరిభ్రమించింది. తల్లి లక్కమాంబ ఉగ్గుపాలతో రంగరించిన వేంకటేశ్వరునిభక్తికథలు, తండ్రి నారాయణసూరి వివరించిన శ్రీనివాసతత్త్వప్రబంధం, యతి ఘనవిష్ణువు పాదుకొల్పిన వైష్ణవసంస్కారాలు, గురువు శఠకోపయతులు బోధించిన రామానుజీయవైష్ణవసిద్ధాంతాలు, ఆళువారులపాశురాలు, కర్ణాటకహరిదాసుల దేవరనామాలు అన్నమయ్యఅంతరంగంలో సమాధిగతమైనవి. లోకశాస్త్రకావ్యాదుల అనుశీలనతో పదనుతేరిన వ్యుత్పత్తి నైసర్గికప్రతిభకు తోడై, వాడై శ్రీనివాసునిచరణ మంజీరాలపదరచనలై నినదించినవి. అవి ఆంధ్రశారదాకాశాన పొగరు వెన్నెలల్ని కురిపించినవి; శ్రీనివాసభక్తిసామ్రాజ్యాన్ని స్థాపించినవి.



అన్నమయ్య తాను దర్శించినవేంకటపతిని అనంతమానవాళికి దర్శింపచేసినాడు. క్షేత్రం, తీర్థం, దైవతం అన్నీ శ్రీనివాసంగా అనుభవానికి తెచ్చుకొని, మనల్ని అనుభవింపజేసినాడు. 'కట్టెదుర వైకుంఠము కాణాచయినకొండ తెట్టెలాయె మహిమలే తిరుమలకొండ', పరమపవిత్రమైన తిరుమలయాత్రకు మనల్ని సంసిద్ధం చేసినాడు. మనకు తరుగనిధనం ఆనందనిలయంలో ఉన్నదని చూపుతున్నాడు. 'ముంగిట నల్లదివో మూలనున్న ధనము బంగారుశిఖరాల బహుబ్రహ్మమయము అదె చూడుడు. అదె మొక్కుడు ఆనందమయము!' కొండ చేరుతూనే చేరవలసింది పుష్కరిణి చెంతకు. స్వామిపుష్కరిణి, అలమేలుమంగా శ్రీనివాసులను తెప్పల తేలించే ఆ లోకపావనికి వేవేల మొక్కులు సమర్పించినాడు. తిరుమలతొలివేలుపు ఆది వరాహస్వామికి ప్రణతు లర్పించినాడు. వైకుంఠాన్ని వదలి వేంకటాచలం చేరిన కటివరదహస్తాల అందమైన వేలుపును చూపుతున్నాడు. సందడి సొమ్ములతో సాకారమై నిలిచిన శ్రీపతి దివ్యపాదాలను దర్శిస్తూ 'నల్లనిమేని నగవు చూపులవాని, తెల్లనికన్నులదేవుని' మనముందు నిలిపినాడు. ఆ అందమైన మూర్తివెనుకదాగిన ఆనంద తత్త్వాన్ని.. రసపరవశంతో గానం చేసినాడు. ఆ శృంగార రాయని మాధుర్యాన్ని శృంగారపదాలలో కురిపించినాడు. ఆ పరమపురుషుని లీలావిభూతిని శరణాగతకరదీపికలతో సాక్షాత్కరింపజేసినాడు. పుంఖానుపుంఖంగ అన్నమయ్య భావనామయవిశ్వంలో కదలాడిన బొమ్మలు శ్రీనివాసదార్శనిక కళలతో నవనవలాడినవి. కొన్నిలక్షల భావకుసుమాలు తిరుమలతిరువీథులలో వెల్లివిరిసినవి.



అన్నమయ్య శ్రీనివాసుణ్ణి పరతత్త్వంగ, పరబ్రహ్మంగ భావించాడు. తిరుమలమందిరంలో నిలిచినమూర్తినిగురించి చేసినవాదాలను, చెలరేగినవివాదాలను లెక్కచేయలేదు. వైష్ణవులు 'విష్ణు'వన్నారు. శైవులు శివు డన్నారు. శాక్తేయులు శక్తిరూప మన్నారు. కాపాలికులు ఆదిభైరవు డన్నారు. వేదాంతులు 'పరబ్రహ్మం' అన్నారు. అన్నమయ్య వేంకటేశ్వరుణ్ణి 'ఆశ్చర్యస్వరూపు' డన్నాడు. మనం ఎట్లా భావిస్తే అట్లా గోచరిస్తాడు పొమ్మన్నాడు. పిండికొద్దీ రొట్టె. ఎవ్వ రేమనుకొన్న నా కేమి కొదువ. 'ఇదియే పరతత్త్వం నాకు' అని అన్నమయ్య తీర్మానించినాడు. వేంకటరమణునిలో శ్రీరామచంద్రుణ్ణి దర్శించుకొన్నాడు.

శ్రీరామావతారకథలను కీర్తించాడు. ఆ సమరవిజయరాముడు, భయహరుడు, నిజభక్తపారీణుడు, వంశీమోహనుడు శ్రీకృష్ణపర మాత్ముడే వెంకన్నమూర్తిలో నిలిచాడు. బాలకృష్ణునిుండి యోగేశ్వరేశ్వరుడైన, శ్రీకృష్ణతత్త్వాన్ని గానం చేశాడు. ఆ పరమ పురుషుణ్ణి, గోపాలబాలుణ్ణి భావించి, తనివిదీర కీర్తించినాడు. అహోబలనృసింహునిగ, తిరుమల వేంకటేశ్వరుణ్ణి భావించి, 'కారణప్రకటుడైన వేంకటనారసింహుని'గా స్తుతించినాడు. నానా క్షేత్రాలలో వెలసినవిష్ణుదైవతాలకు వేంకటేశ్వరునితో అభేద సాదృశ్యాన్ని స్థాపించినాడు. ఎక్కడున్నా ఆయా వేల్పులందరూ వేంకటగిరికి రాక తప్పదు, 'వేంకట' ముద్ర వేసుకోక తప్పదు.

అన్నమయ్యకు వెన్నతో అబ్బింది వేంకటేశుమంత్రము. అన్నిమంత్రాలు ఈ మహామంత్రంలో ఆవహించినా యంటాడు– అన్నమయ్య. నాకు నాగురు విచ్చినమంత్రం. నన్ను సదా కాపాడేమంత్రము. 'నాకు వెన్నెలవంటిది వేంకటేశుమంత్రము' అని ఆ పరబ్రహ్మమంత్రాన్ని అనుష్ఠిస్తాడు. శ్రీవేంకటేశపరమ మంత్రాలుగ 32000 సంకీర్తనలను వచించాడు. ఏ ఒక్క పాటలోకూడా తనపేరును చెప్పుకోలేదు. 'వేంకట' ముద్రనే అంకితముద్రగా స్వీకరించినాడు. వేంకట, తిరువేంకట, తిరు శ్రీవేంకట ఇత్యాదిగ ప్రతిపాటలో 'ముద్ర'ను చేర్చినాడు. అన్న మయ్య భక్తిపూర్వకంగా 'వేంకట' ముద్రాంకితం చేయడంవల్లనే అవి వేంకటేశ్వరమంత్రాలుగా భాసించినాయి. అందుకే చిన్నన్న తాతగారిచరిత్ర వ్రాస్తూ 'పరమమంత్రములు ముప్పదిరెండు వేలు' అన్నమయ్య రచించినా డంటారు. కర్ణాటకసంగీతపితా మహుడు పురందరదాసు ఈ పదకవితాపితామహుడు అన్న మయ్యసంకీర్తనలగురించి 'కువలయంబునఁ బేరుకొన్న మాత్రమున, తలఁచిన భూతభేతాళపిశాచములు పాఱిపోవు' నంటారు. ఆర్జవత్వంతో అన్నమయ్య ఆవిష్కరించిన సంకీర్తనలు శ్రీశ్రీనివాససుదర్శనాలు.

తిరుమల శ్రీనివాసుడు అన్నమయ్యకు ఒక్కొక్కమారు ఒక్కొక్కలాగున కనిపిస్తాడు. పసిబిడ్డగ కనిపిస్తాడు. జోకొట్టి జోలపాడతాడు (జో అచ్యుతానంద జోజోముకుంద). ఆదమరచి నిదురబోయే ఆ బాలునికి దోమలు కరవకుండా దోమతెర కడ తాడు. 'పన్నగపుదోమతెరను పైకెత్తి, భక్తులవిన్నపాలను విన మని' స్వామికి మేలుకొలుపులు పాడుతాడు. ఆ విశ్వవిరాట్ పురుషునికి షోడశకళానిధికి షోడశోపచారాలను నిర్వహిస్తాడు. రత్నసింహాసనంమీద కూర్చుండబెట్టి, కొలువుగీతాలను విని పిస్తాడు. ఆ అలమేల్మంగ అండనుండేస్వామికి శుక్రవారపు అభిషేకాలను సిద్ధం చేస్తాడు. శుక్రవారపు అభిషేకపుసొగసులతో కళగట్టినస్వామిముఖబింబాన్ని పరవశంతో తిలకిస్తాడు. వంట యింటిలో అలమేలుమంగ వండి, వడ్డించినభోజనాలను శ్రీవారి ఆరగింపులకు సిద్ధం చేస్తాడు. నుదుట కల్యాణతిలకము దిద్ది, శ్రీభూదేవేరులతో కల్యాణోత్సవానికి శృంగారశ్రీనివాసుణ్ణి సింగారిస్తాడు. వాహనాలలో, ఊరేగింపులలో శ్రీవారిని ఉభయ నాంచారులతో అలంకరించుకొని, కన్యాదాత అయి, మురిసి పోతాడు. శ్రీవారికి ఏకాంతసపర్యలు చేస్తూ సకలచరాచర సృష్టిని 'సద్దు' చేయవద్దని శాసిస్తాడు.

**రాను మీకడకు వో రమణులాల, పూవుం**
**బానుపు హరికి పరవవలయు నేడు**

అని సకలజీవనాయికలను హెచ్చరిస్తాడు. అన్నమయ్య గీతాలను రచించలేదు, వచించినాడు. శ్రీనివాసుణ్ణి మనసులో నిలుపుకొని, భగవత్తత్త్వాన్ని, లీలావిభూతిని మధురమధురంగ వ్యాఖ్యానించినాడు. అతనికి అదొక తపస్సు. అదొక అనిర్వచన మైన అనుభూతి. అది నిర్మలం. అది యశస్కరం. అందుకే వేంకటేశ్వరుడు అన్నమయ్య పాటలు విని 'యితరవాగ్విరక్తుడై' నాడట. నేటికీ తిరుమల దేవాలయంలో స్వామి అన్నమయ్య పాటలు వింటూ నిదురలేస్తాడు – నిదురపోతాడు.

శ్రీనివాసఅద్వైతంగా సాగిన అన్నమయ్య జీవనయాత్ర శ్రీనివాసవిశిష్టాద్వైతంగా ముగిసింది. అన్నమయ్య తనఅంత రంగాన శ్రీవేంకటేశ్వరుని 'అరచేతిదైవంగా' నిలుపుకొన్నాడు. నామటుకు నాకు అన్నమయ్య ఆంజనేయునిగా భాసిస్తాడు. శ్రీరామచంద్రునిపాదలచెంత కూర్చొన్న హనుమంతుడు; శ్రీవేంకటేశ్వరునిచరణాలవద్ద పాడుతున్న అన్నమాచార్యుడు ఒక్కటే! ఆ హనుమయ్య లేనిరామయ్యను, అన్నమయ్యలేని వేంకటయ్యను ఊహించలేను, భావించలేను. అన్నమయ్యమాటనే నామన సంటున్నది – **"విడువలేని శ్రీవేంకటవిభుడవు కడదాకా నిక కాతువుగాక".**

తిరుమల తిరుపతి దేవస్థానములు



## తిరుమల
## శ్రీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం
2020 సెప్టెంబరు
19 నుండి 27 వరకు



**20-09-2020 ఆదివారం**
**రాత్రి: హంసవాహనం**



**21-09-2020 సోమవారం**
**పగలు: సింహవాహనం**





**21-09-2020 సోమవారం**
**రాత్రి: ముత్యపుపందిరివాహనం**

**22-09-2020 మంగళవారం**
**పగలు: కల్పవృక్షవాహనం**



designpsivaprasad

తిరుమల
శ్రీవేంకటేశ్వరస్వామివారి
బ్రహ్మోత్సవం
2020 సెప్టెంబరు
19 నుండి 27 వరకు



తిరుమల తిరుపతి దేవస్థానములు

**22-09-2020 మంగళవారం**
**రాత్రి: సర్వభూపాలవాహనం**





**23-09-2020 బుధవారం**
**పగలు: పల్లకీలో మోహినీఅవతారోత్సవం**

తిరుమల తిరుపతి దేవస్థానములు



తిరుమల
శ్రీవేంకటేశ్వరస్వామివారి
బ్రహ్మోత్సవం
2020 సెప్టెంబరు
19 నుండి 27 వరకు

24-09-2020 గురువారం
పగలు: హనుమద్వాహనం





24-09-2020 గురువారం
రాత్రి: గజవాహనం



designpsivaprasad

తిరుమల
శ్రీవేంకటేశ్వరస్వామివారి
బ్రహ్మోత్సవం
2020 సెప్టెంబరు
19 నుండి 27 వరకు





25-09-2020 శుక్రవారం
పగలు: సూర్యప్రభవాహనం



25-09-2020 శుక్రవారం
రాత్రి: చంద్రప్రభవాహనం



designpsivaprasad



చిత్రం: నమూనా ఆలయం

# శ్రీవేంకటేశచరణౌ శరణం ప్రపద్యే

– డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

సుప్రభాతం–శ్రీవేంకటేశ్వరసుప్రభాతం–ఇది తెలియని వా రెవ్వరు? దాదాపు ప్రతిదినం అందరూ వింటూనే ఉంటారు. కొందరు ప్రతిదినం పఠిస్తూ ఉంటారుకూడా! ఆలాంటి విషయాన్నిగూర్చి–అంటే అందరికి ఇంతగా తెలిసిన విషయాన్ని గూర్చి వ్రాయటం ఎంత సులభమో, అంత కష్టం!

స్వామివారిసుప్రభాతఆవిర్భావమే ఒకచిత్రమైన సంఘటన! ఎవరో ఒకరచయిత కాగితం, కలం పట్టుకొని ఆలోచించి ఆలోచించి–పదాలను, పాదాలను ఏర్చి కూర్చి, రూపొందించిన రచన కాదిది. ఒకమహాభక్తునిగుండెలోతుల్లోంచి ఆశువుగా అలా పొంగిపొరలినఅక్షరప్రవాహం! బహుశః స్వామివారి సంకల్పానుసారం వెలికి వచ్చిన భక్తిరచనాప్రవాహం.

ఆ మహాభక్తుడే శ్రీఅణ్ణన్– ప్రతివాదిభయంకరఅణ్ణన్. ఆయనఅసలుపేరు హస్తిగిరినాథుడు. విశిష్టాద్వైతి. దాదాపు 600 సంవత్సరాలక్రితం ఈ వైష్ణవభక్తుడు తనగురువుగారైన 'మనవాళమహాముని'వెంట స్వామివారిదర్శనార్థం తిరుమలకు రావట మేమిటి? ఆలయంలో మూలవిరాట్టుముందు ముకుళితహస్తుడై– తనగురువుగారిప్రక్కన నిలబడట మేమిటి? ఆ గురువుగారు అపాంగవీక్షణాలతో ఈ శిష్యుడివైపు చూచి, 'స్వామి వారి మీద సుప్రభాతం చెప్పరాదా' అని అనట మేమిటి? అన్నదే తడవుగ అణ్ణన్‌గారు నిలువెల్ల పులకించి, భక్తిభావంతో పరవశించి, ఈ సుప్రభాతాన్ని, స్తోత్రాన్ని, ప్రపత్తిని, మంగళా శాసనాన్ని ఒక్క ఊపున రసోజ్జ్వలంగా చెప్పట మేమిటి? ఈ రచన ఆరువందల సంవత్సరాలుగా – అంతకు ముందున్న 'తొండరప్పొడియాళ్వార్' (విప్రనారాయణుడు) గారి ప్రోబోధిక స్తుతికి బదులుగా– ఒక్క ధనుర్మాసంలో తప్ప (ధనుర్మాసంలో తిరుప్పావై)ఆలయంలో ప్రతిదినం ప్రాభాతికగీతికలా నినదించట మేమిటి? ఆలయంలోనే కాదు– ఏడుకొండల్లో చెట్టుచెట్టున, గుట్టగుట్టన, పుట్టపుట్టన, బండబండన, కొండకొండన ప్రతిధ్వనించట మేమిటి! ఆ ప్రభాతసమయాన మేతకు వెళ్ళే పక్షులు, జంతువులుకూడ ఒకింత ఆగి, చెవు లప్పగించి విని, తల లూపి, తరలివెళ్ళట మేమిటి! అశేషభక్తజనం ఈ సుప్రభాతాన్ని విని, పఠించి, భక్తిభావంతో పరవశించట మేమిటి?

అంతేనా? ఏ ముహూర్తాన– ఏ రసోజ్జ్వలస్థితిలో అణ్ణన్‌గారు ఈ సుప్రభాతాన్ని చెప్పారోగాని– అది దేశ మంతటా ఇంటింటా, గాలిలా వీచింది; పరిమళంలా వ్యాపించింది; నీరులా పారింది; కాంతిలా ప్రసరించింది; మధురాతిమధుర గీతికలా నినదించింది.

ఇంతెందుకు? స్వామివారిమీద ఎన్నోరచనలు వచ్చాయి కదా– ప్రజానీకంలో ఇంతప్రచారంపొందినరచన ఇంకొకటి ఉందా? ప్రజలహృదయాల్ని ఇంతగా హత్తుకొన్న రచన ఇంకొకటి ఉందా? లేదే!

ఈ భూమిమీద మనిషి ఉన్నంతకాలం అతని జీవితానికి, అతనిజీవితపరమార్థానికి మార్గదర్శకాలైన రామాయణ భారతభాగవతభగవద్గీతలు ఉంటా యని చెప్పవచ్చు. వ్యాసవాల్మీ

కులు ఉంటా రని చెప్పవచ్చు. ఆలాగే శ్రీవైకుంఠవిరక్తుడైన శ్రీవేంకటేశ్వరుడు ఇక్కడ ఎంతకాలం ఉంటాడో– అంతకాలం అణ్ణన్‌గారిసుప్రభాతం ఉంటుంది; అణ్ణన్‌గారూ ఉంటారు.

ఏమిటి ఈ అణ్ణన్‌గారిసుప్రభాతంలో అంతవిశేషం? అంతవెలుగు! ఇది మహనీయమైన ఒకానొక రసోజ్జ్వలస్థితిలో– ఒకమహాభక్తుడు తాను–తాను కానిస్థితిలో– చెప్పిన సుప్రభాతం. మహర్షులు వేదాలు చెప్పినట్లు, శ్రీకృష్ణుడు గీత చెప్పినట్లు ఈ మహాభక్తుడు స్వామివారిలో సంపూర్ణంగా లీనమై పలికిన పలుకు లివి. అపౌరుషేయా లని అనిపించేపలుకు లివి. మరోసారి అలా చెప్పం డని అడిగితే – ఆనాడు శ్రీకృష్ణు డన్నట్లు అణ్ణన్‌గారే నావల్ల కా దనే పలుకు లివి. అందుకే ఈ సుప్రభాతానికి ఇంతవెలుగు; ఇంతఆకర్షణ; ఇంతవ్యాప్తి.

ఒకింతఆలోచిస్తే ఈసందర్భంలో ఆశ్చర్యాన్ని కలిగించే అంశం ఇంకొకటి ఉంది. విశ్వవ్యాప్తవిశుద్ధచైతన్యశక్తిని, నిరాకారనిర్గుణపరబ్రహ్మాన్ని మనం నిద్రలేపట మేమిటి? ఆ పరమాత్మకు మనం రకరకాలఅలంకారాలుచేయట మేమిటి? అనేక ప్రసాదాలు అర్పించట మేమిటి? నిజంగా ఆయన నిద్ర పోతే ఈజీవుడు ఉంటాడా? ఈజగత్తు ఉంటుందా?

కాని, మనం ఆ నిరాకారనిర్గుణవిశ్వవ్యాప్తవిశుద్ధచైతన్యాన్ని, సాకారసగుణరూపంగా కదా ఆరాధిస్తున్నాము! విష్ణువుగానో, శివుడుగానో, రాముడుగానో, కృష్ణుడుగానో కదా మనం కొలుస్తున్నాము! అందుకే ఈ సుప్రభాతాలు, అలంకారాలు, నైవేద్యాలు మొదలైన వన్నీ.

ఆనాడు మూలవిరాట్టుముందు నిలబడి, ముకుళితహస్తుడై అణ్ణన్‌గారు సమాధిస్థితు డయ్యాడు. ఆంతరంగా ఈ కలియుగవైకుంఠంనుండి ఒక్కసారిగ ఆ దివ్యలోకవైకుంఠానికి వెళ్ళాడు. నిద్రాముద్రితుడై పవ్వళించిఉన్నశ్రీమహావిష్ణువును దర్శించాడు. ఆయనలో త్రేతాయుగశ్రీరాముణ్ణి చూచాడు. ద్వాపరయుగ శ్రీకృష్ణుణ్ణి తిలకించాడు. కలియుగప్రత్యక్ష దైవం శ్రీనివాసమహాప్రభువును కళ్ళార కాంచాడు. ఆ స్వామితో ఏమి చెప్పుకోవా లనుకొన్నాడో! కాని, ఆయన నిద్రలేస్తేనే కదా తాను చెప్పుకొనేది! అందుకే ఈ సుప్రభాతం!

అయితే, సుప్రభాతాన్ని ఎలా మొదలుపెట్టాలి? స్వామివారిని ఎలా మేల్కొల్పాలి?– ఆనాడు సరయూతీరంలో శ్రీరామచంద్రుణ్ణి మేల్కొల్పటానికి విశ్వామిత్రమహర్షి చెప్పిన –

**కౌసల్యాసుప్రజా! రామ! పూర్వాసంధ్యా ప్రవర్తతే ।**
**ఉత్తిష్ఠ నరశార్దూల! కర్తవ్యం దైవ మాహ్నికమ్ ॥**

–అన్నశ్లోకం మెరుపుతీవలా ఆయనస్ఫురణకు వచ్చింది. వెంటనే ఒక దివ్యస్ఫూర్తితో, రసావేశంతో...

**ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవింద! ఉత్తిష్ఠ గరుడధ్వజ!**
**ఉత్తిష్ఠ కమలాకాన్త! త్రైలోక్యం మంగళం కురు ॥**

– అని సుప్రభాతాన్ని ఆరంభించాడు. స్వామివారివక్షఃస్థలంమీద శిరస్సు ఉంచి, అమ్మవారు నిద్రిస్తూ ఉంది. ఆమె లేవకుండ స్వామివారు ఎలా లేస్తారు? అందుకే వెంటనే –

**మాతః సమస్తజగతాం మధుకైటభారేః -**
**వక్షోవిహారిణి! మనోహరదివ్యమూర్తే!**
**శ్రీస్వామిని! శ్రితజనప్రియదానశీలే!**
**శ్రీవేంకటేశదయితే! తవ సుప్రభాతమ్॥**

– అని ఆ మహాలక్ష్మిని మేల్కొల్పాడు.

అలా చూచాడు. అత్ర్యాదిసప్తర్షులు దోసిళ్ళనిండా పూలు నింపుకొని నిలబడి ఉన్నారు. అవి సామాన్యమైన పూలుకాదు. ఆకాశగంగలో విరబూసినకమలాలు; సుగంధమనోహరాలు. స్వామీ! నీ పాదయుగపూజకు అత్ర్యాదిమహర్షులు వచ్చి, వేచి ఉన్నా రని స్వామికి విన్నవించాడు.

స్వామీ! సప్తర్షులప్రక్కనే 'పంచాననాబ్జభవషణ్ముఖవాసవాది' దేవతాప్రముఖులంతా నీత్రివిక్రమచరితాన్ని స్తుతిస్తూ వేచిఉన్నా రని తెలియజేశాడు. నీదాసానుదాసులుగా నమస్కరిస్తూ దిక్పాలకులు, నవగ్రహాలు నిలిచి ఉన్నా రన్నాడు. అబ్బో! అటువైపు మధురాతిమధురంగా నీచరితను గానం చేస్తూ, విపంచిని మీటుకొంటూ, చేతులాడించుకొంటూ నారదమహర్షి నిలబడి ఉన్నా డన్నాడు.

స్వామీ! ఇటు చూడు. ఏలాలవంగఘనసారసుగంధితాలైన ఆకాశగంగాజలాలను సువర్ణఘటాలలో నింపి, బరువైన ఆ ఘటాలను శిరస్సున మోస్తూ, వైదికశిఖామణులు నీసేవ కొరకు వరుసగా నిలబడిఉన్నారు. మేలుకోస్వామీ! మేలుకో! అన్నాడు. బ్రాహ్మణోత్తములు అలా బరువుమోస్తూ నిలబడి ఉండడం స్వామి సహించలేడు కనుక, ఆయన త్వరగా లేస్తా డని అణ్ణన్‌గారిఆశ ఏమో! స్వామి బ్రహ్మణ్యుడుమాత్రమే కాదు; బ్రాహ్మణప్రియుడు కూడ కదా!

స్వామీ! అటుచూడు. తమకు వాహనసేవాభాగ్య మిమ్మని 'విహగరాజ మృగాధిరాజ నాగాధిరాజ గజరాజ హయాధి రాజులు' నిలిచి ఉన్నారు. సేవాభాగ్య మిచ్చి, అనుగ్రహించు.

ప్రభూ! నీవు పరమపురుషుడివి. ప్రకృతిసర్వము నీ సేవకు ఎదురుచూస్తున్నది. దివ్యపరిమళంతో అల్లన చల్లనిగాలి వీస్తున్నది. ఝుంకారనినాదాలతో తేనె త్రావినతుమ్మెదలు వస్తున్నాయి. చిలుకలు ముందురోజు తినగా మిగిలినకదళీఫల పాయసాలను తిని, బంగారుపంజరాల్లో నీనామాలు పఠిస్తున్నాయి. స్వామీ! అన్నింటిని మించి, ఉదయాన్నే గొల్లభామలు కవ్వాలతో పెరుగు చిలికేశబ్దాలు నీకు చాలఇష్టంకదా! ఈ శబ్దాలు వినసొంపుగా ఎలా వినిపిస్తున్నాయో విను. మేలుకో స్వామీ! మేలుకో! అన్నాడు.

శ్రీపద్మనాభ! పురుషోత్తమ! వాసుదేవ!
వైకుంఠ! మాధవ! జనార్దన! చక్రపాణే!
శ్రీవత్సచిహ్న! శరణాగతపారిజాత!
శ్రీవేంకటాచలపతే! తవసుప్రభాతమ్ ॥

అని గొంతెత్తి గట్టిగా పిలిచి, స్వామీ! మేలుకో! అన్నాడు. ఆ భక్తునిపిలుపు స్వామివారిహృదయాన్ని తాకినట్లుంది. ఆయనసుప్రభాతవచనాలు స్వామివారిచెవులను సోకినట్లున్నాయి.

స్వామి లేచాడు. ఆయననల్లటిఎదమీద ఎర్రటి కుంకుమ. అదెందుకో ఈ భక్తుడు గ్రహించాడు.

కమలాకుచ చూచుక కుంకుమతో
నియతారుణితాతులనీలతనో!
కమలాయతలోచన! లోకపతే!
విజయీ భవ! వేంకటశైలపతే!

అని స్తోత్రం ప్రారంభించాడు. 'కమలాయతలోచన!' అన్న ఒక్కసంబోధనతోనే నిద్రలేచిన ఆ స్వామివారికళ్ళు ఎంత విశాలంగా ఉన్నాయో, ఎంతఅందంగా ఉన్నాయో లోకానికి తెలియచెప్పాడు. అంతేకాదు. "స్వామీ! నీవు లేకుంటే నేను అనాథుణ్ణి. అన్నివేళలా నిన్నే స్మరిస్తా- నిన్నే స్మరిస్తా. నన్ను దయచూడు- దయచూడు. నాకు ప్రియమైన దేదో అది ప్రసాదించు" అని వేడుకొన్నాడు.

వినా వేంకటేశం న నాథో న నాథః
సదా వేంకటేశం స్మరామి స్మరామి ।
హరే! వేంకటేశ! ప్రసీద ప్రసీద
ప్రియం వేంకటేశ! ప్రయచ్ఛ ప్రయచ్ఛ ॥

అంతేకాదు. "స్వామీ! ఎంతోదూరంనుండి నీపాదసేవకు వచ్చాను. రోజూ రాలేను. ఇక్కడే ఉండలేను. అందువల్ల



## హంసవాహనం

రెండోరోజురాత్రి స్వామివారు శారదామాత రూపంలో హంసవాహనంపై ఊరేగుతారు. పాలు, నీళ్లు వేరు చేసినట్లే గుణావగుణవిచక్షణ జ్ఞానానికి సంకేతంగా ఈ వాహనం అధిరోహిస్తారు. ఇహలోకబంధవిముక్తుడైన జీవునిఆత్మను హంసతో పోల్చుతారు. అలాంటి హంసపై పరమహంస అయిన శ్రీనివాసుడు ఊరేగడం నయనానందకరం. 'హంస' శబ్దానికి అంధకారాన్ని తొలగించి వెలుగునిచ్చే పరిశుద్ధమైన మనో మందిర మనికూడా అర్థం ఉంది.

పరమాత్మ వేదోపదేశాన్ని హంసరూపంలోనే చేసినందువల్ల తుచ్ఛమైన కోర్కెల అంధకారం వీడి శాశ్వతమైన పరబ్రహ్మ చెంతకు చేరే ముక్తిమార్గంవైపు నడవాలని ఈ వాహనం ద్వారా స్వామిభక్తులకు చాటుతారు.

ఎప్పుడో ఒకసారి వచ్చి, నిన్ను సేవించుకొన్నా- నాకు నిత్య సేవాఫలభాగ్యాన్ని ప్రసాదించుస్వామీ!" అని ఆశగా వేడుకొన్నాడు.

అహం దూరత స్తే పదాంభోజయుగ్మ -
ప్రణామేచ్ఛయాఽ_గత్య సేవాం కరోమి।
సకృత్సేవయా నిత్యసేవాఫలం త్వం
ప్రయచ్ఛ ప్రయచ్ఛ ప్రభో! వేంకటేశ!

ఈ విన్నపం- దూరదూరప్రాంతాలనుండి వచ్చేభక్తులందరిపక్షాన అణ్ణన్‌గారు ఆ స్వామిని వేడుకొనిందేమో!

ఆత్మజ్ఞానం లేనిమానవుడు తెలిసి చేసినా, తెలియక చేసినా- అతడు చేసేపాపా లన్నీ అజ్ఞానంతో చేసినట్లే! ఆ పాపాలఫలమే అతనిజన్మపరంపర. బాధలదొంతర. అణ్ణన్ గారు మంచిభక్తిమార్గంలోనే ఉన్నా,

అజ్ఞానినా మయా దోషా నశేషా న్విహితాన్ హరే!
క్షమస్వ త్వం క్షమస్వ త్వం । శేషశైలశిఖామణే!

అని స్వామివారిని వేడుకొన్నారు. ఇది అణ్ణన్‌గారు ఒక్కరే కాదు, అందరు భక్తులూ వేడుకోదగినవేడుకోలు. అందరు భక్తులే కాదు - అందరు మానవులూ వేడుకోవలసినవేడుకోలు.

మేల్కొన్నస్వామివారు లేచి నిలుచున్న ట్లున్నారు. వారి పాదాలు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. అణ్ణన్‌గారు ఈ స్తోత్రా లేమిటి? ఈ అభ్యర్థన లేమిటి? సంపూర్ణశరణాగతే కర్తవ్య మనుకొన్నాడు. స్వామిప్రక్కనే అమ్మవారు నిలబడి ఉంది. తనవైపు వాత్సల్యంగా చూస్తూ ఉంది. ఆమె లేస్తేనే కదా ఈ స్వామివారు లేచేది! ఆమె అనుగ్రహిస్తేనే కదా ఈ స్వామివారు అనుగ్రహించేది? అందుకే ముందుగా -

ఈశానాం జగతోఽ_స్య వేంకటపతే ర్విష్ణోః పరాం ప్రేయసీం
తద్వక్షఃస్థలనిత్యవాసరసికాం తత్క్షాంతిసంవర్ధినీమ్ ।
పద్మాలంకృతపాణిపల్లవయుగాం పద్మాసనస్థాం శ్రియం
వాత్సల్యాదిగుణోజ్జ్వలాం భగవతీం వందే జగన్మాతరమ్.

అని, ఆమెకు నమస్కరించి,

శ్రీమన్! కృపాజలనిధే! కృతసర్వలోక!
సర్వజ్ఞ! శక్త! నతవత్సల! సర్వశేషిన్!
స్వామిన్! సుశీలసులభాశ్రితపారిజాత!
శ్రీవేంకటేశచరణౌ శరణం ప్రపద్యే.

అని, స్వామిపాదాలమీద అట్టే వ్రాలిపోయాడు. ఆ పాదాలను వర్ణించసాగాడు.

ఆయన ఎంతసేపు ఆపాదలమీద అలా వ్రాలి ఉన్నాడో! ఆ స్వామివారు ఆ పాదాలు కదల్పకుండ ఎంతసేపు అలా నిలబడి ఉన్నారో! అంతా ఒక రసమయస్థితి!

ఆ భక్తుడికి కలియుగవైకుంఠస్పృహ వచ్చింది. ఎంతసేపటికి వచ్చిందో! వెంటనే -

'శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్.'
'శ్రీవేంకటాద్రిశృంగాగ్రమంగళాభరణాంఘ్రయే'
'అతృ ప్త్యమృతరూపాయ వేంకటేశాయ మంగళమ్'
'శ్రీవైకుంఠవిరక్తాయ స్వామిపుష్కరిణీతటే,
రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్'

- అని మంగళాశాసనం చెప్పాడు.

అణ్ణన్‌గారిపదప్రయోగాలు కొన్నిఅత్యంతసార్థకాలు. స్వామివారిని 'అతృప్త్యమృతరూప' అనటం ఎంతోసత్యమైన మాట! భక్తకోటికి ఎంతో అనుభవరమ్యమైనమాట! స్వామివారిని వందసార్లు చూచినా 'వెయ్యిసార్లు చూచినా' ఏ భక్తుడైనా ఇక చాలు నని తృప్తిపడుతాడా? లేదే! మళ్ళీ మళ్ళీ చూడా లని ఉవ్విళ్లూరుతాడు. అందుకే ఆయన అతృప్త్యమృతరూపుడు. అణ్ణన్ గారు తరువాత లౌకికస్పృహ పొంది నట్లున్నారు. ప్రక్కనున్న గురువుగారివైపు చూచి, తృప్తిగా ఒక నిట్టూర్పు విడిచి,

శ్రీమత్సుందరజామాతృమునిమానసవాసినే ।
సర్వలోకనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥

- అని స్వామిముందు సాగిలపడినాడు.

అణ్ణన్‌గారిసుప్రభాతం విని, ఆ వేంకటపతి ఎంత ఆనందించాడో! ప్రక్కనున్న గురువుగారు మణవాళమహాముని గారు శిష్యునిప్రతిభ, భక్తి చూచి, ఎంత మురిసిపోయారో!

భక్తులుమాత్రం అప్పటినుండి ఇప్పటివరకు ఆ సుప్రభాతాన్ని వింటూ, చదువుకొంటూ భక్తిభావపరవశులౌతున్నారు. స్వామివారు ఇక్కడ ఉన్నంతకాలం ఈ సుప్రభాతవైభవం ఈలాగేఉంటుంది.

# అనంతపద్మనాభ వ్రతకథ


- డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య

**వ్రతమంటే నియమపూర్వకంగా ఆచరించేది. అనంతపద్మనాభవ్రతం - ప్రతి సంవత్సరం దక్షిణాయానంలో వర్షఋతువులో- భాద్రపదమాసశుక్లపక్షంలో చతుర్దశినాడు ఆచరించాలి. ఒకమారు ఆచరిస్తే తర్వాత 14 సం॥ ఆచరించి, పిదప ఉద్యాపన చేయవచ్చు. లేదా జీవితపర్యంతం ఆచరించనూవచ్చు. ప్రతివ్రతానికి పూజావిధానంలో- కథలో, కొన్నివిధానాల్లో మార్పులుంటాయి. వ్రతాచరణకు భక్తివిశ్వాసాలు ముఖ్యం.**

## వ్రతకథ

పాండవులు అరణ్యవాసం చేస్తూ, కష్టాల్లో ఉండగా వాళ్లను విచారించడంకోసం శ్రీకృష్ణపరమాత్మ వచ్చాడు. పాండవులు శ్రీకృష్ణుణ్ణి గౌరవించారు. అపుడు ధర్మరాజు శ్రీకృష్ణుణ్ణి చూచి, "కృష్ణా! నేను, తమ్ములతో, భార్యతోనూ ఇక్కడ అనేక కష్టాలు అనుభవిస్తున్నాను. ఈ దుఃఖం నుండి విముక్తి చెందే ఉపాయం ఏదైనా ఉంటే తెల్పుము" అని ప్రార్థించాడు.

శ్రీకృష్ణుడు ధర్మరాజుతో "ధర్మనందనా! అనంతవ్రతమని ఒకటి ఉంది. అది అన్నిపాపాలనూ, కష్టాలనూ పోగొట్టి, కోర్కెలన్నింటినీ సఫలం చేస్తుంది. శాశ్వతసంపదలూ, వంశాభివృద్ధీ కల్గిస్తుంది. ఆ వ్రతాన్ని భాద్రపదశుద్ధచతుర్దశినాడు ఆచరించాలి" అని చెప్పాడు. అపుడు ధర్మరాజు కృష్ణునితో "కృష్ణా! "అనంతుడు" అని చెప్పినావు కదా! ఆయన ఎవ్వడు? ఆదిశేషుడా? పరమాత్మయా? లేక బ్రహ్మదేవుడా? నాకు వాస్తవాన్ని వివరించుము" అని కోరాడు. కృష్ణుడు "ధర్మజా! నేనే ఆ అనంతుణ్ణి, ఇంద్రుణ్ణి, విష్ణువును, శివుణ్ణి, ఈశ్వరుణ్ణి. విశ్వమంతా నా రూపమే! సృష్టిస్థితిలయాలకు నేనే కారణమైనవాణ్ణి. అనంతపద్మనాభుణ్ణి. నరసింహాదిఅవతారాలెత్తాను. నన్నే యోగులు పరబ్రహ్మంగా ధ్యానిస్తారు. సూర్యచంద్రులు, మనువులు, ఋషులు, రుద్రులు, వసువులు మొదలగు చరాచరాత్మక విశ్వమంతా నేనే!" అన్నాడు.



అంతట ధర్మరాజు "వాసుదేవా! ఆ అనంతవ్రతాన్ని ఆచరిస్తే ఏమి పుణ్యం? ఏమి ఫలం? ఏమి ఇవ్వాలి? ఏ దేవతను పూజించాలి? ఇంతకుముందు ఈ వ్రతాన్ని ఎవరు ఆచరించారు? మానవలోకానికి ఎలా వెల్లడయింది? వివరించు"మన్నాడు.

కృష్ణుడు "పూర్వం కృతయుగంలో సుమంతుడనే బ్రాహ్మణుడుండేవాడు. అతడు వశిష్ఠగోత్రుడు. అతడు భృగువంశంలో పుట్టిన 'దీక్ష' అనే కన్యను శాస్త్రోక్తంగా పెండ్లాడాడు. ఆ పుణ్యదంపతులకు ఒక కూతురు కల్గింది. ఆమెకు 'శీల' అని పేరుపెట్టారు. అనారోగ్యకారణంగా శీలతల్లియైన దీక్ష స్వర్గస్థురాలైంది.

పిదప తన యజ్ఞాదివైదికకార్యనిర్వహణంకోసం భార్య ఉండాలి కనుక 'కర్కశ' అనే సార్థకనామంగల కన్యను పెండ్లి చేసుకున్నాడు. తల్లిలేని 'శీల' నిజంగానే సచ్ఛీలవతి, దైవభక్తి కలది. ఇంటిని అందంగా తీర్చిదిద్దేది. ఆమెను "వేదవిద్యావంతుడు, బ్రహ్మచర్యంనుండి గృహస్థాశ్రమాన్ని పొందడానికి అర్హుడూ అయిన 'కౌండిన్యుడు' అనే మహామునికి ఇచ్చి, పెండ్లిచేశాడు. "పెండ్లి అయ్యాక అల్లునికి బహుమతిగా సారె పెట్టిపంపాలి కదా ఏమున్నాయి?" అని కర్కశను అడిగాడు- సుమంతుడు. ఆమె పేరుకు తగ్గట్టు కర్కశంగా మాట్లాడి

'ఫోఫో' అంది. సుమంతుడు 'సత్తుపిండి' (వేయించి విసిరిన యవధాన్యం పిండి. దీన్నే 'పేలపిండి' అంటారు) ఇచ్చి, అల్లుణ్ణీ, కుమార్తెను సాగనంపాడు. ఎద్దులబండిపై ప్రయాణం చేస్తూ, మధ్యాహ్నానికి అనుష్ఠానంకోసం ఒక కొలను దగ్గరకు వెళ్లాడు. అక్కడ ఒక వ్రతం జరుగుతోంది. ఆ శీల వాళ్లను చూచి, "ఇది ఏమివ్రతం? విధివిధానాలు ఏమి? ఏ దేవుణ్ణి పూజించాలి" అని వినయంతో అడిగింది.

వాళ్లు "ఓ నవవధూ! ఈ వ్రతం భాద్రపదశుద్ధచతుర్దశి నాడు చేయాలి. ఈరోజు అనంతపద్మనాభస్వామిని నదీతీరంలో పూజించి, అతనికథను వినాలి. పూజావిధానం ఎలా అంటే– నదీస్నానంచేసి, ఇష్టదేవతలకు నమస్కరించి, శుభ్రమైనవస్త్రాలు ధరించి, మంచిప్రదేశంలో గోమయంతో అలికించి, సర్వతోభద్ర మండలం వేయించి, దానిమధ్యలో దిమ్మెలు గల ఎనిమిదిరేకులు గల పద్మాన్ని నిర్మించి, దానిచుట్టూ తెల్లనిబియ్యంపిండితోనూ, ఐదురకాలరంగులతోనూ ముగ్గులుపెట్టించి, ఆ మండలానికి కుడివైపున కలశముంచి, కలశంమధ్యలో అనంతపద్మనాభ స్వామిని ధ్యానించాలి. అనంతునిరూపాన్ని దర్భతోచేసి, ఏడు పడగలుపెట్టి, పచ్చనికన్నులుంచి, నాల్గుచేతులుంచి, నాల్గుచేతుల్లో పద్మం, శంఖం, చక్రం, గద ఉన్నట్లు భావించి, పూజించాలి. అనంతపద్మనాభస్వామిని కలశంలోనికి, ప్రతిమల్లోనికి ఆవాహనం చేయాలి. చక్కగా పూలతో అలంకరించాలి. ధూపదీప నైవేద్యాలు చేయాలి. 14 విధాలైన నైవేద్యాలుండాలి. (ఈ వ్రతానికి 14 సంఖ్య నియతం) 14 ముళ్లువేసిన తోరాన్ని పూజించాలి. బెల్లంతో 28 అతిరసాలు చేసి నివేదించాలి. అందులో వ్రతం చేయించిన పురోహితునికి సగం అనగా 14 అతిరసాలు వాయనంగా ఇవ్వాలి. తక్కినవి యజమాని దంపతులు, వారి బంధువులు స్వీకరించాలి. ఈ వ్రతంలో పూజాద్రవ్యాలన్నీ 14 ప్రకారంగానే ఉండాలి. తోరం ధరించాలి. ప్రతి సంవత్సరమూ ఎర్రని క్రొత్తతోరం కట్టుకోవాలి. ఇలా 14 సం॥లు చేసి, ఉద్యాపన చేయాలి" అని వివరించారు.

శీల అక్కడి పుణ్యస్త్రీల సహకారంతో అనంతవ్రతాన్ని ఆచరించి, క్రొత్తతోరం కట్టుకుని, తాము దారిబత్తెంకోసం తెచ్చుకొన్న పేలపిండిని పురోహితునికి వాయనంగా ఇచ్చి, వారూ భుజించి, తమ ఆశ్రమానికి వెళ్లారు.

అనంతపద్మనాభుని అనుగ్రహంవల్ల మహాసంపదలు వారికి చేకూరాయి. ఆ మహర్షిఆశ్రమం అతిథిఅభ్యాగతులతో శోభిస్తోంది. ఆమె సావిత్రితో సమానంగా ఉంది. "అనంత పద్మనాభస్వామిఅనుగ్రహంవల్లనే ఈమెకు ఇంతటి సంపద వచ్చిం"దని అందరూ సంతోషంగా చెప్తూ వచ్చారు. ఇలా ఈ వ్రతం భూలోకంలో ప్రసిద్ధికెక్కింది.



## సింహవాహనం

**మూడోరోజు ఉదయం సింహవాహనమెక్కి వేంకటనాథుడు దర్శనమిస్తాడు. జంతువులకు రాజైన సింహం సైతం తానేనని, మనుషులు తమలోని జంతుప్రవృత్తిని అదుపుచేసు కోవాలని స్వామి చాటుతారు.**

**దుష్టశిక్షణ, శిష్టరక్షణలో భాగంగా దుర్మార్గుడైన హిరణ్యకశిపుని వధించి, ప్రహ్లాదుని రక్షించడానికి శ్రీమహావిష్ణువు ధరించిన అవతారం నరసింహావతారం. ఈ వృత్తాంతాన్ని భక్తులకు కనులకు కట్టినట్లు చూపించేందుకై 'సింహ' వాహనఉత్సవం నిర్వహిస్తారు. వజ్రకిరీటం, చెవులకు రవ్వలపోగు, శ్రీవత్సం, లక్ష్మీకౌస్తుభం - ఈనాటి అలంకరణలోని ప్రత్యేకత.**



సాత్త్వికమైన తపస్సువల్ల మనిషి పూర్ణత్వం చెందుతాడు

## ముత్యపుపందిరి వాహనం

**మూడోరోజురాత్రి స్వామికి జరిగే సుకుమారసేవగా ముత్యపుపందిరి వాహనాన్ని చెప్పవచ్చు. ముక్తిసాధనకు ముత్యం లాంటి స్వచ్ఛమైన మనసు కావాలని ఈ వాహనంద్వారా స్వామి చాటిచెబుతారు.**

**బకాసురుని వధించిన బాలకృష్ణుని అవతారరూపంలో ఈ వాహనంమీద మలయప్ప స్వామి ఉభయనాంచారులతో తిరువీథులలో సంచరిస్తారు. ఈ వాహనసేవను ముత్తుపందల్, ముత్యపుపందిరి అని అంటారు.**



ఒకరోజు కౌండిన్యుడు శీలచేతికున్న తోరాన్ని చూచి, "శీలా! ఎవరినో వశపరచుకోవడానికై కట్టుకొన్నావు" అని నిందించాడు. ఆమె సత్యమే చెప్పింది. అయినా అతడు దైవ దూషణ చేస్తూ, కోపంతో ఆ తోరాన్ని త్రెంచి, నిప్పుల్లో పడేశాడు. శీల తటాలున వెళ్లి, ఆ తోరాన్ని తీసుకొని, పాలలో వేసింది. కౌండిన్యునిదుశ్చర్యవల్ల అతని సంపద నానాటికీ నశింప సాగింది. అతనిగోవులను దొంగలు తోలుకుపోయారు. ఇల్లు కాలిపోయింది. వస్తువులు మాయమైపోయాయి. బంధువులతో కలహాలు ఏర్పడ్డాయి. ఎవ్వరూ అతణ్ణిగూర్చి విచారించినవారు లేరు.

తన దుశ్చర్యకు, కోపానికీ చింతిస్తూ, బుద్ధి తెచ్చుకుని, "నేను ఆ అనంతుణ్ణి ఎప్పుడు చూడగలను? ఆస్వామిని చూచేవరకు నాకు ఏమీ అక్కరలేదు" అని ప్రతిజ్ఞచేసి. కఠిన బ్రహ్మచర్యదీక్షతో నిర్మానుష్యమైన అడవిలో ప్రయాణం సాగించాడు. అక్కడొక మామిడిచెట్టు పుష్పఫలభరితంగా కన్పించింది. కానీ ఒక్క పక్షికూడా ఆ చెట్టుపై వ్రాలి వాటిల్ని తినడంలేదు. ఆ చెట్టుతో "వృక్షమా! నీవు అనంతుణ్ణి చూచావా?" అన్నాడు. ఆ చెట్టు ఆయన ఎవరో నాకు తెలియ"దనింది. మరొకచోట మోకాలి అంత ఎత్తుగడ్డిలో నిలిచి ఉన్నా– గడ్డి తినక అటూ ఇటూ తిరుగుతున్న ఆవునూ, దాని దూడను చూచి, "మీరు అనంతుణ్ణి చూచారా? అన్నాడు. అవి "మాకు తెలియ"దన్నాయి. మరి కొంత దూరంపోగా పచ్చికబీళ్లలో నిలబడి ఉన్న ఎద్దునూ, రెండు తామరకొలనులను, వాటివెనుక ఒక గాడిదను, ఒక ఏనుగును చూచి, వాటన్నిటినీ "మీరు అనంతుణ్ణి చూచారా" అన్నాడు. అవి 'మేము చూడలేద'న్నాయి.

ఇక ప్రయాణించలేక ఒకచోట కూర్చున్నాడు– కౌండిన్యుడు. శ్రీఅనంతపద్మనాభస్వామి ఆ కౌండిన్యుని అవస్థకు జాలిపడి, ఒక వృద్ధబ్రాహ్మణరూపంతో వచ్చి, నిల్చుండి "అయ్యా! ఇటురా! నేను నీకు అనంతుణ్ణి చూపిస్తాను" అని చెప్పి, అతని కుడిచేతిని పట్టుకొనిపోయి, తన పురాన్ని చూపించి, అందు శంఖచక్రాలు ధరించి, గరుడునిపై కూర్చుని అష్టైశ్వర్యాలతో శోభించే సర్వాంతర్యామి అనంతపద్మనాభస్వామిరూపుడైన తనను చూపాడు. ఆ కౌండిన్యుడు అనంతుణ్ణి చూచి, స్తోత్రం చేశాడు. తనను రక్షింపుమని ప్రార్థించాడు. "నేనిక ఎన్నటికీ నిన్ను మరువను" అని ప్రాధేయపడ్డాడు. అనంతపద్మనాభస్వామి కరుణించి, అతనికి ఇహంలో సంపద, ధర్మబుద్ధినీ, పరంలో శాశ్వతమైన మోక్షాన్నీ ప్రసాదించాడు. సంతోషంతో ఆ కౌండిన్యుడు "దేవా! నేను దారిలో చూచిన మామిడిచెట్టు, ఆవు, ఎద్దు, రెండుకొలనులు, గాడిద, ఏనుగు – ఏమిటివి?" దయతో తెల్పండని ప్రార్థించాడు.

శ్రీపద్మనాభస్వామి "అయ్యా! పూర్వజన్మలో ఒక బ్రాహ్మణుడు గొప్ప విద్వాంసుడైనా- శిష్యులకు విద్యలు నేర్పక గర్వించి ఉండినాడు. అతడే అడవిలో ఎవరికీ ఉపయోగపడని మామిడి చెట్టుగా పుట్టాడు. జన్మాంతరంలో ఒక బ్రాహ్మణుడు ధనికుడైనా- ఎవ్వరికీ పిడికెడు అన్నంకూడా పెట్టాడు కాడు. అతడే పచ్చి గడ్డిలో నిల్చున్నా- గడ్డి తినడానికి నోరాడని ఒక ఆవుగా పుట్టినాడు. మునుపు చవిటినేల బ్రాహ్మణులకు దానం చేసిన ఒక రాజు ఎద్దై పుట్టి తిరుగుతున్నాడు. ఆ కొలనులు రెండూ ధర్మ-అధర్మాలు. పరనింద చేసినవాడే ఆ గాడిద. పెద్దలుంచిన ధర్మమైన సొత్తును అమ్మినవాడే ఆ ఏనుగు. నీకు బక్కచిక్కిన వృద్ధ బ్రాహ్మణుడుగా కనిపించినవాడే ఆ అనంతపద్మనాభస్వామినైన నేను! ఇక సంతోషంతో ఇంటికి (ఆశ్రమానికి) వెళ్లి, 14 సంవత్సరాలు కల్పోక్తప్రకారంగా ఈ వ్రతాన్ని ఆచరించు. తర్వాత నీకు నక్షత్రస్థానం ఇస్తాను. నీవు ఈ లోకంలో సకలసుఖాలు అనుభవింతువు గాక!" అని చెప్పి, అనంతపద్మనాభస్వామి అదృశ్యుడయ్యాడు.


కౌండిన్యుడు ఇంటికి వచ్చి, ఉత్తమమైన ఈ వ్రతాన్ని భక్తినిష్ఠలతో ఆచరించి, ఈ లోకంలో సుఖంగా జీవితం గడిపి, పరంలో సకుటుంబంగా ఆకాశంలో కల్పాంతస్థాయియై - నేటికీ నక్షత్రమండలంలో కన్పిస్తున్నాడు- అని చెప్పి, శ్రీకృష్ణుడు "ఓ ధర్మరాజా! మునుపు అగస్త్యుడు ఈ వ్రతాన్ని ఆచరించి, మానవలోకంలో వ్యాపింపజేశాడు. తర్వాత సగరుడు, భరతుడు, దిలీపుడు, హరిశ్చంద్రుడు, జనకుడు- మున్నగు ఎందరో రాజులు ఈ వ్రతాన్ని ఆచరించి, రాజ్యాలు అనుభవించి, స్వర్గలోకం పొందారు. సకలకష్టాలూ తొలగించి, కాపాడే ఈ ఉత్తమవ్రతాన్ని నీకు వివరించాను. నీవుకూడా ఈ వ్రతం చేసి, నీకష్టాలనుండి గట్టెక్కి సుఖింపుము.

ఎవరు ఈ కథను చదువుతున్నారో, ఎవరు వింటున్నారో, వారు ఈ లోకంలో అష్టైశ్వర్యాలు అనుభవించి, సకల పాపాలనుండీ విముక్తులై ఉత్తమగతిని పొందుదురు" అని బోధించాడు.

**వ్రతసందేశం :** ఏ వ్రతాన్నైనా భక్తి, శ్రద్ధ, విశ్వాసాలతో నిష్ఠగా చేయాలి. చేసినవారినీ - ఆ దేవుణ్ణీ నిందించరాదు. దాన ధర్మాలు చేయకపోవుట, బాధ్యతలు నిర్వహించకపోవుట, విద్యలు బోధించకపోవుట, గర్వాహంకారాలతో ప్రవర్తించుట- మున్నగు దుష్కార్యాలు చేస్తూంటే తర్వాతి జన్మల్లో ఈ కథలో సూచించినట్టి దుస్థితియే కల్గుతుంది.

ఎవరి శక్తికొలదీ వారు వ్రతాలు ఆచరించవచ్చు. స్త్రీ పురుషభేదంలేదు. నైవేద్యం ఏవి ఉంటే అదే అర్పించవచ్చు. భగవంతుడు వస్తుప్రియుడు కాదు. స్వామి భక్తిప్రియుడు. భక్తప్రియుడు. అన్నింటికీ ఆధారం భక్తియే!

*॥ సర్వేజనాః సుఖినో భవంతు ॥*



## కల్పవృక్ష వాహనం

కల్పవృక్షం కోరినవారికి మాత్రమే వరాలిస్తుంది. తన భక్తులకు అడగకుండానే వరాలిచ్చే దేవదేవుడు వేంకటాద్రివాసుడు. కల్పవృక్షం... అన్నం, వస్త్రాలు, కోర్కెలు మాత్రమే తీర్చగలదు. కానీ స్వామి శాశ్వతకైవల్యం ప్రసాదించే కల్పతరువు. నాలుగోరోజు ఉదయం ఈ వాహనంపై వెంకన్న సర్వాలంకారభూషితుడై ఊరేగుతాడు.

# ఇదొక్కటుంటే చాలు....

- శ్రీమతి కిళాంబి లక్ష్మి

వినయంవల్లనే విద్య రాణిస్తుంది, విద్యార్థి రాణిస్తాడు. ఇందుకు ఉదాహరణలు మన ఇతిహాసాలలో కోకొల్లలు!

కచుడు బృహస్పతికుమారుడు. ఇతడు తన వినయ గుణంవల్ల శుక్రాచార్యునివద్ద శిష్యుడుగా చేరి "మృతసంజీవని" విద్యను పొందగలిగాడు. కచుడు తనవిరోధి బృహస్పతి కుమారుడు అని తెలిసికూడా శుక్రాచార్యులు- అతని వినయానికి ముగ్ధుడై, అతణ్ణి శిష్యుడుగా స్వీకరించాడు.


"అన్నీ ఉన్న ఆకు అణగిమణగి ఉంటుంది. ఏమీలేని ఆకు ఎగిరెగిరిపడుతుందని" సామెత. మంచిగుణాలు కల్గిన వారు ఎప్పుడూ వినయంగానే ఉంటారు. చెడ్డగుణాలు కల్గిన వారు తమ చెడ్డగుణాల్ని కప్పి పుచ్చుకోవడానికి డాబుగా మాట్లాడడం, ప్రవర్తిస్తూ ఉంటారు. వినయాన్ని కలిగి ఉండడం అనే దానికి ఉదాహరణగా మన చేతిని చెప్పవచ్చు. చేతిలోని వ్రేళ్లను వినయం అనే గుణంచేత వంచితే, అది పిడికిలిగా మారుతుంది. ఆ పిడికిలితో దేనినైనా ఎదుర్కొనే ధైర్యం, ఆత్మ విశ్వాసం కలుగుతాయి.

చేతిలోని వ్రేళ్ళలాగే వినయంవల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. వాటిలో చెప్పుకోదగ్గవి ఐదు. 1)కొత్త విషయాలు తెలుస్తాయి. విజ్ఞానం పెరుగుతుంది. 2)అనుకున్న లక్ష్యాన్ని సాధించి, అందరిచేత ప్రశంశలు పొందుతారు. 3)కీర్తిమంతులవుతారు. 4)సంపద కలుగుతుంది. 5)శత్రు బాధే లేకుండా మిత్రలాభం కలుగుతుంది.

రామాయణంలో శ్రీరాముడు విశ్వామిత్రునివెంట యాగరక్షణకు వెళ్లిన ఘట్టమే ఇందుకు ఉదాహరణ శ్రీరాముడు చక్రవర్తి కుమారుడు. అతడు విశ్వామిత్రుని వెంట యాగరక్షణ కోసం వెళ్లాడు. విశ్వామిత్రుడు; శ్రీరాముడు చక్రవర్తి కుమారుడనీ, ఎండకన్నెరుగని సుకుమారుడని తెలిసినా, అతనికోసం ఎలాంటి వాహనాల్నిగాని, పరివారాన్నిగాని ఉపయోగించ లేదు.

అలాగే రాముడుకూడా వినయంగా విశ్వామిత్రుడు ఎలా తీసుకుని వెళితే, అలా కాలినడకన ప్రయాణమయ్యాడు. దానివల్ల శ్రీరాముడు పైన చెప్పుకున్న ప్రయోజనాలన్నీ పొందాడు.

అహల్య, తాటకి మొదలైనవారిచరిత్రలు, ఆయా ప్రాంతాల విశేషాలు తెలుసుకున్నాడు. అలాగే ఎన్నో అస్త్రాలను విశ్వామిత్రునివద్దనుండి పొందాడు. విశ్వామిత్రునియాగ రక్షణ చేసి, అనుకున్నలక్ష్యాన్ని సాధించి, విశ్వామిత్రుని చేత, ఇతరమునులచేత ప్రశంసలందుకున్నాడు. తాటకి, సుబాహులను చంపడంవల్ల, అతనిపరాక్రమంగురించి, శివధనుస్సును ఎక్కుపెట్టుటవల్ల, అతని కీర్తి నేలనాలుగుచెరగులా వ్యాపించింది. శివధనుస్సును ఎక్కుపెట్టి, సాక్షాత్తు లక్ష్మీఅవతారమైన సీతాదేవిని వివాహమాడి, అంతులేని సంపదలను పొందగలిగాడు. శత్రువులైన రాక్షససంహారానికి నాంది జరిగింది. ఈ విధంగా వినయముంటే అన్నీ సంక్రమిస్తాయని చెప్పుకోవచ్చు.



# దేవదేవుడి పాదరక్షలు...

- శ్రీ బి.వి.రమణ




తిరుమల అంటేనే దేవదేవుడైన శ్రీవేంకటవిభునిదివ్యమంగళసాలగ్రామ రూపం మదిలో దర్శనమిస్తుంది. ఆదిశేషునికొండపై స్వర్గతుల్యమైన ఆలయ ప్రాంగణం గుర్తుకొస్తుంది. శ్రీ శ్రీనివాసుని దివ్యలీలామానుషమూర్తిమత్వం మనలో భక్తిపారవశ్యతను పాదుకొలుపుతుంది. బ్రహ్మోత్సవాల్లులాంటి పర్వదినాలప్పుడిక చెప్పనక్కరలేదు. బ్రహ్మాదిదేవతలందరూ అక్కడే కొలువుదీరుతారు. దేశం నలుమూలల నుంచీ భక్తజనాలు తండోపతండాలుగా వచ్చి, తమ ఇలువేల్పును సేవించుకుంటారు. శేషాచలశిఖరాలన్నీ గోవిందనామస్మరణతో మార్మోగుతుంటాయి. "ఏడుకొండలవాడా! వేంకటరమణా! గోవిందా గోవింద!"

దక్కనుపీఠభూమి, తూర్పుకనుమలలోని శేషాచలశిఖరాలలో వెలసిన తిరుమలకొండలు సముద్రమట్టానికి సగటున 2,800 అడుగుల ఎత్తున ఏర్పడి ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రం చిత్తూరుజిల్లాలోని తిరుమల 'ఎగువతిరుపతి'గా కూడా ప్రసిద్ధి. పరమపావనమైన సప్తగిరులు తరతరాలుగా మాన్యులనుంచీ సామాన్యుల వరకు ముక్తిధామాలు! భగవద్భక్తికి సోపానాలు! దైవత్వానికి ప్రతీకలు!

ప్రాచీనకాలంలో భగవంతుణ్ణి చేరుకోవడానికి ఆత్మపరంగా ఆధ్యాత్మికమార్గాన్నే అనుసరించినా భౌతికంగా తిరుమల శ్రీవారిసన్నిధి చేరుకోవడానికి నాలుగుప్రధాన మార్గాలుండేవి. వాటిలో తిరుపతినుంచి తిరుమలవెళ్లే 'అలిపిరి సోపానమార్గం' ప్రధానమైంది. తక్కినవి 'చిట్టేచర్ల-దేవరకొండ దారి', బాలపల్లి-మామండూరు 'స్వామిపాదాల తోవ', శ్రీనివాసమంగాపురం మీదుగా 'శ్రీవారిమెట్టు' లేక శ్రీపతివారిమెట్టుమార్గం.

అలిపిరినుంచి ఆనందనిలయునిసన్నిధికి దారితీసే ఈ పడికట్లదోవ తిరుపతి, తిరుమలమధ్య సాంస్కృతికసారథి! మానవుడికి-మాధవుడికి మధ్య అనుబంధవారధి!

వాస్తవానికి వానలకి నీళ్లుదూకే కొండనారవలో ప్రాచీనమైన మెట్లమార్గం ఉండేది. దాన్ని 'కురబదోవ' అని పిలిచేవారు. ఈ ఇరుకుదోవను అనుసరించి, నాటి భక్తశిఖామణులు అక్కడక్కడా ఆంజనేయస్వామి రూపాలను, ఇతర దేవతాప్రతిమలను నెలకొల్పారు. అయితే ప్రస్తుతం ఆ దారి చాలావరకు అందుబాటులో లేదు. ఆ విగ్రహాలు కూడా అన్నీ కన్పించవు.

కొండలరాయుడికోసం క్రమంగా జనం పెరిగి, మాహాత్మ్యాలు వెల్లువెత్తడంతో ఆ దోవను కొంచెం ప్రక్కకు మార్చారు. అలా అలా మార్పులు చేర్పులకులోనై నేటి సువిశాలపడికట్లమార్గంగా స్థిరపడింది. విజయనగరచక్రవర్తి సాళువనరసింహరాయలు, మట్లకుమారఅనంతరాజుల కాలంలోనూ, మహంతులు, తిరుమల తిరుపతి దేవస్థానాలవారి హయాంలోనూ అలిపిరిమెట్లదారి అంచెలంచెలుగా చక్కని సౌకర్యాలను సంతరించుకుంది.

## అలిపిరి

కొండశిఖరాలతో, ఘనగుడి గోపురాలతో, శిల్పశోభిత మండపాలతో, భక్తులరాకపోకలతో నిరంతరం సందడిగా ఉండే దైవావరణం. రెండు ఘాట్‌రోడ్లకు, నడకదోవకు కూడలిస్థానం. తిరుమలకు పాదపీఠం. ఒక్కమాటలో చెప్పాలంటే పంచభూతాత్మకప్రకృతి, పురాణాలు, ఐతిహ్యాలు, సనాతనసంస్కృతిసంప్రదాయాలు, చరిత్ర, సమకాలీనభక్తితత్పరతల సంగమస్థలి– అలిపిరి. 'అడిపుళి' అని కొందరంటారు. తొలిమెట్టుదగ్గర చింతచెట్టును చూసి తమిళులు అలా పిలిచేవారు. తమిళంలో చింతచెట్టును 'పుళిమరం' అంటారు. వారు అడిపుళి అనే కాకుండా అడిపడి అనికూడా పలుకుతారు. తమిళంలో అడిపడి కాస్తా అలిపిరిగా మారింది. 'అడి' అంటే ఆది లేక తొలి, 'పడి' అంటే మెట్టు, తొలిమెట్టు అని అర్థం. ఇక్కడ స్వామి పాదాలు వెలసిన మండపానికే **అలిపిరి పాదాలమండపం** అని పేరు. అలిపిరి అంటే 'అల్పశరీరి' అనికూడా అర్థంగా చెబుతారు. శ్రీవేంకటేశ్వరస్వామి సూక్ష్మశరీరంతో ఇక్కడ భక్తులను అనుగ్రహిస్తుంటారని భక్తుల నమ్మకం.

మెట్లెక్కి తిరుమలకు నడచివెళ్లే భక్తులు మండపంలోని శ్రీస్వామివారిని సేవించుకుని, శ్రీవారిలోహపాదాలను భక్తిప్రపత్తులతో నెత్తినిడుకుని గర్భగుడి ప్రదక్షిణ చేస్తారు. సనాతన భారతీయతాత్త్విక ఆరాధనలో పాదాల ఔన్నత్యానికి ఇదో మచ్చుతునక. ఇత్తడి, వెండితో చేసిన పాదరక్షలను భక్తులు కొందరు శ్రీస్వామివారికి మొక్కుగా చెల్లించుకుంటారు.

పాదాలమండపస్థానంలో పూర్వం ఉండిన ఓ పెద్దచింత చెట్టుకింద శ్రీభగవద్రామానుజాచార్యుల వారికి తన మేనమామ తిరుమలనంబి రామాయణరహస్యాలు వివరించారట! ఒక రోజు రామాయణరహస్యాలు ఉపదేశించేక్రమంలో స్వామి అర్చనకు ఆలస్యం కావడంతో సాక్షాత్తూ ఆ భగవంతుడే తన పాదచిహ్నాలను అక్కడ వదలివెళ్లాడని పౌరాణికగాథ! అయితే ఈ ఘటన **'మోకాటి ఎక్కుడు'** వద్దనున్న దోవ భాష్యకారుల సన్నిధి దగ్గర జరిగి ఉంటుందని కొందరి విశ్వాసం.

## దేవుడి పాదరక్షలు

మునుపు ఇక్కడ తోలుచెప్పులు ఉండేవి! వాటి కొలతలు మామూలు మనుష్యులు ధరించేవిగా అనిపించవు. పూర్వం స్వామివారికి పాదరక్షలు సమర్పించే సంప్రదాయం కొందరు చర్మకారుల సొంతం. ఆ భగవద్భక్తుల ఇళ్లలో చివరి శ్రావణ శనివారం శ్రీస్వామి ఆకృతి (పటం) ముందు పిండిపరచి తళిగ వేసేవారు. మరుసటిరోజు ఉదయం వచ్చి చూచేసరికల్లా శ్రీశ్రీనివాసుని పాదముద్ర ఆ పిండిమీద ప్రత్యక్షమయ్యేది. ఒకరి ఇంట్లో కుడిపాదం పడితే, మరొకప్రాంతంలోని ఇంటిలో



### సర్వభూపాల వాహనం

**లోకంలో భూపాలులందరికీ భూపాలుడు తానే నని లోకానికి చాటుతూ స్వామి నాలుగోరోజు రాత్రి ఈ వాహనంపై కొలువుదీరుతాడు. ఈ వాహనసేవ జీవుల్లో అహంకారాన్ని తొలగించి, శాశ్వత ఫలాన్ని ఇస్తుంది.**

**ఏడడుగుల ఎత్తు, పూర్తిగా బంగారురేకులతో నిర్మించిన వాహనం 'సర్వభూపాలవాహనం'. 'సమరభూపాల వాహన' మన్న పేరు శాసనంలో కనబడుతుంది. దేవచోడ వంశానికి జెందిన మట్లకుమార అనంతరాయలు ఇచ్చిన వాహనాలలో ఇది ఒకటి.**

ఎడమపాదం ముద్రితమయ్యేది. అత్యంతభక్తిప్రపత్తులతో ఆ చరణముద్రణకు సరిపడా కొలతలతో సుందరమైన పాదరక్షలను తయారు చేస్తారు. ఓ శుభగడియన ఆ పాదరక్షలను నెత్తినిడుకుని మేళతాళాలతో, భజనలతో ఊరేగింపుగా వివిధగ్రామాల గుండా బయలుదేరి అలిపిరి పాదాలమండపం చేరుకుంటారు. శ్రీస్వామివారికి సమర్పించుకుంటారు. విచిత్రంగా రెండు పాదరక్షలు ఒకరే తయారు చేసినట్లు సరిజతగా ఉంటాయి. ఆ జత చెప్పులు ఒకరివే అన్నట్లు సరిగ్గా సరిపోతాయి. అదే భగవంతుని మహిమ! అంతేకాదు భక్తులిచ్చిన పాదరక్షలను స్వామి ప్రీతితో ధరించి, వాడినరీతిలో అవి అక్కడక్కడా అరిగిపోయి ఉండడమూ కద్దు. ఆహా! ఆ వేంకటేశుడు మహిమల ఱేడు కదా!

శ్రీవేంకటేశ్వరస్వామిపాదద్వయం కలిగిన పాదాల మండపాన్ని జీర్ణోద్ధరణ చేసి 2001వ సంవత్సరం ఆగష్టు 9న శ్రీవేంకటేశ్వరస్వామివారి విగ్రహప్రతిష్ఠ గావించారు. ప్రతి శనివారం శ్రీవేంకటేశ్వరస్వామికి విశేషపూజ. ఎందరో భక్తులతో సహా స్థానికులూ ఈ ప్రత్యేకపూజలో పాల్గొంటారు. అదేరోజు సాయంత్రం ఆరున్నరగంటలకు అన్నమాచార్యప్రాజెక్టుకళాకారుల సంకీర్తనాకచ్చేరి ఉంటుంది. ప్రతిశుక్రవారం మూలవర్లకు అభిషేకం జరుగుతుంది. శిల్పశోభితమైన మనోహర పాదాలమండపం విజయనగరసామంతుడు మట్లకుమార అనంత రాజుచే నిర్మితమైంది. ఈ మేరకు క్రీ.శ.1628నాటి శాసనం మండపంలో చెక్కబడింది. దక్షిణాభిముఖంగా ఉండే ఈ పాదాల మండపానికి పశ్చిమంగా ఆంజనేయస్వామి విగ్రహం ప్రతిష్ఠితమై ఉంది. మెట్లోత్సవాలు, ఇతర ప్రత్యేకపర్వదినాలలో ఈ పాదాల మండపం ప్రాంగణమంతా భక్తజనసమూహాలతో కోలాహలంగా ఉంటుంది.

పాదాలమండపం ముంగిట శరణాగతితత్త్వాన్ని ప్రతిబింబిస్తూ సాష్టాంగదండప్రణామా లాచరిస్తున్నట్లున్న ఓ విగ్రహం చూపరులను ఆకట్టుకుంటుంది. దానిపక్కనే ఒక శాసనం ఉంది. కోళాల్ కొండయన్ కుమారుడు తమ్మయన్ (లకుమయ్య) అలమేలుమంగా సమేత శ్రీవేంకటేశ్వరుని పాదపద్మాల చెంత సదాసేవలో ఉన్నట్టు క్రీ.శ.1623నాటి శాసనం. ఈ బహుశ లకుమయ్య ఇక్కడి సుందరగుడి గోపురాలు, మండపాల నిర్మాణ శిల్పులలో ఒకరై ఉంటాడు. శిల్పాలమధ్య శిలామూర్తిగా చరితార్థుడయ్యాడు.

## మోహినీ అవతారం



**అత్యంత ప్రధానమైన ఐదవరోజు ఉదయం మోహినీఅవతారంలో స్వామి సాక్షాత్కరిస్తాడు. అన్ని వాహనసేవలూ వాహనమండపం నుంచి ప్రారంభమైతే, మోహినీఅవతారం మాత్రం శ్రీవారిఆలయంలో నుంచే పల్లకిపై ప్రారంభమౌతుంది. పరమశివుడినిసైతం సమ్మోహనపరచి, క్షీరసాగరమథనంనుంచి వెలువడిన అమృతాన్ని దేవతలకు మాత్రమే దక్కేలా చేసిన అవతారమిది. మంచిపనులు చేయడం ద్వారా అనుగ్రహం ఎలా పొందవచ్చో లోకానికి చాటడానికే శ్రీవారు జగన్మోహిని రూపంలో తిరువీథుల్లో విహరిస్తారు.**

**ఉత్సవమూర్తి మామూలుగా నిలబడే భంగిమలో కాకుండా ఆసీనులైన భంగిమలో కనిపించడం విశేషం. స్త్రీలు ధరించే అన్ని ఆభరణాలతో స్వామివారిని అలంకరించడం ఒక ప్రత్యేకత. సాధారణంగా వరదభంగిమలో కనిపించే స్వామివారికుడిహస్తం మోహినిఅలంకరణలో అభయహస్తముద్రతో ఉండడం ఒక ప్రత్యేకత. స్వామివారికి పట్టుచీర, కిరీటంపైన రత్నఖచితమైన సూర్యచంద్రసావేరి, నాసికకు వజ్రఖచితమైన ముక్కుపుడక, బులాకి, శంఖచక్రాల స్థానంలో రెండు వికసించిన స్వర్ణకమలాలను అలంకరిస్తారు.**




# కనులకు వెలుగువు నీవే కావా...

– శ్రీ కె.టి. శేషాద్రి

అది 1996వ సంవత్సరం ఏప్రిల్ నెల. యథావిధిగా వేకువనే నిద్రలేచి, కళ్లు తెరిచేసరికి, నా ఎడమకన్నుదృష్టి మసకబారి, వాతావరణమంతా అస్పష్టంగా గోచరించింది. ఈ హఠాత్పరిణామానికి ఎంతో ఆందోళన చెందిన నేను 'నా ఆరాధ్యదైవమైన ఆ తిరుమలేశునికి నా బాధ విన్నవించుకున్నాను.

గతంలో ఆస్వామికరుణాకటాక్షాలతో, అనేకఆపదలు, సమస్యల నుండి సునాయాసంగా బయటపడ్డ నేను, ఈసారికూడా ఆస్వామిపై పూర్తి భారం మోపి, నాకు పరిపూర్ణదృష్టిని ప్రసాదించమని అంతులేని ఆవేదనతో, ఆర్తితో అర్థించాను.

రోజురోజుకు క్షీణిస్తున్న నా ఎడమకంటి దృష్టి పాక్షిక అంధత్వానికి దారి తీస్తుంటే, మానసికంగా క్రుంగిపోయిన నేను చివరకు ఆ 'ఆపదమ్రొక్కులవాని' నామలిఖిత జపం ప్రారంభించాను. ప్రతిరోజు ఎంతో భక్తి శ్రద్ధలతో ***"ఓం నమః శ్రీ వేంకటేశాయ"*** అనే నామాన్ని ఒక పెద్ద పుస్తకంలో రోజు ఒకపేజి వ్రాయసాగాను. పుస్తకం పూర్తయ్యే లోపల నా సమస్యను పరిష్కరించాల్సిందిగా ఎంతో ఆర్ద్రతతో ఆ స్వామిని రోజూ ప్రార్థించేవాడిని.

మానవప్రయత్నంగా నాకంటిసమస్యను, నేత్రవైద్యుడి దగ్గరకు వెళ్లి పరీక్షలు చేయించాను. అతి ఖరీదైన 'కార్నియా మార్పిడి' శస్త్ర చికిత్స చేస్తే తప్ప పూర్వపుదృష్టి వచ్చే అవకాశంలేదని వైద్యులు తేల్చి చెప్పారు. అదికూడా మహానగరాల్లోని ప్రఖ్యాతి గాంచిన నేత్రవైద్య శాలలోమాత్రమే సాధ్యమని చెప్పారు.

ఆ కొండలరాయడిపై అపారవిశ్వాసం భక్తి ఉన్న నేను ఏమాత్రం చలించక నిర్విఘ్నంగా ఆ స్వామి "లిఖితజపం"లో మునిగిపోయాను.

ఇది ఇలా ఉండగా ఏప్రిల్ 24వ తేది నుండి ప్రారంభమైన వేసవిసెలవులలో కుటుంబసమేతంగా ముంబై వెళ్లి, అక్కడ మా బంధువుల ఇంట్లోకూడా 'లిఖితజపం' కొనసాగించాను.

ఎడమకంటిదృష్టి దాదాపు పూర్తి క్షీణదశకు వచ్చింది. నా 'లిఖితజపం' పుస్తకం ఇక రెండురోజులలో పూర్తవుతుందనుకునే సందర్భంలో ముంబైలోని అతి ఖరీదైన 'జస్లోక్ హాస్పిటల్'లో ప్రముఖ వైద్యునిగా పనిచేస్తున్న నా పూర్వవిద్యార్థి నాకు తటస్థపడి, నన్ను గుర్తుపట్టి ఎంతో ఆప్యాయత, అభిమానంతో తన కారులో ఆసుపత్రికి తీసుకెళ్లి హాస్పిటల్ అంతా చూపించాడు.

ఆ సందర్భంలో నేను నా కంటిసమస్యను అతనితో చెప్పగా, ఎంతో ఖరీదైన కంటిపరీక్షలు ఉచితంగా చేయించి, నిపుణులైన వైద్యులపర్యవేక్షణలో నాకు 'కార్నియామార్పిడి శస్త్ర చికిత్స' అవసరం లేదని, కేవలం చుక్కలమందులతో పూర్వపు పరిపూర్ణదృష్టి వస్తుందని హామీ ఇచ్చి, కంటిమందులుకూడా ఉచితంగా ఇచ్చారు. ఆ మందులు ఆ రోజు రాత్రి నుండే వేసుకోవడం ప్రారంభించాను.

ఆశ్చర్యం! మరుసటిరోజు తెల్లవారు జామున కళ్లుతెరచేసరికి నా ఎడమకన్ను దృష్టిలో ఎంతో మార్పు గోచరించింది. తర్వాత ఒక వారానికంతా నాకు పరిపూర్ణదృష్టి వచ్చింది.

ఆ స్వామికృపతో ఈ రోజు నేను చక్కని దృష్టితో ఆ స్వామిశృంగారరూపాన్ని చూడగలుగుతున్నాను. తనను నమ్ముకున్న భక్తులకు కొండంత అండ ఆ స్వామి అనేందుకు ఇంతకన్నా నిదర్శనం ఏముంది!

# ఆధ్యాత్మిక విశిష్టతకు ఆలవాలం

– 'సారస్వతకళానిధి'
ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి

కాలం భగవత్స్వరూపం. పరమాత్మ లీలావిలాసాలలో కాలచక్రగమనం ఒక క్రీడ. భారతీయసంస్కృతిలో పండుగలకు, పర్వదినాలకు, సంప్రదాయాచరణకు సూర్య, చంద్రమానాలను ఆలంబనంగా స్వీకరిస్తున్నాం. చాంద్రమాసంలో పౌర్ణమినాడు చంద్రుడు ఏ నక్షత్రంతో కూడి ఉంటాడో ఆ నక్షత్రాన్నిబట్టి ఆయా మాసాలకు నామకరణం చేశారు మన శాస్త్రజ్ఞులు. ఈ క్రమంలో ఏడవమాసం ఆశ్వయుజమాసం. ఈ మాసంలోని పూర్ణిమాతిథినాడు చంద్రుడు అశ్వినినక్షత్రం చేరువలో ఆకాశాన్ని అలంకరిస్తాడు. కనుక దీన్ని ఆశ్వయుజమాసం అంటారు.

షడృతువులలో నాల్గవదైనశరత్తు ఈ మాసంతోనే ప్రకృతిలో చోటుచేసికొంటుంది. 27 నక్షత్రాలలో ప్రథమ నక్షత్రం అశ్విని. దీన్నిబట్టి పరిశీలించినప్పుడు ద్వాదశ మాసాలలో ఆశ్వయుజం తొలిమాసం అవుతుంది. ఆదిపరాశక్తి ఆరాధనకు ఆశ్వయుజం అత్యంతవిశిష్టం. శుక్లపక్ష పాడ్యమి మొదలుకుని నవమివరకు అత్యంత భక్తిప్రపత్తులతో అమ్మవారి ఆరాధన సాగుతుంది. దేవీఆరాధనకు ఉద్దిష్టమైన రాత్రులు కనుక దేవీనవరాత్రులు అని, శరత్కాలసంబంధ ఆరాధనలు కనుక శరన్నవరాత్రులు అని వ్యవహరిస్తారు.

ఆశ్వయుజమాసంనుండి ఫాల్గునంవరకు కాలం స్త్రీరూపాత్మకం. కనుక, ఈ మాసం అపరాజిత (దుర్గ) ఆరాధనకు ఉద్దేశింపబడింది.

వివిధ శక్తిస్వరూపాలతో విరాజిల్లే ప్రకృతిస్వరూపిణి అయిన జగన్మాతను ఆరాధించే అందమైన మాసం ఆశ్వయుజం.

అజ్ఞాతవాసానికి ఉద్యుక్తులైన పాండవులు వారి ఆయుధాలను శమీవృక్షంపై దాచి ఉంచి, తిరిగి విజయదశమినాడే వాటిని స్వీకరించి, కురుక్షేత్రంలో విజయ దుందుభులను మ్రోయించారు.

ఆశ్వయుజ బహుళ తదియ అట్లతదియ. ఒకనాటి గ్రామసీమల్లో వినోదాత్మకంగా సాగే ఆచారాలతో నిండిన తదియ–ఇది. స్త్రీ, పురుషవయోభేదం మరచి, గోరింట



## గరుడవాహనం

ఐదోరోజు రాత్రి తనకు నిత్యసేవకుడైన గరుత్మంతుడిమీద స్వామి ఊరేగుతాడు. స్వామి మూలమూర్తి మీద ఉన్న మకరకంఠి, లక్ష్మీహారం, శ్రీవేంకటేశ్వర సహస్రనామమాల ధరించి, మలయప్పస్వామి భక్తులను అనుగ్రహిస్తాడు. శ్రీవేంకటేశ్వరస్వామిని అనేకవిధాల కొనియాడిన గోదాదేవి శ్రీవిల్లిపుత్తూరు నుంచి పంపే తులసిమాల, నూతనఛత్రాలను గరుడవాహనంలో అలంకరిస్తారు. గరుడుడితో స్వామికి గల అనుబంధాన్నికూడా ఈ సేవ చాటిచెబుతుంది.

కొత్తగొడుగులనీడలో, బంగారుగరుడునిపై వేంచేసి, వరదహస్తుడైన స్వామిని తిరువీథులలో ఊరేగించడం రమణీయమైన దృశ్యం. పదిరోజులు జరిగే బ్రహ్మోత్సవాలలో ఇది పరాకాష్ఠ. గరుత్మంతుడు నిత్యసూరి, స్వామికి దాసుడు, సఖుడు, వాహనం, పతాకచిహ్నం. గరుత్మంతునికి తెలియని స్వామి రహస్యాలు లేవు. గరుడుని 'పెరియతిరువడి' అనడం వైష్ణవసంప్రదాయం.


పండిన చేతులతో, ఉత్సాహం నిండిన చేతులతో, అనుబంధాలు అల్లుకున్న అంతరంగాలతో ఆనందాలు పండించుకునే అద్భుతసందర్భం అట్లతద్దె.

ఆశ్వయుజ కృష్ణపక్షత్రయోదశి శ్రీధన్వంతరి జయంతి. భారతీయసంస్కృతిలో వైద్యుడు సాక్షాత్తు శ్రీమన్నారాయణస్వరూపుడే. "వైద్యో నారాయణో హరిః" క్షీరసాగర మథనసందర్భంలో శ్రీమహావిష్ణువే ఆయుర్వేదవైద్య ప్రవర్తకరూపంలో ధన్వంతరిగా అవతరించాడు. జీవులకు శ్రేయస్సును కలిగించేవారిని దైవస్వరూపులుగా భావించి, అర్చించే మనతాత్త్విక దృక్పథానికి ఇది దర్పణం. ఆశ్వయుజమాసంలోని ప్రతిపండుగ, ప్రతిసంప్రదాయమూ సమాజశ్రేయస్సు నేపథ్యంగా కలిగిందే. మానవుణ్ణి సన్మార్గగామిగా మలచేశక్తిని ప్రసాదించే పవిత్ర సందర్భం. తరతమభేదాలు విడిచి, ఒకరి ఆనందాలకు మరొకరు ఉప్పొంగుతూ, ఒకరికష్టానికి మరొకరు స్పందిస్తూ ఆదర్శవంతమైన సామాజికజీవనాన్ని ఆహ్వానించేమాసం ఆశ్వయుజం. ఆధ్యాత్మికవిశిష్టతకు ఆలవాలం. తాత్త్వికతకు ఆలంబనం. అనుబంధాలకు గోపురం.



## హనుమవాహనం

ఆరో రోజు జరిగేసేవ ఇది. త్రేతాయుగంలో తనకు సేవ చేసిన హనుమంతుణ్ణి వాహనంగా చేసుకుని స్వామి తిరువీథుల్లో ఊరేగింపుగా వెళతారు. హనుమంతుని భక్తితత్పరతను చాటిచెబుతూ, రాముడు, కృష్ణుడు, శ్రీవేంకటేశ్వరుడు అన్నీ తానేనని ఈవాహనం ద్వారా స్వామి తెలియజేస్తారు. తన భక్తితత్పరతను చాటిన హనుమంతుడిద్వారా భక్తులు స్ఫూర్తి పొందడానికి వీలుగా హనుమంతవాహనంపై స్వామి ఊరేగడం ప్రత్యేకత. సాయంవేళ స్వర్ణరథసేవ జరగడం విశేషం.



## గజవాహనం

గజేంద్రమోక్షం ఘట్టంలో ఏనుగును కాపాడిన విధంగానే, శరణు కోరేవారిని కాపాడతానని చాటి చెప్పడానికి స్వామి ఆరోరోజు రాత్రి ఈ వాహనంపై ఊరేగుతాడు. గజవాహనారూఢుడైన స్వామిని దర్శిస్తే ఏనుగంత సమస్యకూడా తొలగిపోతుందని భక్తుల విశ్వాసం.'గజం' అహంకారానికి ప్రతీక. అహంకారాన్ని అణచినమనిషి ఆరాధ్యు డవుతాడు. అహంకారం భగవంతునిదగ్గర 'దాసోఽహ' మంటుంది.

# పితృదేవతలకు ప్రీతికరం

– శ్రీ డి.వి.ఆర్. భాస్కర్

భాద్రపదబహుళపాడ్యమినుంచి భాద్రపద అమావాస్యవరకు మధ్యనున్న పదిహేనుదినాల్ని 'మహాలయపక్షాలు' అంటారు. మరణించిన తండ్రి, తాత, ముత్తాతలను తలచుకుని పుత్రులు నిర్వహించే శ్రాద్ధ, తర్పణ, పిండ ప్రదానాది పితృయజ్ఞవిధులన్నీ జరుపుకోవడానికి నిర్దేశించబడ్డవే 'మహాలయపక్షాలు'. వీటినే 'పితృపక్షా'లనీ, 'అపర పక్షాలు'అని కూడా అంటారు. మరణించిన పితృదేవతలకు భక్తిగా ఆహారాన్ని అందించి, వారి ఆకలి తీర్చడమే ఈ మహాలయపక్షాల ముఖ్యోద్దేశం.

మరణించిన ప్రాణి 'ఆత్మ'రూపంలో పితృలోకంలో ఉంటుంది. ఆ ఆత్మ తన పూర్వకర్మానుభవంకోసం తిరిగి ఈ భూమిమీద 'జీవాత్మ'గా అవతరించడానికి... అన్నాన్ని ఆశ్రయించి, తద్వారా పురుషప్రాణిదేహంలో ప్రవేశించి, శుక్రకణంగా రూపొంది, స్త్రీగర్భకోశంలో ప్రవేశించి, శిశువుగా రూపాంతరం చెంది' ఈ భూమిమీదకు వస్తుంది. మరణించిన మనపితరులకు మోక్షం కలగాలంటే.. కర్మ పరిపక్వం కావాలి.

అలా జరగాలంటే... పితృదేవతలు దేహధారణ చేసి, ఈలోకంలోకి రావాలి. అలా రావాలంటే వారికి అన్నాన్ని అందించాలి. అది రక్తం పంచుకుపుట్టిన పుత్రులే అందించాలి. అప్పుడే వారికి పితృ ఋణం తీరుతుంది. ఋణం తీరడమే 'మోక్షం'.

### తద్దినాలు పెడుతున్నా... మహాలయపక్షాలు పెట్టాలా?

మరణించిన తండ్రితిథినాడు పుత్రుడు తద్దినం పెట్టడం హిందూ సంప్రదాయంలో ఆచారం. పితృతిథినాడు పుత్రుడు తన తండ్రి, తాత, ముత్తాతలను తలచుకుని పితృయజ్ఞాన్ని నిర్వహిస్తాడు. మరి పుత్రులు లేనివారిసంగతి ఏమిటి? వారిగతి అధోగతేనా? అంటే..'కాదు' అంటుంది శాస్త్రం.

మన కుటుంబాలలో ఏ కారణంచేతనో పెళ్లికాని సోదరీసోదరులు మరణించి ఉండవచ్చు, పెళ్లయినా సంతానంకలుగని దంపతులు మరణించి ఉండవచ్చు, ప్రమాదాల్లోమరణించిన చిన్నపిల్లలు ఉండవచ్చు, యుద్ధాలలో కానీ, శిక్షలద్వారా కానీ, ఆత్మహత్యలద్వారా కానీ, ప్రకృతివైపరీత్యాలద్వారా కానీ గుర్తుతెలియక మరణించి ఉండవచ్చు.

అటువంటివారందరికికూడా తిలోదకాలిచ్చి, వారిని ఊర్ధ్వలోకాలకు పంపడం కోసం నిర్దేశించినవే ఈ 'మహాలయపక్షాలు'. పితృతిథినాడు మూడుతరాలవారికి (తండ్రి, తాత, ముత్తాత) మాత్రమే తిలోదకాలతో, పిండ ప్రదానం ఇవ్వబడుతుంది.

కానీ, ఈ మహాలయపక్షాలు' పదిహేనురోజులు మన వంశంలో మరణించినవారికి మాత్రమేకాక, పుత్రులు లేని గురువులకు, స్నేహితులకుకూడా తిలోదకాలతో, పిండ ప్రదానం ఇచ్చే అర్హత, అధికారం మనకు ఉంది. దీనినే 'సర్వకారుణ్యతర్పణవిధి' అంటారు.

ఏ కారణం చేతనైనా తద్దినం పెట్టలేని పరిస్థితి ఏర్పడి, తద్దినం పెట్టకపోతే.. ఆ తద్దినం పెట్టనిదోషం 'మహాలయం' పెట్టడంవల్ల పోతుంది.

మహాలయపక్షాలలో పితృదేవతలు "మావారసుడు పితృయజ్ఞం చేయకపోతాడా.., మా ఆకలితీర్చకపోతాడా" అనే ఆశతో ఇంటిని ఆవహించి ఉంటారు. పితృయజ్ఞం చేసిన వారసునికి సకలఐశ్వర్యాలు కలగాలనీ... పిల్లాపాపలతో సంతోషంగా ఉండాలనీ దీవిస్తారు. లేకుంటే శపించి వెళ్లిపోతారు. అందుచేత తప్పకుండా 'మహాలయపక్షాలు' పెట్టితీరాలి.

### మహాలయపక్షాలు ఎలా పెట్టాలి?

- సాధారణంగా తండ్రి చనిపోయిన తిథినాడు 'మహాలయం' పెట్టడం ఉత్తమం. ఏ కారణం చేతనైనా



పట్టుదల ఉంటే ఎంత గొప్పకార్యమైనా నిర్వహించవచ్చు

అలా పెట్టడం వీలుకాని పరిస్థితిలో 'మహాలయ అమావాస్య'నాడు పెట్టడం ప్రశస్తం. దీన్నే 'సర్వపితృ అమావాస్య' అంటారు. మరణించిన బంధువులందరికీ... ఈ రోజునే వారి వారి తిథులతో సంబంధం లేకుండా 'మహాలయం' పెట్టాలి.

- కిందటి సంవత్సరం చనిపోయిన వారికి మహాలయ పక్షాలు మొదలైన 4వ రోజు లేక 5వ రోజున మహాలయం పెట్టాలి. ఇది స్వర్గస్థులైనవారికి ఎంతో ప్రీతికరం.
- భార్య మరణించిన వాడు 'అవిధవనవమి'నాడు అనగా తొమ్మిదవరోజున మహాలయం పెట్టాలి. ఆ రోజున సుమంగళిగా మరణించిన తన భార్యను తలచుకుని ఒక సుమంగళికి భోజనం పెట్టి, పసుపు, కుంకుమ, గాజులు, పూవులు, చీర, రవికె పెట్టి సత్కరించి పంపాలి.
- చిన్నపిల్లలు చనిపోతే.. వారికి పన్నెండవరోజున 'మహాలయం' పెట్టాలి. చిన్నపిల్లలు అంటే.. పది సంవత్సరాలు దాటనివారు. ఒకవేళ పది సంవత్సరాల వయస్సులోపే ఉపనయనం జరిగి ఉంటే.. ఆ పిల్లవాడు మరణించిన తిథినాడే 'మహాలయం' పెట్టాలి.
- ఇక ప్రమాదాలలో కానీ, ఉరిశిక్షవల్ల కానీ, ఆత్మహత్య చేసుకుని మరణించినవారికి 'ఘటచతుర్థి లేక ఘాయల చతుర్థి'నాడు అంటే అమావాస్య ముందు రోజున పెట్టాలి.

మహాలయం పెట్టే కర్త శుచిగా స్నానంచేసి, దర్భలతో చేసిన ఉంగరాన్ని ధరించి, శ్రద్ధగా, భక్తిగా, మంత్రపూర్వకంగా ఐదుగురు బ్రాహ్మణభోక్తలతో ఈ పితృకార్యాన్ని నిర్వహించాలి.

## ఐదుగురు భోక్తలు ఎందుకంటే...

1) పితృదేవతలకు అధిపతి శ్రీమహావిష్ణువు. కనుక విష్ణు దేవతాప్రీత్యర్థం ఒకభోక్త.

2) ఇది విశ్వేదేవస్థానం. విశ్వ, ఆర్ద్ర దేవతల ప్రీత్యర్థం ఒక భోక్త.

3) ఇది పితృస్థానం. తండ్రి, తాత, ముత్తాతల ప్రీత్యర్థం ఒక భోక్త.

4) ఇది మాతామహస్థానం. తల్లి తండ్రి, తాత, ముత్తాతల ప్రీత్యర్థం ఒక భోక్త.

5) ఇది సర్వకారుణ్యస్థానం. తండ్రితరపు బంధువుల, తల్లి తరపు బంధువుల, గురువుల, స్నేహితుల, తక్కినవారి ప్రీత్యర్థం ఒక భోక్త.

ఈ విధంగా పురోహితుని సూచనానుసారం ఈ పితృకార్యాన్ని హోమ, తర్పణ, పిండప్రదానాదివిధులతో అత్యంత శ్రద్ధగా నిర్వహించాలి. ఐదుగురు భోక్తలతో ఈ పితృయజ్ఞం జరిపించే ఆర్థికస్తోమతలేని వారు కనీసం ఒక భోక్తతో అయినా ఈ క్రతువు జరపాలి. అంతేగానీ... మహాలయం పెట్టకుండా మాత్రం ఉండకూడదు.

మరొక్క విషయం. మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు విధివిధానపితృకర్మలు నిర్వహించడం.. వారసుల విధి, కర్తవ్యం, బాధ్యత.

### వైకుంఠపాళి
### :: 57- సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 మ | | 2 ద్రో | ణా | 3 చా | ర్యు | 4 డు | | |
| నో | | ణి | | రు | | రే | | 5 తా |
| 6 ర | మ | | 7 చా | మ | రం | | 8 పా | ట |
| మ | | 9 మ | | తి | | 10 దం | | క |
| | 11 సా | ధు | వు | | 12 కుం | డ | లు | |
| 13 ప్ర | | వు | | 14 రే | | ము | | 15 సు |
| 16 చి | న్న | | 17 త | ణు | కు | | 18 సు | మం |
| త్తి | | 19 మ్మ | | మ | | 20 క్ష | | త్రు |
| | | 21 అ | ది | తి | | 22 మ | ధు | డు |

# తోమని పళ్యాలవాడు

– ప్రాచార్య గార్లపాటి దామోదరనాయుడు

శ్రీ వేంకటేశ్వరునికి తిరుమల కొండమీద ప్రసాదాలు తయారుచేయడానికి మట్టి పాత్రలనే ఉపయోగిస్తారు. ఒక్కసారి ప్రసాదం తయారుచేయడానికి ఉపయోగించిన పాత్రను తిరిగి వాడరు. తోమి శుభ్రం చేసే విధానం లేనటువంటి నియమం గలవాడు శ్రీస్వామి. తిరుమలకొండకు నిత్యం మట్టిపాత్రలు శ్రీవారిమెట్టు ద్వారా తీసుకొని వెళ్లేవారు.

ఈ పాత్రలు శ్రీనివాసమంగాపురం దగ్గరలో ఉన్న ఒక పల్లెవాసులు తయారుచేసి తీసుకుని వెళ్లేవారు. పెద్దదేవునికి సేవ చేసేవారున్న ఊరని (పెద్దదేవుణ్ణే పెరుమాళ్లు అనేవారు) ఆ కారణంగానే ఈ ఊరికి పెరుమాళ్ల పల్లె అనే పేరు వచ్చింది.

ఈ 'తోమనిపళ్యాలు' ప్రయోగం గణపువరపు వేంకట కవి ప్రబంధరాజవేంకటేశ్వరవిజయవిలాసం పద్యం 882 నందు కనిపిస్తాయి.

తెలుగుసాహిత్యంలో 'తోమనిపళ్యాలవాడు' అని శ్రీవేంక టేశ్వరస్వామిని ఉద్దేశించి తొట్టతొలిసారిగా, పదప్రయోగం చేసిన వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యుడు.

"వేదుకొందామా వేంకటగిరి వేంకటేశ్వరుని వేదుకొం దామా" అనే సంకీర్తనలోని చరణంలో 'తోమని పళ్యాలవాడె, దురితదూరుడె, వాడు అలమేల్మంగా వేంకటాద్రినాథుడే...' ఈ మాటనే గ్రహించి, తెనాలిరామకృష్ణుడు ఘటికాచలమాహా త్మ్యంలో శ్రీవేంకటేశ్వరునివర్ణనలో ప్రయోగించాడు.

అనాదికాలంగా తిరుమలపై భక్తులకు ప్రసాదాల పంపిణీ ఇప్పటి మాదిరిగా ఒక చిన్నదొన్నెలో గుప్పెడు ప్రసాదం ఇచ్చేట్లుగా ఉండేదికాదు. 'ప్రసాదం' అంటే కడుపునిండా ఇచ్చే మధురపదార్థం! అది ఏవిధంగా ఇచ్చేవారో తెలిస్తే 'తోమని పళ్యాలవాడు' (అన్నమయ్య ప్రయోగం) తోమని పళ్యాల నేమ గాడు (రామకృష్ణుని ప్రయోగం) అనే పదాలకు అర్థం తెలు స్తుంది.

దేవాలయ యాజమాన్యంవారు, అలిపిరిపాదాల మండపంవద్ద కుమ్మరులతో ఒక ఒప్పందం చేసుకున్నారు. అక్కడి కుమ్మరులకు వేరేగా అమ్మకానికి కుండలు చేయనక్కర లేదు.



## సూర్యప్రభ వాహనం

**ఏడోరోజు ఉదయం సప్తాశ్వాలపై భానుడు రథసారథిగా ఎర్రటిపూలమాలలు ధరించి, స్వామి ఈ వాహనం మీద ఊరేగుతాడు. ప్రపంచానికి వెలుగు ప్రసాదించే సూర్య భగవానుడికి తానే ప్రతిరూపమని చాటి చెబుతారు. దక్షిణదేశంలోని వైష్ణవాలయాలలో ఎక్కడాలేనంతటి ఎత్తైన రమణీయమైన సూర్యప్రభవాహనం మలయప్పకే ఉంది. సూర్య చంద్రులు శ్రీవారినేత్రద్వయం.**

## చంద్రప్రభవాహనం




**ఏడోరోజు రాత్రి తెల్లటివస్త్రాలు, పూమాలలు ధరించి, స్వామి చంద్రప్రభ వాహనంపై విహరిస్తారు. సూర్యుడి తీవ్రత, చంద్రుని శీతలత్వం రెండూ తన అంశ లేనని ఈ వాహనాల ద్వారా తెలియజేస్తాడు. భగవంతుడు చంద్రుని రూపంలో ఓషధులను పోషిస్తున్నాడనే అర్థంలో చంద్రప్రభవాహనం. అంతేగాక చంద్రుణ్ణికూడా శాసించేమూర్తి తానే అని చెప్పడం మరొక విశేషార్థం.**

వారుచేసే కుండలన్నీ తిరుమల శ్రీవారి ఆలయానికి పంపాలి. ఆవిధంగా కుండలు విరిగిపోకుండా 'కుండల కావళ్లు' దొంతరులు దొంతరులుగా తిరుమల ఆలయాన్ని చేరుకునేవి.

స్వామిదర్శనమైన ప్రతిభక్తునికి పళ్లెరాలలో ప్రసాదమివ్వడం, ఆ తర్వాత వాటిని శుద్ధిచేయడం, ఇవి చేయడానికి అదనపు సిబ్బంది కావలసి ఉండడం, శుద్ధి చేసే పదార్థాల సరఫరా ఇదంతా అనవసరపుఖర్చు, దీనికి బదులు ఒక సులువైనపద్ధతిని వారు కనిపెట్టారు. అదే తోమనిపళ్యాలపద్ధతి.

ఎట్లంటే, పాదాలమండపం వద్ద గల కుమ్మరులు చేసి పంపే కుండల కావళ్లు. ఎడతెరపిలేకుండా వస్తున్నాయి కాబట్టి– ఒక కొత్తకుండ పైభాగాన్ని ఒక కర్రముక్కతో కొట్టి కుండ క్రిందిభాగం ఒక పాత్రలాగా ఏర్పడగా, ఆ కుండలో ఒక తామరాకునో (లేక) కుట్టిన విస్తరినో వేసి దానిపై పొంగలి / చక్కెరపొంగలి / పులిహోర / దధ్యోదనము లేదా ఇతర భక్షణపదార్థాలు పెట్టి ఇచ్చేవారు.

భక్తులు వాటిని అక్కడే తిని, ఆ కుండను పారవేసేవారు. అవి విరిగి ముక్కలయ్యేవి. ఈ విధంగా ఈనాడు ఆధునిక సామూహిక భోజనకార్యక్రమాల్లో 'యూజ్ అండ్ త్రో' పద్ధతిలో ఆహారనియమాలన్నీ జరిగిపోయేపద్ధతి శతాబ్దాల క్రిందటనే కొండపై ఉండేదనడానికి ఈ తోమనిపళ్యాల పద్ధతియే ప్రత్యక్ష ఉదాహరణ. మహాభక్తుడైన కురువరతినంబి కుమ్మరుల కులంలో పుట్టినవాడు. స్వామివారిపై అంచంచలమైన భక్తి కల్గి ఉన్నవాడు. స్వామి ప్రతిమను మట్టితో తయారు చేసుకుని తులసీదళాలనుకూడా మట్టితోనే తయారు చేసి, స్వామిని పూజిస్తూ తృప్తి పడ్డాడు. కొత్త కుండలో స్వామికి నైవేద్యాలు సమర్పించి తరించిన ఈ భక్త శిఖామణి మనకు ఆదర్శం.





## రథోత్సవం

గుర్రాలవంటి ఇంద్రియాలను మనస్సు అనే తాడుతో కట్టి రథంవంటి శరీరాన్ని రథికుడైన ఆత్మద్వారా అదుపు చేయాలనే తత్త్వజ్ఞానాన్ని స్వామి ఎనిమిదో రోజు తన రథోత్సవంద్వారా తెలియజేస్తాడు. స్వామి రథసేవలో పాల్గొన్న వారికి పునర్జన్మ ఉండదని విశ్వాసం.

శరీరమే ఒక రథం. పంచేంద్రియాలే గుర్రాలు. మనసు వాటిని అదుపు చేసే పగ్గం. ఆత్మ రథచోదకుడు- స్వామి అని శాస్త్రాలు చెబుతున్నాయి. ఇంద్రియాలను అదుపుచేసి, నరతత్త్వంనుండి నారాయణతత్త్వంవైపు పయనించగలిగితే శరీరరథం భద్రంగా ఉంటుంది. ఈ భావాన్ని చాటి చెప్పడానికే రథంలో శ్రీవారిని తిరువీధులలో ఊరేగిస్తారు.



## అశ్వవాహనం

ఎనిమిదోరోజు రాత్రి అశ్వవాహనం మీద స్వామి ఊరేగుతాడు. చతురంగబలాల్లో అత్యంత ప్రధానమైంది అశ్వబలం. కలియుగాంతంలో శ్రీనివాసుడు అశ్వవాహనంమీద వచ్చి, దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేస్తాడని చాటి చెప్పడమే దీని ఉద్దేశం. అదుపు, ఆజ్ఞలేనిగుర్రాల లాంటి పాపుల్ని- జీవుల్ని అదుపులో పెట్టగలనని నిరూపించడానికే అశ్వవాహనం. అన్ని దేశాలకు, అన్నిలోకాలకు అధిపతిని నేనే అనే అర్థంలో 'అశ్వవాహనం'.

# రమణీయ శ్రీరామాయణం

రచయిత్రి - ముళ్లపూడి శ్రీదేవి, సైజు-1/4 క్రౌను,
పుటలు-217, వెల- రూ.250/-,
ప్రతులకు - కథాప్రపంచం, ఇ.నెం.6-1-111,
వరదరాజనగర్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517507.
సెల్- 99082 84105 / 95535 18568

## గ్రంథసమీక్ష

కథాప్రపంచంలో రామాయణానికున్న ప్రచార విశిష్టత సాటిలేనిది. సీతారాములు ఆంధ్రులకు ఆత్మ బంధువులు. వీరిద్దరినీ తమ కుటుంబసభ్యులుగా భావిస్తుంటారు తెలుగువారు. అందుకనే, తెలుగు సాహిత్య ప్రపంచంలో 'రామసుధ' నిరంతరం వివిధ ప్రక్రియల్లో ప్రవహిస్తూనే ఉంది. ఈ పరంపరలో వచ్చిన కొత్త పుస్తకం 'రమణీయ శ్రీరామాయణం'. ఈ పుస్తక రచయిత్రి ముళ్ళపూడి శ్రీదేవి. 'సంపూర్ణ రామాయణం' వంటి గొప్ప చలన చిత్రాల్ని నిర్మించి, శ్రీరామచంద్రుడికథను వెండితెరపై అజరామరం చేసిన బాపు, రమణల్లో ఒకరైన ముళ్లపూడి వెంకటరమణ సతీమణి శ్రీదేవి.

శ్రీమద్రామాయణాన్ని ఎవరు ఎన్నివిధాల అనువదించినా పాఠకులకు ఇంకా చదివి ఆనందించాలనే కుతూహలం ఉంటుంది. ఈ 'రమణీయం'లో ఉపమాలంకార ప్రాచుర్యాన్ని రామాయణంలో అంతర్లీనంగా అందిస్తూ, అందువల్ల కలిగే ఆనందాన్ని పాఠకలోకానికి చక్కగా అందించడంలో రచయిత్రి ఒక చక్కటి రాచమార్గాన్ని ఎన్నుకొని, సన్నివేశాలలో వాల్మీకిమాటలు యథాతథంగా చెప్తూ- అక్కడ ఉండే 'ఉపమ'లను చక్కగా సమన్వయం చేస్తూ పురోగమించారు.

ప్రతికాండానికి చెందిన అధ్యాయప్రారంభంలో తదనుగుణమై, సూచ్యార్థస్ఫోరకంగా ఉండే శ్లోకం లేదా ప్రసిద్ధగేయం ఉంచడం ఒక విశిష్టత. మొత్తం మూలం ఏడుకాండలైతే, 'రమణీయం'లో 'ఏడుఅధ్యాయాలు'గా పేర్కొన్నారు. వాల్మీకి చెప్పిన శ్లోకాలనూ ఆయా సన్నివేశాల్లో గ్రహించి, తమ రచనా 'రామణీయకత'కు ప్రామాణ్యశోభ చేకూర్చారు. 'బోల్డు' అక్షరాలలో- ముఖ్యవాక్యాల్ని ముద్రించడం చాలా సముచితంగా ఉంది.

దశరథుణ్ణి గూర్చి 'తేజోమయ కిరణాలతో ఉదయ భాస్కరుడిలాగా ఆ మంత్రులతో దశరథమహారాజు అయోధ్యానగరాన్ని పరిపాలిస్తున్నాడు" (పుట.13), "దశరథునికి కలిగిన సంతానం" పూర్వాభాద్రా ఉత్తరాభాద్రానక్షత్రాల వలె, రెండు రెండు జంటలుగా ఆ నలుగురు బిడ్డలూ మెరిశారు (పుట.15)-ఇలా ప్రతిపుటలో, ప్రతిసన్నివేశంలో ఉపమాలంకారాలు మెరుస్తూనే ఉంటాయి.

ఈ పుస్తకం చదవడానికి మొదలుపెట్టే- ఏకధాటిగా పూర్తయ్యే దాకా చదివించే రచనాకర్షణ, ఆహ్లాదం, స్పష్టత పాఠక హృదయాల్ని పులకితం చేస్తాయి. ఎక్కడ కానీ అన్వయకాఠిన్యం, మహావాక్యాలూ కన్పించవు. పొడి పొడి పదాలే తప్ప పెద్ద పెద్ద సమాసాలు ఉండవు. సరళవ్యావహారికంలో రామాయణ రమణీయాన్ని అందించడమే కాదు- రామాయణ కథామృతాన్ని సంతోషంగా ఆస్వాదించే విధంగా రచన కమనీయంగా ఉంది. వాల్మీకి ప్రయోగించిన ఉపమాలంకారాలను మూలస్తంభాలుగా నిలిపి, వాటికి రామకథను అల్లి, ఈ చలువపందిరిని నిర్మించారు- రచయిత్రి.

తెలుగులో ఇంత మంచిరామాయణం సరళ వచనంలో హృదయాకర్షకంగా రావడం తెలుగు పాఠకలోకం చేసుకున్న అదృష్టం. అక్కడక్కడా సముచితరేఖాచిత్రాలు, అందులోనూ బాపుగారివి చేర్చడంవల్ల, పాయసంలో పచ్చకర్పూరం వేయడంతో వచ్చే సువాసనలాగా ఆయా శ్లోకాలు గుబాళిస్తున్నాయి. పుస్తకం ఆబాలగోపాలానికి ఆనందాన్ని ఇస్తుందనడంలో సందేహం లేదు.

"కథాప్రపంచం" ప్రచురణకర్తలు ఇలాంటి మంచి రచనను అందించినందుకు ధన్యవాదాలు. వీరిద్వారా ఇలాంటి ఉత్తమగ్రంథాలు వెలువడి, సమాజానికి ఇతోధికంగా సేవలందిస్తారని ఆశిద్దాం!!

*- డా॥ కంపల్లె రవిచంద్రన్.*

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** సోమరితనమూ, అలసత్వము, చెడు స్నేహితులవల్ల వ్యాపారాల్లో ధననష్టం. నెలాఖరులో ధనలాభం. పుత్రసంతాన ప్రాప్తికల్గును. భూగృహస్థిరాస్తుల క్రయవిక్రయాలవల్ల లాభం. సూర్యభగవానుని ఆరాధన మంచిది.



**వృషభం–** ఆహ్లాదకరమైన సుఖమయజీవనం గడుపుతారు. భూలాభం కలుగుతుంది. దైవారాధనతో ప్రశాంతత పొందుతారు. విద్యావిషయమై గుర్తింపు కల్గుతుంది.



**మిథునం–** ఈ మాసములో సంపదలను సృష్టించడంతో ఆర్థికవికాసము గల్గుతుంది. ధనధాన్య లాభాలు కల్గుతాయి. పంటలు కలిసి వస్తాయి. బంధువుల వలన అవమానం.



**కర్కాటకం–** బంధుమిత్రసమాగమం, నిత్య సంతోషం, ధనలాభం. గృహోపకరణవస్తువులు, బంగారు అభరణాలు కొనుగోలు చేస్తారు. శరీరారోగ్యం కుదుటపడుతుంది. గృహ, కల్యాణాదిశుభయోగాలకు ప్రయత్నిస్తారు.



**సింహం–** ఉన్నతఉద్యోగులకు స్థానభ్రంశం, న్యాయస్థానాలను ఆశ్రయించుట, నరఘోష, శత్రుపీడనుండి ఉపశమనం. రైతులకు నిత్యసంతోషం, ఆరోగ్యం, సంపదభివృద్ధి, లక్ష్మీకరంగా ఉంటుంది. విద్యార్థులకు ఉద్యోగవిషయమై శుభవార్తలు.



**కన్య–** దూరప్రాంతాలకు స్థానచలనంవల్ల అధిక ధనవ్యయం, నియమాలను అతిక్రమించడంవల్ల జరిమానాలు కట్టాల్సి వస్తుంది. వాహనప్రమాదం పొంచి ఉంది. మృత్యుంజయమంత్రజపం ఉపయుక్తంగా ఉంటుంది.



**తుల–** ద్రవ్యలాభం. ఇంటిలో ఎల్లప్పుడూ ఉత్సవవాతావరణం, సమస్త దోషాలు తొలగి సకలైశ్వర్యాలు కల్గుతాయి. శాంతి సౌభాగ్యాలు వర్ధిల్లుతాయి. తమలపాకులతో అర్చన ఆంజనేయ స్వామికి చేయించడం మంచిది.



**వృశ్చికం–**మానసిక అశాంతి తగ్గుతుంది. అన్ని వర్గాలవారికి ధనలాభం. ఆశించినకార్యాలు సత్వరమే పూర్తవుతాయి. సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయి. ఆనందంగా ఉండే సమయం.



**ధనుస్సు–** వాహనాలమార్పులు చేస్తారు. కోపాన్ని వదిలితే అన్నింటా జయం. పదిమందిలో గౌరవం లభిస్తుంది. ఆశించిన ధనలాభం వృత్తివ్యాపారాలలో వస్తుంది.



**మకరం–** హృదయంలో తాపం, వ్యాకులత, అల్పభోజనం, అసత్యం పలుకుట, సంస్థలను మోసగించే ప్రయత్నంలో విఫలమగుట, కీర్తి చెడుట.



**కుంభం–**కుటుంబవాతావరణం సంతోషంగా సుఖమయంగా ఉంటుంది. సంతానం వృద్ధిలోకి రావడం ఊరట కల్గిస్తుంది. సంతానం విషయంలో శుభకార్యాలకు సంసిద్ధమవుతారు. మీకుటుంబ సభ్యుల ఆరోగ్యస్వస్థతకోసం వైద్యసహాయం అవసరమౌతుంది.



**మీనం–** న్యాయస్థానాలలో ప్రతిబంధకాలు తొలగుతాయి. ఆర్థికంగా ముందంజ. యత్నకార్యసిద్ధి, సుఖసంతోషాలు కలుగుతాయి. భార్య ఆరోగ్యవిషయంలో జాగ్రత్తలవసరం. భూగృహలాభాలు కలుగుతాయి.

గోచారఫలాలు - ఆయామాసాల్లో గ్రహసంచారాన్ని బట్టి ఉంటాయి



హరిదాస వాఙ్మయంలో...

# శ్రీవేంకటాచలాధీశుడు

6

- శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు

## శ్రీపాదరాయలవారి సాహిత్యం - శ్రీవేంకటేశ్వరుడు

కర్ణాటకహరిదాసశ్రేష్ఠులను స్మరించేటప్పుడు మొట్ట మొదట శ్రీపాదరాయలవారిని స్మరించడం సంప్రదాయం. శ్రీమన్మధ్వాచార్యులపరంపర వీరిది. నాటిచంద్రగిరి ప్రభువైన సాళువ నరసింహరాయలచే వీరు భక్తి గౌరవాదరపూజా సత్కారాల్ని పొందారు.

వీరు కన్నడంలో దేవతాస్తుతులతోపాటు, శ్రీకృష్ణ లీలలను, వైరాగ్యభావప్రబోధకాలైన కీర్తనలను, మధ్వమత ప్రమేయకీర్తనలను, తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామిని స్తుతించే కీర్తనలను రచించి గానం చేశారు.

శ్రీపాదరాయలవారి కీర్తనలు సులభ కన్నడ పద జాలంతో ద్రాక్షాపాకంతో కూడి రంజకరాగతాళాలతో మేళ వించి పాడుకోవడానికి, భావయుక్తంగా అభినయానికి కూడా అనుకూలమైనవి. ముఖ్యంగా శ్రీపాదరాయలవారు తిరుపతి శ్రీవేంకటేశ్వరుణ్ణి స్తుతించిన కొన్నికీర్తనలకు ఉదాహరణ-

హరే వేంకట శైలవల్లభ పొరెయబేకు ఎన్న
దురితదూర నీ నల్లదెజగదొళు పొరెవరనాకాణె నిన్నాణె ॥

(హరేవేంకటశైలవల్లభా! నన్ను కాపాడవలెను. నీవు దురితాలను దూరం చేసేవాడవు. నీవుతప్ప ఈ ప్రపంచంలో నన్ను కాపాడేవారు మరొకరు లేరు. అని భావించాను. ఇది ముమ్మాటికి నిజం.)

ఇందిరేశ అరవిందనయన ఎన్న తందే తాయి నీనె।
పొంది దవర అఘవృందవక ళెవ మందరాద్రి ధరనె॥శ్రీహరియే॥



### చక్రస్నానం

తొమ్మిదోరోజు ఉదయం స్వామి చక్రస్నానం జరుపుతారు. వరాహస్వామి ఆలయఆవరణలో వివిధ సుగంధద్రవ్యాలతో ఉభయనాంచారులతో స్వామికి అభిషేకసేవ జరుగుతుంది. అనంతరం శ్రీవారికి మరోరూపమైన చక్రత్తాళ్వార్‌ను వరాహస్వామి పుష్కరిణిలో స్నానం చేయించడంతో ఉత్సవాలు ముగుస్తాయి. చక్రత్తాళ్వార్ స్నానమాచరించే సమయంలో కోనేరులో స్నానం చేస్తే సకలపాపాలూ నశించి, కష్టాలు తీరుతాయని భక్తుల విశ్వాసం.

ఈ చక్రస్నానసమయంలో వేదమంత్రోచ్చారణ సాగుతుండగా, భక్తులు ముక్తకంఠంతో గోవింద! గోవింద! గోవింద! అంటూ పుష్కరిణిలో 'మునకలు' వేస్తారు. చక్రస్నానానికే అవభృథస్నాన మని పేరు. బ్రహ్మోత్సవాలు పూర్తి అయినందుకు ఈ చక్రస్నానం గుర్తుకూడా!

ఈ సందర్భంలో భక్తులు స్నానం చేస్తే పాపవిముక్తి, శత్రుమర్దనం, వాగ్వృద్ధి, ధనధాన్యసంపత్తులు, విషమృత్యు నాశనం, రాజ్యపదవులు సిద్ధిస్తాయని పెద్దల నమ్మకం.



శ్రీనివాసుడు భవరోగవైద్యుడు

(ఇందిరేశ, అరవిందనయన నాకు తల్లివి, తండ్రివి నీవే! నిన్నాశ్రయించిన వారి పాపసమూహాన్ని పారద్రోలే మందరాద్రిధరుడైన కూర్మాకృతిదేవుడవు నీవు.)

ఆరునిన్న హొరతెన్నపొరెవరో నీరజాక్ష హరియె అ-
పారమహిమ పురాణపురుష ఘోరదురితగళ దూరమాడిసో ॥

(నీవుతప్ప నన్నుకాపాడేవారు మరొకరు లేరు. అపార మహిముడవు, పురాణపురుషుడవు, నీరజాక్షుడవు అయిన హే హరి! నా ఘోరదురితాలను దూరంచేయవయ్యా!)

మంగళాంగ మహనీయ గుణార్ణవ గంగోదితపాద ।
అంగజపిత అహిరాజశయ్య శ్రీరంగవిఠల దొరెయే ॥ శ్రీహరియె॥

(మంగళాంగ, మహనీయ గుణార్ణవ, గంగోదిత పాద, మన్మథజనక, అహిరాజశయ్య, హే శ్రీరంగవిఠల, శ్రీహరి కాపాడవయ్యా!)

పై పాటలో శ్రీనివాసుణ్ణి స్తుతించేటప్పుడు విశేషణాత్మకమైన పదాలన్నీ కూడ శ్రీహరి లీలావతారాల్ని గుర్తుకు తెస్తున్నాయి.

శ్రీపాదరాయలవారు వ్రాసిన మరొక కృతిలో 'భూషణకె భూషణ ఇదు భూషణ। శేషగిరియవాస (యేలె) శ్రీవేంకటేశ' అనేది సుప్రసిద్ధం. ఈ పల్లవిలో భూషణం అంటే అందం. శ్రీవేంకటేశ్వరుడు ఈ కొండపై నిలిచి ఉండడమే భూషణం అని అంటారు. ఈ మాటలకు సుందరంగా భావార్థగర్భితంగా శ్రీవాదిరాజు ఇలా చెప్పారు.

"దృష్ట్వా దిశిదిశి స్వీయాన్ దయయా పాలయన్నివ ।
వర్తతే విశ్వతశ్చక్షుర్వేంకటే వేంకటేశ్వరః"

(నాలుగుదిక్కులలోనున్న తన వారందరిని చూడడం కోసమే ఎత్తైనపర్వతంపై నిలబడి విశ్వతఃచక్షువై శ్రీవేంకటేశ్వరుడు ఈ వేంకటపర్వతంపై అద్భుతంగా నిలబడి ఉన్నాడు.)

శ్రీపాదరాయలవారికృతుల్లో మరొకటి 'స్మరిసిదవరను కాయ్య' అనేది సుప్రసిద్ధం. ఇది మూడుచరణాలతో కూడి శ్రీనివాసుని తత్త్వాన్ని, భక్తపరాధీనతను, తెలిపేదవుతుంది.

"స్మరిసిదవరను కాయ్వనమ్మ సూర్యానేక ప్రభావ ।
సురమునిగళ సంజీవ । సిరి । వేంకట ఎమ్మనుపొరెవ ॥



## ధ్వజావరోహణం

**చక్రస్నానం జరిగిన రోజు సాయంత్రం ఆలయం లోని ధ్వజస్తంభంమీద దేవతామూర్తులను ఆహ్వానిస్తూ ఎగురవేసిన ధ్వజపటాన్ని అవరోహణం చేస్తారు.**

**తొమ్మిదిరోజులపాటు నిర్వహించిన ఉత్సవసంబరాన్ని వీక్షించి, ఆనందించిన దేవతామూర్తులకు ఈ విధంగా వీడ్కోలు చెబుతూ బ్రహ్మోత్సవాలను ముగిస్తారు.**

(స్మరించినవారిని కాపాడే ఈ వేంకటేశ్వరుడు అనేక సూర్యకాంతులతో ప్రకాశించేవాడు. ఇతడు దేవతలకు, మునులకు సంజీవి. ఈతడు లక్ష్మీసహితుడై కాపాడుతాడు.)

వైకుంఠదిందలిబందు । ఈ । శేషాచలదలినింద ।
భకుతర పాలిపె నెందు । అభయకర సింధు ॥
భుకుతి ముకుతి యీవ మత్కుల దేవనె
సకలర పాలిప ఘనగుణ పూర్ణనె ।
వికసితనయన కమల కంజనాభనె
ప్రకటిత శుభకీరుతి యిందమెరెవనె ॥

(సరాసరి వైకుంఠంనుండి ఈ శేషపర్వతానికి వచ్చి ఇక్కడ నిలబడ్డ హే వేంకటేశ్వర! భక్తులను కాపాడ వలెననే లక్ష్యమే నీది. అభయకరసింధుడవు – నీవు. భుక్తిముక్తి ఫలప్రదుడవు– నీవు. నాకు కులదేవతవు– నీవు. సకల జనులను కాపాడే ఘనగుణపూర్ణుడవు. నీవు వికసించిన కమలాన్ని నాభినుంచి సృష్టించిన కల్యాణశుభకీర్తివంతుడై ప్రకాశిస్తున్నవాడవు.)

*(ఇంకా ఉంది)*

### తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# సప్తగిరి



(సచిత్ర మాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పని సరి) | | | | | | |

సెల్ నెం. | | | | | | | | | | |

**2.** కావలసిన భాష :
తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐
హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం (సంవత్సరచందా మాత్రమే) ☐

**3.** సంవత్సర/జీవిత చందా :
రూ.60/- ☐ రూ.500/- ☐

**4.** చందా పునరుద్ధరణ :
(అ) చందా నెంబరు :
(ఆ) భాష :

**5.** చెల్లించిన మొత్తం :
డి.డి.నెం. :
తేది :
(చెక్కులు స్వీకరించబడవు)

ప్రదేశం :
తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.60/-, జీవితచందా రూ.500/-లు; డి.డి. / ఎం.ఓ.ను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులో గానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి, పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప-మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# 57 వైకుంఠపాళి

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | ■ | 2 | | 3 | | 4 | ■ | ■ |
| | ■ | | ■ | | ■ | | ■ | 5 |
| 6 | | ■ | 7 | | | ■ | 8 | |
| | ■ | 9 | ■ | | ■ | 10 | ■ | |
| ■ | 11 | | | ■ | 12 | | | ■ |
| 13 | ■ | | ■ | 14 | ■ | | ■ | 15 |
| 16 | | ■ | 17 | | | ■ | 18 | |
| | ■ | 19 | ■ | | ■ | 20 | ■ | |
| ■ | ■ | 21 | | | ■ | 22 | | |

**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

### అడ్డం

2)అశ్వత్థామ తండ్రి(5); 6)లక్ష్మి(2); 7)దేవునికి దింతో విసురుతారు(3); 8)కీర్తన(2); 11)సన్యాసి(3); 12)మట్టితో చేసేవి(3); 16)చిన్నపిల్లల్ని ముద్దుగా ఇలా పిలుస్తారు(2); 17)పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక పట్టణం(3); 18)పువ్వు(2); 21)దేవకి పూర్వజన్మ(3); 22)శత్రుఘ్నుడిచేతిలో హతమైనవాడు(3)

### నిలువు

1)మేరువుకూతురు(4); 2)దీనిద్వారా ఎత్తైన ప్రదేశాల్నికూడ ఫోటోలు తీస్తున్నారు(2); 3)రుక్మిణి కూతురు(4); 4)రాజు క్రింది నుండి పైకి (2); 5)మారీచ, సుబాహుల తల్లి(3); 9)సుగ్రీవుని ఉద్యానవనం(3); 10)యముని ఆయుధం(3); 13)రాహువు తండ్రి(3); 14)నకులుని భార్య(4); 15)జహ్నుమహర్షి కుమారుడు(4); 19)జనని తిరగబడింది(2); 20)ఓర్పుకు మరొక పదం(2).

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



Edited and published on behalf of T.T.Devasthanams by Prof. K.Rajagopalan, Ph.D., Chief Editor, T.T.D. and printed at T.T.D. Press by Sri P.Ramaraju, M.A., Special Officer (Publications & Press), T.T.D. Press, Tirupati - 517507.

తిరుమల తిరుపతి దేవస్థానములు





# తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం

2020 సెప్టెంబరు
19 నుండి 27 వరకు

**26-09-2020 శనివారం**
**రాత్రి: అశ్వవాహనం**

**27-09-2020**
**ఆదివారం**
**రాత్రి: తిరుచ్చి ఉత్సవం**
**ధ్వజావరోహణం**





designpsivaprasad

SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams
printing on 25-08-2020. Regd. with the Registrar of Newspapers under "RNI" No.10742, Postal Regd.No.TRP/10 - 2018-2020
Licensed to post without prepayment No.PMGK/RNP/WPP-04/2018-2020

